తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

ఆదివారం 18.10.2026 | సంపుటి :13 సంచిక : 89 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# పొట్టకూటి కోసం వెళ్లి.. తుపాకీ పట్టి.. యుద్ధంలో బలి

## రష్యా సైన్యంలో చేరిన 267 మంది భారతీయులు

### 51 మంది మృతి, 77 మంది ఆచూకీ గల్లంతు

### తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు మృత్యువాత..

కుటుంబాన్ని ఆదుకోవాలనే ఆశ.. మంచి ఉద్యోగం సంపాదించాలనే కల.. మెరుగైన భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లాలనే ఆకాంక్ష.. ఇవే కొందరు యువకులను రష్యా వైపు నడిపించాయి. కానీ ఉద్యోగాల పేరుతో జరిగిన మోసాలు, సైనిక ఒప్పందాల ఉచ్చులు వారిని రష్యా- ఉక్రెయిన్ యుద్ధరంగానికి చేర్చాయి. చేతిలో పనిముట్లు పట్టాల్సిన యువకులు తుపాకులు పట్టాల్సి వచ్చింది. ప్రాణాలతో తిరిగి వస్తారని ఎదురుచూసిన కుటుంబాలకు విషాదమే మిగిలింది. రష్యా సాయుధ దళాల్లో చేరిన భారతీయుల్లో ఇప్పటివరకు 51 మంది మరణించగా, మరో 77 మంది ఆచూకీ తెలియడం లేదు. తెలంగాణకు చెందిన ఇద్దరు కూడా ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు.


ఇటీవల ఉక్రెయిన్ పై రష్యా జరిపిన భారీ క్షిపణి దాడుల్లో జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ (42) మృతి చెందారు




భారత్ నుంచి రష్యా వెళ్లి అక్కడ ఆర్మీలో చేరిన భారతీయులు


సౌదీ అరేబియాలో రియాద్‌లోని కింగ్ ఖాలిద్ ఎయిర్‌పోర్టుపై జరిగిన దాడిలో చనిపోయిన హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ యూసుఫ్ అలీ

- బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని సుప్రీం ఆదేశం
- రష్యా ,ఉక్రెయిన్ భీకర యుద్ధం మిగిల్చిన పెను విషాదం


మృతిచెందిన బాన్సువాడ తాడ్కోల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అఫ్జల్ ఖాన్ (43)

**హైదరాబాద్, జనంసాక్షి, ప్రత్యేక కథనం:** ఈ నెల 14న సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం, రష్యా సాయుధ దళాల్లో సుమారు 267 మంది భారతీయులు చేరారు. వీరిలో 139 మందిని సైనిక సేవ నుంచి విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మరో 51 మంది మరణించగా, 77 మంది ఆచూకీ కోసం భారత రాయబార కార్యాలయం ప్రయత్నాలు కొనసాగిస్తోంది. వీరిలో ఏడుగురు గల్లంతైనట్లు రష్యా అధికారులు ధ్రువీకరించినట్లు వెల్లడైంది. మిగిలిన వారి పరిస్థితిపై అందుబాటులో ఉన్న వివరాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ గణాంకాలు యుద్ధంలో చిక్కుకున్న భారతీయుల విషాద పరిస్థితిని వెల్లడిస్తున్నాయి.తెలంగాణ కుటుంబాల్లో తీరని విషాదం కామారెడ్డి జిల్లా బాన్సువాడ సమీపంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అఫ్జల్ ఖాన్ (43) ఆయిల్ పరిశ్రమలో, తోటల సంరక్షణ విభాగంలో ఉద్యోగాల పేరుతో వచ్చిన అవకాశాలను నమ్మి రష్యా వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత ఆయన రష్యా సైన్యంలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. ఉక్రెయిన్ సరిహద్దుల్లో జరిగిన దాడిలో ఆయన మరణించినట్లు తోటి యువకుడు పంపిన స్వర సందేశం ద్వారా మిగతా 2లో..

---

#### గోదావరి-కావేరి అనుసంధానంతో

# తెలంగాణకు నష్టం

- బనకచర్ల, నల్లమలసాగర్ ఫెయిల్ కావడంతో తెరపైకి కావేరి పేరు
- ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోంది
- రేవంత్ నీటిని విడిచిపెడితే చంద్రబాబు ఒడిసిపట్టారు
- తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారు : హరీశ్‌రావు




**హైదరాబాద్(జనంసాక్షి):** నీళ్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆక్షేపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం ఏపీ పాలకులు ఏమీ మాట్లదలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే వారు కొత్త ప్రతిపాదనలు తెచ్చారన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్ సర్కారుపై పలు విమర్శలు గుప్పించారు. నీళ్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి నీటిని విడిచిపెడితే, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఒడిసి పట్టారని హరీశ్‌రావు అన్నారు.

**కావేరి పేరుతో కుట్రకు శ్రీకారం**

అత్యంత ముఖ్యమైన నీళ్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఎల్ నినో పేరు చెప్పి కాంగ్రెస్ మిగతా 2లో..

---

# కరువొచ్చింది.. ఆదుకోండి..

## కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

### 315 కరువు మండలాల్లో కరువు నెలకొంది

### ఖేత్ బచావో అభియాన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తెలంగాణలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి వివరించారు. సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖేత్ బచావో అభియాన్‌పై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నుంచి మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన అంశాలను లేవనెత్తారు. మొక్కజొన్న, జొన్న, ఇతర పంటలకు 100 శాతం మద్దతు ధర కల్పించాలని కోరారు. ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలన్నారు. రసాయన ఎరువుల ధరలు, రాయితీలను హేతుబద్ధీకరించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

---

#### కోల్‌కతా దుర్గాపూజ మండపంలో

# తొక్కిసలాట

## ఘోర దుర్ఘటనలో 17 మంది మృతి




- బాధితుల్లో ఎక్కువగా మహిళలు
- వర్షం కురువడంతో తోపులాట జరిగి చోటుచేసుకున్న ఘటన
- ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు పరిహారం

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో సామూహిక దుర్గాపూజలో అపశ్రుతి చోటుచేసుకుంది. మండపం వద్ద జనం ఒక్కసారిగా ఎగబడటంతో తొక్కిసలాట తరహా పరిస్థితి మిగతా 2లో..

---

# ఫ్రాన్స్‌లో మళ్లీ ఉద్రిక్తత

మరోసారి భగ్గుమన్న ఆందోళనలు

# పిల్లలూ ఇంటర్నెట్ వినియోగించొచ్చు

పెద్దలతో పాటు వారికి ఆ హక్కు ఉంది

వయసు ఆధారిత ఆంక్షలు విధించలేం: సుప్రీం

# భారత్‌లో యువత అణిచివేతను ఎదుర్కొంటోంది

దేశంలో ఆందోళనలపై

ఐరాస ప్రతినిధి వ్యాఖ్యలు.. తోసిపుచ్చిన భారత్

వివరాలు 2వ పేజీల్లో..

---

# రష్యాపై ఆంక్షలు.. మెత్తబడిన ట్రంప్



### ఈ చట్టం కింద రూపొందించిన పలు ఆంక్షలు, సుంకాల ఎత్తివేత

- అమెరికా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- భారీ మినహాయింపులతో భారత్‌కు ఊరట

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ టారిఫ్‌లు విధించేలా తీసుకొచ్చిన ఆంక్షల చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఈ చట్టం కింద రూపొందించిన పలు ఆంక్షలు, సుంకాలను ఎత్తివేశారు. అమెరికా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన నివేదికను కాంగ్రెస్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రకటనతో భారత్‌కు భారీగా ఊరట లభించినట్లయ్యింది.రష్యా నుంచి డీజిల్ నుంచి కొనుగోలుకు ఇటీవల ట్రంప్ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. తొలుత 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ సరఫరా చేస్తామని, నవంబరులో మరో 5 లక్షల టన్నులు పంపేందుకు రష్యా అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. ఇంధన ధరలను వేగంగా తగ్గించడమే తన ప్రధాన లక్ష్యమని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఓవైపు రష్యా మిగతా 2లో..

---

# యువత గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

### విద్యార్థులు, మహిళా నిరసనకారులపై అమానుషంగా వ్యవహరించారు

- ఢిల్లీ పోలీసుల ప్రవర్తనపై ధ్వజమెత్తిన రాహుల్ గాంధీ
- బాధిత మహిళలతో మాట్లాడిన కాంగ్రెస్ అగ్రనేత

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఢిల్లీ పోలీసుల తీరుపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యం కోసం గళం విప్పుతున్న విద్యార్థులపై అలాగే మహిళా నిరసనకారులపై పోలీసులు దాడులు చేయడం, లైంగిక వేధింపులకు పాల్పడటం- ప్రజల గొంతుల్ని అణచి వేయడానికి జరుగుతున్న కుట్రలో భాగమని ఆయన విమర్శించారు. ప్రశ్నలు అడిగేందుకు ఎవరూ ధైర్యం చేయకుండా భయపెట్టడమే ఈ చర్యల మిగతా 2లో..



---



# దీప్కేకు బెయిల్

### షరతులతో మంజూరు చేసిన ఢిల్లీ న్యాయస్థానం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఢిల్లీలో తిరంగా మార్చ్ కోసం కనాట్‌ప్లేస్‌కు బయలుదేరిన అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఇచ్చిన శాంతి హామీని ఉల్లంఘించారని ఆరోపిస్తూ శనివారం ఉదయం ఆయన్ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా.. విచారించిన న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన మిగతా 2లో..

## కోల్‌కతా దుర్గాపూజ మండపంలో తొక్కిసలాట

నెలకొంది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందినట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ఘటనలో మరో 25 మంది గాయపడ్డారు. బాధితుల్లో ఎక్కువగా మహిళ ులు ఉన్నట్లు తెలుస్తోంది.నగరంలోని చోర్‌బగాన్ దుర్గా పూజ మండపం బయట వేచి ఉన్న జనం ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లారు. వర్షం కురుస్తున్న సమ యంలో తోపులాట జరిగిందని, కొందరు రోడ్డుపై పడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీఎం సువేందు అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు పరిహారం.. ప్రకటించిన ప్రధాని మోదీ

కోల్‌కతా తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. దుర్గామాత మండపం తొక్కిసలాటలో 17 మంది మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు.

## ఫ్రాన్స్‌లో మళ్లీ ఉద్రిక్తత

పారిస్(జనంసాక్షి):ఫ్రాన్స్‌లో విద్యారంగంలో సంస్కరణలు కోరుతూ కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు రోజు రోజుకు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఈ క్రమంలో అనేక నగరాల్లో మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పారిస్ సిటీ సెంటర్‌కు సమీపంలో ఆందోళనకారులు ఓ కారుతో పాటు దుకాణానికి నిప్పుపెట్టారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించి పరిస్థితి అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.ఫ్రాన్స్‌లో మూడో అతిపెద్ద నగరమైన లియోన్‌లోనూ అల్లర్లు చెలరేగాయి. ఓ టూరిస్టు ఆఫీస్‌కు నిప్పుపెట్టారు. మార్సెయిల్ నగరంలోనూ ఓ పోలీస్ స్టేషన్‌తోపాటు పలు దుకాణాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఈ ఆందోళనలకు కార్మిక సంఘాలు కూడా మద్దతిచ్చినట్లు సమాచారం. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. దేశవ్యాప్తంగా 166 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది కొరత, విద్యారంగానికి నిధుల లేమి, పాఠశాల భవనాల దుస్థితికి వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో కొన్ని రోజులుగా ఆందోళనలు జరుగుతున్నాయి. వీటితోపాటు యూనివర్సిటీల్లో ప్రవేశాల వ్యవస్థ కూడా సంక్లిష్టంగా ఉందంటూ విద్యార్థులు కూడా ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఇటీవల దేశంలో వందలాది పాఠశాలలకు నిప్పంటించిన విషయం తెలిసిందే.

## భారత్‌లో యువత అణిచివేతను ఎదుర్కొంటోంది

**న్యూయార్క్(జనంసాక్షి):**

భారత్‌లో యువత చేపట్టిన ఆందోళనల గురించి ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి గినా రొమెరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి పోరాడుతున్నందుకు ఆ యువత.. ప్రభుత్వం నుంచి వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడడానికి వారికి తగిన స్వేచ్ఛ లేదంటూ పలు నివేదికలను ఐరాస సమావేశంలో ప్రస్తావించారు. ఈ ఆరోపణలను ఐరాసలోని భారత దౌత్యవేత్త అనుజ్ స్వరూప్ కొట్టిపడేశారు. గినా రొమెరో చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని స్పష్టం చేశారు. అధికారిక ధ్రువీకరణ లేని కొన్ని కథనాలను ఆధారంగా తీసుకొని.. ఈ ఆరోపణలు చేశారన్నారు."ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలను భారత్ గమనించింది. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి శాంతియుత సమావేశ స్వేచ్ఛ, సంఘ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత పత్రికారంగం, జాతీయ మానవ హక్కుల కమిషన్ వంటివి పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయి. కేవలం పేరు లేని కొన్ని నివేదికలను ఆధారంగా చేసుకొని.. ఓ దేశంలోని యువత వివక్షను ఎదుర్కొంటున్నారని వాదించడం సరైన చర్యకాదు. ఇటువంటి అత్యున్నత స్థాయి సమావేశాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేసి, ఐక్యరాజ్యసమితి దాని సంస్థలు విశ్వసనీయతను కోల్పోతున్నాయి.






## దీప్కేకు బెయిల్

బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో పీస్ బాండ్‌పై సంతకం చేయాలని ఆదేశించినట్లు పోలీసు వర్గాలు వెల్లడిం చాయి. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత దీప్కే విడుదలవుతారని పేర్కొన్నాయి.దిల్లీలోని కనాట్‌ప్లేస్ వద్ద 'లెహ్రా దో తిరంగా' పేరుతో శుక్రవారం సీజేపీ తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ సీజేపీ మద్దతుదారులు, పలు విద్యార్థి సంఘాల సభ్యులు జాతీయ పతాకాలను పట్టుకొని కనాట్‌ప్లేస్‌కు వెళ్లారు. అక్టోబర్ 10న ఇచ్చిన శాంతి హామీపత్రాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ శనివారం ఉదయం దీప్కేతో పాటు మరికొందరిని అరెస్టు చేశారు.

# పొట్టకూటి కోసం వెళ్లి.. తుపాకీ పట్టి.. యుద్ధంలో బలి

కుటుంబానికి తెలిసింది. అయితే ఆయన మృతిపై అధికారిక నిర్ధారణ, తదుపరి ప్రక్రియ పూర్తయ్యే వరకు కుటుంబం ఆందోళనతో ఎదురుచూస్తోంది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అస్ఫాన్ (31) కూడా ఉద్యోగం కోసం రష్యా వెళ్లి అక్కడి సైన్యంలో చేరి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఉద్యోగం పేరుతో విదేశాలకు వెళ్లిన యువకులు యుద్ధంలో చిక్కుకోవడం వారి కుటుంబాలను తీవ్ర విషాదం లోకి నెట్టింది.దేశవ్యాప్తంగా విస్తరించిన విషాదం తెలంగాణతోపాటు రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు చెందిన యువకులు కూడా రష్యా సైన్యంలో చేరి యుద్ధంలో చిక్కుకున్న ఘటనలు వెలుగుచూశాయి. విద్యార్థి వీసాలపై వెళ్లినవారు, హోటళ్లు, వంటశాలలు, నిర్మాణ రంగం, ఇతర సేవా విభాగాల్లో ఉద్యోగాలు ఆశించినవారు సైతం ఈ ఉచ్చులో చిక్కుకున్నట్లు బాధిత కుటుంబాలు ఆరోపించాయి. కొందరి పాస్‌పోర్టులు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకుని సైన్యంలోకి చేర్చారని కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అయితే అన్ని కేసుల్లోనూ ఒకే విధమైన పరిస్థితి లేదని, కొందరు స్వచ్ఛందంగా సైనిక ఒప్పందాలు చేసుకున్నారనే అంశాన్ని కూడా కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.పరిహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలుబాధిత కుటుంబాలకు న్యాయం అందిం చడంలో జాప్యం జరగకూడదని సుప్రీంకోర్టు అక్టోబర్ 14న కేంద్రాన్ని ఆదేశించింది. మరణిం చిన భారతీయుల కుటుంబాలు పరిహారం కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ బహి రంగ ప్రకటన జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని విదేశాంగ శాఖకు సూచించింది. రష్యా ప్రభుత్వం నుంచి పరిహారం పొందే హక్కు మరణించిన మొత్తం 51 మంది కుటుంబాలకూ ఉందని ధర్మాసనం పేర్కొంది. ఇప్పటివరకు ఆరు పరిహార దరఖాస్తులను రష్యా ప్రభుత్వం పరిశీలించగా, ఐదు దరఖాస్తులకు సంబంధించిన పరిహారాన్ని పూర్తిగా చెల్లించిందని, మరో దరఖాస్తును పాక్షికంగా పరిష్కరించిందని కేంద్రం కోర్టుకు తెలిపింది. ఈ చెల్లింపుల వివరాలు, పరిహారంగా నిర్ణయించిన మొత్తాలు, వాస్తవంగా అందిన మొత్తాలపై తాజా నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు కోరింది. బాధిత కుటుంబాలకు ఉచిత న్యాయ సహాయం, మృతదేహాల గుర్తింపునకు డీఎన్‌ఏ పరీక్షలు, అవసరమైన పత్రాల సమీకరణలో సహకారం అందించాలని కూడా గతంలో ఆదేశించింది.ఏజెంట్ల మాయలో పడొద్దువిదేశాల్లో ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రష్యాలో ఉద్యోగం అంటూ సైనిక సేవకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేయడం, ఒప్పందంలోని వివరాలు తెలియకుండా పత్రాలు సమర్పించడం ప్రమాదకరమని సూచిస్తున్నారు. విదేశీ ఉద్యోగానికి వెళ్లే ముందు సంబంధిత సంస్థ, ఉద్యోగ స్వరూపం, వీసా రకం, నియామక సంస్థ విశ్వసనీయతను అధికారిక మార్గాల్లో నిర్ధారించుకోవాలి. అనుమానాస్పద ఏజెంట్లపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. మంచి జీతం, మెరుగైన జీవితం కోసం విదేశాలకు వెళ్లిన యువకులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోవడం, మరికొందరి ఆచూకీ తెలియకపోవడం దేశాన్ని కలచివేస్తోంది. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం అందడం, మృతదేహాల గుర్తింపు ప్రక్రియ వేగవంతం కావడం, గల్లంతైన 77 మంది ఆచూకీ లభించడం ఇప్పుడు అత్యంత కీలకం. వారి కుటుంబాలకు కేవలం ఓదార్పు మాటలు కాదు.. తమవారి గతి ఏమిటో తెలిపే స్పష్టమైన సమాధానం కావాలి.

## కాలువలోకి దూసుకెళ్లిన బస్సు..

### 8 మంది మృతి

### రాజస్థాన్ కోటా జిల్లాలో ప్రమాదం

జైపూర్(జనంసాక్షి):రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులతో వెళ్తున్న ఓ మినీ బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కోటా జిల్లాలో శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులంతా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు. వీరు భోపాల్ నుంచి రాజస్థాన్‌లోని ఖాటు శ్యామ్ ఆలయానికి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఇందుకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## గోదావరి-కావేరి అనుసంధానంతో తెలంగాణకు నష్టం

ప్రభుత్వం తప్పించుకుంటుందని ఆక్షేపించారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు ఉన్నా మూడింటిని మాత్రమే ఆన్ చేశారని, అన్నింటిని నడిపిస్తే వరంగల్‌కు కరవు వచ్చేది కాదని హరీశ్‌రావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కన్నా తెలంగాణలో ఎక్కువ వర్షాలు పడినప్పటికీ కరవు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. గోదావరి-కావేరి పేరుతో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. బనకచర్ల, నల్లమలసాగర్ ఫెయిల్ కావడంతో కావేరి పేరుతో కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు. ఏపీ ఏం చేస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మౌనం వహిస్తోందని హరీశ్‌రావు ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి వచ్చాక పోలవరం ద్వారా అనుసంధానించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.సీఎం రేవంత్‌రెడ్డి నీటిని విడిచిపెడితే చంద్రబాబు ఒడిసిపట్టారని హరీశ్?రావు అన్నారు. ఎల్‌నినోపై హెచ్చరికలు చేస్తున్నా ముందుజాగ్రత్తలు తీసుకోలేదన్నారు. దేవాదుల, కల్వకుర్తి పంపులు నడపలేక కరవు తీసుకొచ్చారని ఆక్షేపించారు. కన్నెపల్లి మోటార్లు నడమపంటే కాలయాపన చేశారన్నారు. రాజకీయాల కోసం మోటార్లు నడపకుండా లేని కరవును మనపై రుద్దారని ఆరోపించారు. చంద్రబాబు లేఖ తెలంగాణ హక్కులకు మరణశాసనం లాంటిదని హరీశ్?రావు అన్నారు. పోలవరం నుంచి తరలించాలని లేఖలో చంద్రబాబు స్పష్టంగా చెప్పారని హరీశ్?రావు అన్నారు. అనుసంధానంలో తెలంగాణకు లబ్ధి ఉండకూడదని అంటున్నారన్నారు. బొల్లాపల్లిలో 150 టీఎంసీలు నింపుకుంటే తెలంగాణ ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు.

"గోదావరి, కావేరి అనే ముసుగులో మొత్తం గోదావరి నదిని కబలించే ప్రయత్నం చేస్తున్నారు. నదీ జాలలను తెలంగాణ నోరు కొట్టి ఏపీకి తరలించే ప్రయత్నం జరుగుతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా పెదవులు మూసుకుని దాసోహమైంది. కల్వకుర్తిలో 35 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉంటే కేవలం 13 టీఎంసీలు ఎత్తిపోసి మిగతా నీళ్లు ఇవాళ ఏపీకి దారాదత్తం చేశారు. ప్రతిపక్షంపై బురదజల్లి మీరు చేసిన తప్పుల నుంచి తప్పించుకోలేరు"

అలా చేస్తే హక్కులను కాలరాసినట్లే

పోలవరం నుంచి నీరు తీసుకెళ్తామంటే రేవంత్ ప్రభుత్వం స్పందించడం లేదని హరీశ్‌రావు ఆక్షేపించారు. పోలవరం ద్వారా అనుసంధానిస్తే మన హక్కులు, నీళ్లు కోల్పోతామన్నారు.

## విమాన టికెట్ ధరల రూల్స్ ఫైనల్ చేయండి: సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి):విమాన టికెట్ ధరలను నియంత్రించేందుకు ఉద్దేశించిన నూతన నిబంధనల విషయం కొలిక్కి వచ్చిందని, వీటికి పరిపాలనాపరమైన అనుమతులు కూడా లభించాయని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. వచ్చే రెండు వారాల్లో వాటిని నోటిఫై చేస్తామని పేర్కొంది. ఇందుకు సంబంధించిన పిటిషన్‌ను మరోసారి విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 16న తదుపరి విచారణ చేపడతామని తెలిపింది. అప్పటిలోగా కొత్త నిబంధనలను తమ ముందు ఉంచాలని కేంద్రాన్ని ఆదేశించింది.డిమాండ్ ఉన్న సమయాల్లో విమానయాన సంస్థలు టికెట్ ధరలను ఊహించని విధంగా పెంచుతుండడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఇష్టానుసారంగా పెంచడంతో విమాన ప్రయాణం ఖరీదుగా మారుతోందని, వీటిని నియంత్రించాలని కోరుతూ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ధరల నిర్ణయంపై మరింత నిశిత పరిశీలన జరగాలని, పరిష్కార చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై కొంత కాలంగా విచారణ జరుపుతోన్న సర్వోన్నత న్యాయస్థానం.. నిబంధనలు పాటించని ఎయిర్‌లైన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించింది.

## విద్యుత్, నీటిని పొదుపు చేయండి

- **యువకళాకారులకు భట్టి విక్రమార్క విజ్ఞప్తి**

**హైదరాబాద్(జనంసాక్షి):**నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా యువకళాకారులు పనిచేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిల్ప కళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్?ను పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావంతో అక్టోబర్‌లోనే మునుపెన్నడూలేనంత విద్యుత్ డిమాండ్ పెరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు ముందుకొచ్చి నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో శిల్పకళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిల్మ్ మేకర్స్ పోటీల్లో లఘు చిత్రాలు, ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పాటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహంతో పాటు మెమొంటోతో సత్కరించారు. సీఎం పిలుపు మేరకు స్పందించిన యువ కథానాయకుడు విజయ్ దేవరకొండకు భట్టివిక్రమార్క అభినందనలు తెలిపారు.బతుకమ్మ ఫిల్మ్ మేకర్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఔత్సాహిక దర్శకులను వక్తలు ప్రశంసించారు. ప్రతిభ ఉంటే యువతను ఆపే సత్తా ఎవరికీ లేదని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు చెప్పారు. ఈ వేడుకకు 'క్రేజీ కల్యాణం' చిత్ర బృందం హాజరై సందడి చేసింది.

# యువత గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

వెనుక ఉద్దేశమని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ను లక్ష్యంగా చేసుకొని కూడా రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం తమ చేతుల్లో నుంచి చేజారిపోయే రోజు వస్తే, తమ ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఇక ఉండదని, ఆ రోజు ముగుస్తుందని వారికి తెలుసని అన్నారు. ఆ భయమే పోలీసుల ద్వారా దేశంలోని యువత, మహిళలపై హింస రూపంలో బయటపడుతోందని ఆరోపించారు. బాధిత మహిళలతో మాట్లాడిన రాహుల్ గాంధీ తన పోస్టుతో పాటు రాహుల్ గాంధీ సుమారు 10 నిమిషాల వీడియోను కూడా ఎక్స్‌లో పంచుకున్నారు. ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసులు తమపై అమానుషంగా వ్యవహరించారని ఆరోపించిన కొందరు మహిళలతో ఆయన మాట్లాడిన దృశ్యాలు సదరు వీడియోలో ఉన్నాయి. యువతులు తమకు ఎదురైన చేదు అనుభవాలను వివరించారు. పోలీసులు తమ శరీరంలోని సున్నిత భాగాలను లక్ష్యంగా చేసుకున్నారని, పై అధికారులు కింది స్థాయి సిబ్బందిని లైంగికంగా వేధించేలా ప్రోత్సహించారని కూడా మహిళలు వీడియోలో వివరించారు. తమపై వేధింపులకు పాల్పడిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మహిళలు రాహుల్ గాంధీని కోరారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత పోలీసులపై కేసులు నమోదు చేయడానికి వీలుగా మరిన్ని ఆధారాలు అందించాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు వంటి ఆధారాలను సేకరించి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ ఆధారాలను బట్టి కేసులు నమోదు చేసే ప్రక్రియలో ముందుకు వెళ్లొచ్చని ఆయన పేర్కొన్నారు.భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియను (ప్రత్యేక సమగ్ర సవరణ) నిరసిస్తూ దీనికి వ్యతిరేకంగా కొద్ది రోజులుగా దిల్లీ సహా పలు ప్రాంతాల్లో నిరసనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే విద్యార్థులు ఇటీవల నిరసనలు చేపట్టిన సమయంలో దిల్లీ పోలీసులు అమానుషంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై రాహుల్ గాంధీ శుక్రవారం కూడా స్పందించారు. బాధిత విద్యార్థులపై జరిగిన దాడులపై కేసు నమోదు చేసేందుకు దిల్లీ పోలీసులు నిరాకరిస్తున్నారని వ్యాఖ్యానించిన ఆయన, బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దిల్లీ పోలీసు దాడుల్లో గాయపడ్డ కేరళ, రాజస్థాన్‌కు చెందిన పలువురు ఔజఎ సభ్యులు, విద్యార్థి సంఘాల నేతలతో రాహుల్ సమావేశం అయ్యారు. విద్యార్థులు వారికి ఎదురైన అనుభవాల్ని రాహుల్‌కు వివరించారు. ఫిర్యాదుల్ని స్వీకరించడానికి దిల్లీ పోలీసులు తిరస్కరించడంతో రాహుల్ మరో ప్రత్యామ్నాయం ఎంచుకున్నారు. కేరళ, రాజస్థాన్‌లో దిల్లీ పోలీసులపై జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. దిల్లీ పోలీసుల దౌర్జన్యాన్ని ఊరికే వదిలేయబోమని, ప్రధాని నుంచి కానిస్టేబుల్ వరకు ఎవరైనా చట్టపరంగా చర్యలు ఎదుర్కోక తప్పదని స్పష్టం చేశారు.

## 'లాన్స్‌నాయక్ నాయక్ హోదా' మళ్లీ తెరపైకి..

**- సీఆర్పీఎఫ్ జవాన్ల పదోన్నతులపై కీలక ప్రతిపాదన**

**- దేశవ్యాప్తంగా ఉన్న విభాగాలను అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయం**

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఆర్పీఎఫ్ జవాన్లకు పదోన్నతుల జాప్యాన్ని నివారించేందుకు కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 30 ఏళ్ల కిందట రద్దు చేసిన లాన్స్ నాయక్ నాయక్ హోదాలను తిరిగి ప్రవేశపెట్టాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకోవాలని సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం దేశవ్యాప్తంగా ఉన్న విభాగాలను ఆదేశించింది. రెండు రోజుల్లో సైనిక్ సమ్మేళనాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలని సూచించింది. 1997లో కేంద్ర హోంశాఖ ఆదేశాలతో లాన్స్ నాయక్, నాయక్ హోదాలను రద్దు చేసి, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు. ఆర్మీలో మాత్రం అవి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం 3.25 లక్షల మంది సిబ్బంది ఉన్న సీఆర్పీఎఫ్‌లో కానిస్టేబుళ్లకు తొలి పదోన్నతి వచ్చేందుకు సగటున 22-25 ఏళ్లు పడుతోంది. కొత్త హోదాలు



అమల్లోకి వస్తే హెడ్ కానిస్టేబుల్ స్థాయికి చేరకముందే మరో రెండు పదోన్నతులు రానున్నాయి.ఆర్మీలో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న అగ్నివీరుల తొలి బ్యాచ్ ఈ ఏడాది చివరిలో పదవీ విరమణ చేయనుంది. వీరు కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో చేరేందుకు అర్హులు. అయితే నిర్ణీత గడువులో పదోన్నతులు కల్పిస్తేనే ఈ ప్రతిపాదనతో ప్రయోజనం ఉంటుందని మాజీ పారామిలటరీ సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి రణ్‌బీర్ సింగ్ తెలిపారు. కొత్త హోదాల వల్ల బెటాలియన్ క్రమశిక్షణ, విధుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఓ సీనియర్ కమాండెంట్ సూచించారు.

# పిల్లలూ ఇంటర్నెట్ వినియోగించొచ్చు

- **పెద్దలతో పాటు వారికి ఆ హక్కు ఉంది**
- **వయసు ఆధారిత ఆంక్షలు విధించలేం: సుప్రీం కోర్టు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇంటర్నెట్‌ను వినియోగించుకునే హక్కు పెద్దలతో పాటు పిల్లలకూ ఉందని సుప్రీం కోర్టు పేర్కొంది. వారి ప్రాథమిక హక్కును కాదని.. వయసు ఆధారంగా ఇంటర్నెట్ వినియోగంపై ఆంక్షలు విధించలేమంది. ఆ విధమైన పరిమితుల వల్ల పిల్లలు ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయడానికి చట్ట విరుద్ధమైన మార్గాలు అనుసరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దానివల్ల ఆన్‌లైన్‌లో ప్రలోభాలు, బెదిరింపులు ఎదురైనా.. భయంతో వారు ఆ విషయాలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడానికి కూడా సంకోచించే అవకాశం ఉందని జస్టిస్ జె.బి. పార్థీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల భద్రత, ఇంటర్నెట్ వినియోగ స్వేచ్ఛ ఒకదానికొకటి విరుద్ధం కాదని.. వారికి ఈ రెండింటినీ పొందే హక్కు ఉంటుందని సుప్రీం కోర్టు తెలిపింది. ఇంటర్నెట్‌ను సృజనాత్మక వ్యక్తీకరణ, సమాచార మార్పిడికి మార్కెట్‌గా అభివర్ణించింది. కాబట్టి ఇంటర్నెట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం సమంజసం కాదంది. అయితే, ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి చిన్నారులను రక్షించడానికి సోషల్ మీడియా వేదికల్లో లైంగిక వేధింపుల కంటెంట్ తొలగింపుపై కఠిన నిబంధనలు అమలు చేయాలని కేంద్రానికి సూచించింది.

**జనగణనలో ఇక ప్రైవేటు టీచర్లు**

'చాలా మంది పిల్లలకు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని వారికి ఇంటర్నెట్ ముఖ్యమైన సమాచార వనరుగా ఉపయోగపడుతోంది. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఇతరులతో కనెక్ట్ అవ్వడానికి, ఇంటి నుంచే అనేక విషయాలు నేర్చుకోవడానికి ఆన్‌లైన్ వేదికలు సహాయపడతాయి. సోషల్ మీడియా సంస్థలు హానికరమైన కంటెంట్‌ను గుర్తించి దానిని తొలగించకపోవడం వల్ల ప్రస్తుతం ఇంటర్నెట్ పిల్లలకు ప్రమాదకరంగా మారింది. ఆ కారణాన్ని చూపి చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం కూడా పొరపాటే అవుతుంది. కాబట్టి చిన్నారుల ఖాతాలు భద్రంగా ఉండడం కోసం యాప్‌లు ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్'ను ప్రవేశపెడితే బాగుంటుంది. బాలలకు సంబంధించిన లైంగిక వేధింపుల కంటెంట్‌ను సోషల్ మీడియా యాప్‌ల నుంచి తొలగించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలి' అని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## రష్యాపై ఆంక్షలు.. మెత్తబడిన ట్రంప్

చమురు దిగుమతులు చేసుకునే దేశాలపై టారిఫ్‌లు విధించేలా చట్టం తెచ్చి.. మరోవైపు అగ్రరాజ్యమే రష్యాతో డీల్ కుదుర్చుకోవడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంక్షల చట్టంలో మినహాయింపులు కల్పిస్తూ ట్రంప్ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**డెమోక్రాట్లు గెలిస్తే మళ్లీ 1929 నాటి మాంద్యం**

ఈ చట్టంలోని సెక్షన్ 115 ప్రకారం.. యూఎస్ జాతీయ ప్రయోజనాల కోసం ఆంక్షలను నిలిపివేయడం, అవసరమని భావిస్తే.. వాటి నుంచి మినహాయింపు (చిజీతిలవతీ) ఇచ్చే ప్రత్యేక అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. 'ద లిండ్సే గ్రాహం' బిల్లును అమెరికా సెనెట్ ఈ ఏడాది ఆగస్టు 7న, ప్రతినిధుల సభ సెప్టెంబరు 16న ఆమోదించాయి. అనంతరం ట్రంప్ దీనిపై సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. రష్యా నుంచి అత్యధికంగా ఇంధనం దిగుమతి చేసుకునే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం ఈ చట్టంతో అగ్రరాజ్య అధ్యక్షుడికి లభించింది. అయితే, అమెరికా (జూం)లో డీజిల్ ధరలను నియంత్రించేందుకే ట్రంప్ ప్రధానంగా



ఈ మినహాయింపులు ప్రకటించినట్లు తెలుస్తోంది. అగ్రరాజ్యంలో మరికొద్ది రోజుల్లో జరగబోయే మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఇంధన ధరలు కీలక రాజకీయ అంశంగా మారాయి.

**భారత్‌కు రిలీఫ్..**

మరోవైపు, ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం భారత్‌కు ఊరటనిచ్చే అంశమే. తాజా మినహాయింపుతో భారత్‌పై అదనపు సుంకాల ముప్పు తప్పుతుంది. ఇక, రష్యా నుంచి అమెరికా, ప్రపంచ మార్కెట్లలోకి లక్షలాది టన్నుల డీజిల్ సరఫరా కానుండటంతో అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గే అవకాశం ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్ పర్యటన నేపథ్యంలో ఈ మినహాయింపులు ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత నెలలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా రూబియోతో జరిగిన భేటీలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ చట్టంపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# గద్వాల నడిగడ్డపై సీఎంఆర్ గుట్టురట్టు

- రైస్ మిల్లులపై విజిలెన్స్ దేగకన్ను
- కోట్ల రూపాయల ధాన్యం మాయం?

**జోగులాంబ గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణ, నిల్వల్లో భారీస్థాయిలో అవకతవకలు జరిగాయనే నమ్మదగిన సమాచారంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా సాగుతున్న ఈ జాయింట్ ఆపరేషన్, శనివారం నాటికి గద్వాల జిల్లాలోని పలు ప్రముఖ మిల్లులకు చేరడంతో మిల్లర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



### అధికారుల దాగుడుమూతలు, మిల్లర్ల మాయాజాలం!

రైస్ మిల్లుల్లో విజిలెన్స్ బృందాలు రికార్డులు, భౌతిక నిల్వలను క్షుణ్ణంగా పరిశీలిస్తుండగా, స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం ఇవి విజిలెన్స్ తనిఖీలు కావని, కేవలం సెంట్రల్ పూల్ కింద బియ్యం క్వాలిటీ చెక్ చేయడానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు వచ్చారంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం గమనార్హం. అయితే క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం, ప్రభుత్వం మిల్లింగ్ కోసం కేటాయించిన వేల టన్నుల వడ్లు మిల్లుల్లో కాకుండా నేరుగా బహిరంగ మార్కెట్లోకి తరలిపోయాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డుల్లో ఉన్న నిల్వలకు, మిల్లుల్లో ఉన్న అసలు స్టాకుకు మధ్య భారీ తేడాలు ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

### పక్కదారి పట్టిన పేదల బియ్యం - సర్కార్ కఠిన వైఖరి

ప్రభుత్వం నిరుపేదలకు రేషన్ రూపంలో పంచేందుకు ప్రతి క్వింటాల్ వడ్లకు 67 కిలోల బియ్యం చొప్పున మిల్లర్ల నుంచి సేకరించాల్సి ఉంది. అయితే జిల్లాలోని కొందరు కేటాయించిన నాణ్యమైన ధాన్యాన్ని నల్లబజారుకు తరలించి, తక్కువ రకం వడ్లు లేదా పాత రేషన్ బియ్యాన్ని తిప్పికొడుతూ రీసైక్లింగ్ చేస్తున్నారనే ఆరోపణలు నడిగడ్డపై కొత్తవేమీ కావు. కాగా, ఈసారి ప్రభుత్వం సీఎంఆర్ డిఫాల్టర్లపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. నిల్వల్లో తేడాలు వస్తే పి.డి యాక్ట్ నమోదు చేయడంతో పాటు మిల్లు యజమానుల వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనుకాడబోమని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ఆకస్మిక దాడుల భయంతో గద్వాల జిల్లాలోని పలువురు బడా రైస్ మిల్లర్లు మిల్లులకు తాళాలు వేసి అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. తనిఖీలు పూర్తిస్థాయిలో ముగిస్తే గానీ గద్వాల జిల్లాలో జరిగిన ఈ సీఎంఆర్ లీలల అసలు భాగోతం, పక్కదారి పట్టిన కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం విలువ ఎంతనేది అధికారికంగా బయటపడనుంది.

# రాష్ట్ర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పూలను దైవంగా భావించి పూజించే ఏకైక సంస్కృతి తెలంగాణ సొంతమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి,సంస్కృతి వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ మన అస్తిత్వానికి,మన తెలంగాణ జీవనశైలికి నిలువుటద్దం లాంటిదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పండుగలు ఉన్నప్పటికీ,రంగు రంగుల పూలను పేర్చి, గౌరమ్మను కొలిచే ఈ అద్భుతమైన వేడుక మన నేల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటు తోందన్నారు. పూలను బతుకమ్మ రూపంలో పూజించడం ద్వారా మన పూర్వీకులు ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని మనకు అందించారని,ఈ సాంప్రదాయాన్ని భావిత రాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లుతూ అంగరంగవైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

# క్రియాశీలక ఉద్యమాల ద్వారానే బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధ్యం



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేటకు రైల్వే కారిడార్ సాధన కోసం ఎదురుచూస్తున్న జిల్లా ప్రజలు క్రియాశీలక ఉద్యమాల ద్వారా మాత్రమే సాధించుకోగలుగుతారని పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా 65వ రోజు శిబిరం వద్ద సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, జాతీయ రహదారి 65కు సమాంతరంగా రైల్వే కారిడార్ సాధించుకోవాలని పోరాటాలకు సంకేతమైన పోరు బతుకమ్మను పూలతో అలంకరించి పాటలు పాడి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆడబిడ్డ బతుకమ్మ ప్రజా పోరాటాలకు సంకేతం అని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజలకు అందించడం కోసం తద్వారా రైల్వే కారిడార్ సాధించుకోవడం కోసం ప్రజలను సమాయత్తులను చేసేందుకు పోరు బతకమ్మని పేర్చటం జరిగిందని తెలిపారు. పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేటకు ఉద్యమాలు కొత్త కావని, ఉద్యమాల ద్వారా రైల్వే కారిడార్ సాధించుకుంటామని అన్నారు. రైల్వే కారిడార్ సాధన కోసం క్రియాశీలక ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్,డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేపాక లింగయ్య, జిల్లా కార్యదర్శి పాల్వాయి బిక్షం, జిల్లా అధ్యక్షులు ఉమర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, డాక్టర్ భూమిరెడ్డి, పేర్ల నాగయ్య, ఎర్ర అఖిల్ కుమార్, గొడ్డలి నరసయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక,కోశాధికారి మోటకట్ల జయమ్మ, ఐతరాజు పద్మ, కట్టా కల్పన, పాల్వాయి అనసూయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- బాధితురాలిని కాపాడిన మొబైల్ షాప్ యజమాని ఉమర్‌కు ఎస్ఐ వరప్రసాద్ సన్మానం




**కొందుర్గు (జనంసాక్షి) :** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడిని కొందుర్గు పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో శనివారం కొందుర్గు మండలానికి చెందిన 49 సంవత్సరాల మహిళ తన గ్రామానికి వెళ్లేందుకు కొందుర్గ్ బస్టాండ్‌లో వేచి ఉంది. ఆ సమయంలో చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఇప్పలపల్లి మధు (19, తండ్రి లక్ష్మయ్య) అనే యువకుడు ఆమెకు లిఫ్ట్ ఇస్తానని, గ్రామంలో దింపుతానని నమ్మించి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. అనంతరం ఆమెను ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించాడు.

అదే సమయంలో అటుగా వెళ్తున్న కొందుర్గ్ మండల కేంద్రానికి చెందిన మొబైల్ షాప్ నిర్వాహకుడు ఉమర్ ఈ విషయాన్ని గమనించారు. ఆయన నిందితుడిని నిలదీయడంతో, సదరు యువకుడు ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే ఉమర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బాధిత మహిళను సురక్షితంగా కొందుర్గ్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఫిర్యాదు చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆపదలో ఉన్న మహిళను ధైర్యంగా రక్షించి, పోలీసులకు ఫిర్యాదు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఉమర్‌ను కొందుర్గ్ ఎస్ఐ వరప్రసాద్ పోలీస్ స్టేషన్‌లో శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ వరప్రసాద్ మాట్లాడుతూ.. మహిళల పట్ల అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు, రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు మానవతా దృక్పథంతో తక్షణమే స్పందించి బాధితులను రక్షించేందుకు ముందుకు రావాలని సూచించారు. నేరాలను అడ్డుకోవడంలో సమయస్ఫూర్తితో వ్యవహరించే పౌరులను పోలీస్ శాఖ తరఫున ఎల్లప్పుడూ అభినందిస్తామని ఎస్ఐ తెలిపారు.




# పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

**హయత్ నగర్ అక్టోబర్ 17 (జనం సాక్షి) :** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఎల్బీ నగర్‌లోని గౌరవ ప్రత్యేక పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. క్రైమ్ నంబర్ 1080/2025 కేసులో నిందితుడికి ఐదేళ్ల సాధారణ కారాగార శిక్ష విధించడంతో పాటు, రూ.10,000 జరిమానా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అలాగే బాధితులకు రూ.1,00,000 పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా అంకితభావంతో కృషి చేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ), దర్యాప్తు అధికారి (ఐఓ), ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు. న్యాయస్థానంలో కేసును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను డీసీపీ ప్రశంసించారు.

# టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ



**సిద్దిపేట (జనంసాక్షి) :** కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. శనివారం ఉదయం నుంచే ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు తరలివస్తుండడంతో వాహనాల రద్దీ పెరిగింది. టోల్ ప్లాజా సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌంటర్లను పెంచారు. అయినప్పటికీ వాహనాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో వాహనదారులు కొద్దిసేపు వేచి ఉండాల్సి వచ్చింది.

# నీట్‌లో మెరిసిన గిరిజన బిడ్డలు

- మాజీ మంత్రి హరీష్‌రావు ఆర్థిక సాయం



**నారాయణఖేడ్ (జనంసాక్షి) :** నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి మెడికల్ సీట్లు సాధించిన నారాయణఖేడ్ మండలం పలుగుతాండకు చెందిన పేద గిరిజన విద్యార్థినులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఈ సాయం అందించారు. పలుగుతాండకు చెందిన పేద రైతు దంపతులు పాపి బాయ్ - యాదునాయక్‌ల కుమార్తెలు వడిత్య నివేదిత, అఖిల ఇద్దరూ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడికల్ సీట్లు సాధించారు. అయితే, ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థినుల ఉన్నత చదువులకు ఇబ్బందిగా మారిన పరిస్థితిని మాజీ జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న హరీష్ రావు తక్షణమే స్పందించి, వారికి నగదు రూపంలో ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా, వారి ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు అవసరమైన సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదని, గిరిజన తండాల నుంచి ఇద్దరు అక్కాచెల్లెళ్లు వైద్య విద్యకు ఎంపిక కావడం అభినందనీయమని ఆయన తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతానికి చెందిన ఎంతోమంది పేద విద్యార్థులకు, రోగులకు హరీష్ రావు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారని నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, రాథోడ్ సురేష్ నాయక్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రి నిర్లక్ష్యంతో శిశువు మృతి

- రూ.2 లక్షలతో రాజీ!?



**నారాయణ పేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** నారాయణ పేట లోని ఓ ప్రైవేట్ చిన్న పిల్లల ఆసుపత్రిలో వైద్యం వికటించి నెలల బాలుడు మృతి చెందినట్లు ఆరో పణలు వెల్లువెత్తాయి. బైరంకొండ గ్రామానికి చెందిన బాలుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా, డ్యూటీ సిబ్బంది మోతాదుకు మించి ఇంజెక్షన్ ఇచ్చినట్లు సమాచారం. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌కు తరలించగా, అక్కడ బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. స్థానికుల జోక్యంతో ఆసుపత్రి యాజమాన్యం రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగినట్లు తెలుస్తోంది. అధికారుల మౌనంపై విమర్శలు: ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జడ్చర్ల వేద 9 రెస్టారెంట్‌లో అపరిశుభ్రత!

**జడ్చర్ల (జనంసాక్షి) :** పట్టణంలోని వేద 9 రెస్టారెంట్‌లో భోజనం చేసిన కస్టమర్‌కు ఫుడ్ పాయిజన్ అయిన ఘటనపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత శనివారం తనిఖీలు నిర్వహించారు. వేద 9 హోటల్లో తెలంగాణ చికెన్ కర్రీ తిన్న కస్టమర్ కు 15 నిమిషాల్లో ఒంటిపై దద్దుర్లు రావడంతో కస్టమర్ వెంటనే ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కస్టమర్ ఫిర్యాదు మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ హోటల్‌లో తనిఖీ చేయగా వంట గది అపరిశుభ్రంగా ఉండడం, పదార్థాల నిల్వలో లోపాలు గుర్తించారు. ఆహారంలో అవాంఛిత పదార్థాలు రిఫ్రిజిరేటర్ లో ఎక్కువ కాలం నిల్వ ఉన్న ఆహార పదార్థా లను గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబం ధనల మేరకు హోటల్ నిర్వహణ లేకపోవడం వంటగది అపరి శుభ్రంగా ఉండడం వంటి అంశాలపై హోటల్ నిర్వాహకులకు నోటీసు లు జారీ చేసి, ఈ నెల 31 లోగా లోపాలు సరిదిద్దుకోకపోతే హోటల్ లైసెన్స్ రద్దుచేసి హోటల్‌ను సీజ్ చేస్తామని జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ శ్రీలత హెచ్చరించారు.

# బతుకమ్మ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ (జనంసాక్షి) :** నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, క్రీడలు, రహదారుల రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు, సుందరీకరణ పనులు, నూతన మైసమ్మ ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఘాట్ మెట్ల వద్దే కాకుండా చెరువు పరిసరాల్లో అవసరమైన చోట్ల బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పండుగను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరేపల్లి చెరువు వద్ద కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు గ్లాస్ బ్రిడ్జి, కప్పగుట్ట పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. కొత్త చెరువు, పల్లె చెరువుల అభివృద్ధిపైనా దృష్టి సారించామన్నారు. హుస్నాబాద్‌లో స్విమ్మింగ్ పూల్, వాటర్ స్పోర్ట్స్ సదుపాయాల నిర్వహణకు ప్రభుత్వం జీఓ ఆర్టీ నం. 1673 జారీ చేసిందని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పర్యవేక్షణలో వీటి నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇటీవల కబడ్డీ అకాడమీ మంజూరు కావడంతో యువతకు క్రీడల్లో శిక్షణ పొందే అవకాశాలు పెరగనున్నాయి.

# లక్ష్మీనగర్ తండాలో చుక్కల దుప్పి వేట

- ఒకరి అరెస్ట్ 14 రోజుల రిమాండ్



**ధారూర్,అక్టోబర్ 17 (జనంసాక్షి) :** మండల పరిధిలోని లక్ష్మీనగర్ తండాలో అడవి జింక మాంసం లభ్యమైందనే విశ్వసనీయ సమాచారంతో ధారూర్ అటవీశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వేట వ్యవహారం బయటపడింది. అధికారుల వివరాల ప్రకారం. తండాకు చెందిన కిషన్ నాయక్ ఇంట్లో తనిఖీ చేయగా చుక్కల దుప్పికి చెందిన నాలుగు కాళ్లు లభ్యమయ్యాయి. దీనిపై కిషన్ నాయక్‌ను విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. పొలం సమీపంలోని ధారూర్ అటవీ ప్రాంతంలో ట్రెంచ్ దగ్గర కిషన్ నాయక్, లక్ష్మణ్ నాయక్ కలిసి అడవి జంతువుల కోసం ఉచ్చులు అమర్చారు. ఆ ఉచ్చులో ఒక చుక్కల దుప్పి చిక్కుకోగా, కిషన్ నాయక్, రఘు కలిసి దానిని పొలం వద్దకు తీసుకెళ్లి కోశారు. ఆపై ఆ మాంసాన్ని లక్ష్మీనగర్ తండాకు తరలించి కిషన్ నాయక్, రఘు, లక్ష్మణ్ నాయక్, విజయ్ చందర్, గోపాల్ కలిసి పంచుకుని తిన్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఈ ఘటనపై అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన అధికారులు కిషన్ నాయక్‌ను శుక్రవారం జిల్లా కోర్టులో హాజరుపరిచారు. గౌరవనీయులైన జిల్లా జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని పరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, త్వరలోనే వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు, చర్యల్లో ధారూర్ అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి

- టీజేఎస్‌ను కోరిన కాంగ్రెస్ నాయకులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలంగాణ జన సమితి (టీజేఎస్)ని కోరారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మహేష్ గౌడ్ వెంట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధుయాష్కీ గౌడ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టీజేఎస్ పార్టీల మధ్య రాజకీయ భాగస్వామ్యం, పరస్పర సహకారంపై నేతలు చర్చించారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీజేఎస్ భాగస్వామ్యంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీ మద్దతు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. ఏఐసీసీ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం మేరకే కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినట్లు గుర్తుచేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టీజేఎస్ కీలక పాత్ర పోషించి, కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. ఈ మేరకు టీజేఎస్ చీఫ్ సానుకూలంగా స్పందించారు. దీనిపై ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, పాలనలో టీజేఎస్‌కు భాగస్వామ్యం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలను కాంగ్రెస్ నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుపై పార్టీ రాష్ట్ర కమిటీలో చర్చించి, త్వరలోనే తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# జెండా పట్టిన చేతులకు సంకెళ్లా?

సంపాదకీయం

మువ్వన్నెల పతాకం ఎవరి సొత్తూ కాదు. ఇంటింటా జెండా ఎగరాలని పిలుపునిచ్చిన ప్రభుత్వాలే, అదే జెండాను చేతబట్టి రోడ్డెక్కిన పౌరులను అదుపులోకి తీసుకోవడం విడ్డూరం. శుక్రవారం సాయంత్రం సెంట్రల్ ఢిల్లీలో జరిగింది ఇదే. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కనాట్ ప్లేస్ వద్ద "లెఫ్ట్ దో తిరంగా" ర్యాలీకి పిలుపునిచ్చిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా సహా సుమారు 150 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ర్యాలీకి అనుమతి నిరాకరించారన్నది పోలీసుల వాదన. కానీ అనుమతి నిరాకరణ, అదుపులోకి తీసుకోవడం అనే రెండూ ఒకేలా సమర్థనీయం కావు.

ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు అనుగ్రహం కాదు, రాజ్యాంగం ఇచ్చిన హక్కు. శాంతియుతంగా సమావేశమయ్యే స్వేచ్ఛపై సహేతుకమైన ఆంక్షలు విధించవచ్చు. అయితే ఆ ఆంక్షలు నిజంగా అవసరమైనవేనా, దామాషా ప్రకారం ఉన్నాయా అన్నది ప్రశ్న. చేతిలో జాతీయ పతాకం తప్ప మరే ఆయుధమూ లేని విద్యార్థులను, యువ నాయకులను వాహనాల్లో ఎక్కించుకుపోవడం ఏ శాంతిభద్రతల లెక్కలోకి వస్తుందో అధికారులు వివరించాల్సి ఉంది. పోలీసుల అభ్యంతరం ట్రాఫిక్ గురించో, భద్రత గురించో బహిరంగంగా చెప్పాలి. చెప్పకపోతే అనుమానాలు బలపడతాయి.

అసలు నిరసనకు కారణమైన అంశమే గంభీరమైనది. ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యంలో సహజం, అవసరం కూడా. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది సంస్థే. ప్రశ్నించేవారిని నిలువరించడం వల్ల సంశయాలు తొలగవు, పెరుగుతాయి. ఎన్నికల వ్యవస్థపై నమ్మకం నిలవాలంటే పారదర్శకత, జవాబుదారీతనమే మార్గం. నిరసనకారులను అదుపులోకి తీసుకోవడం ఆ మార్గం కాదు.

**"హర్ ఘర్ తిరంగా" వంటి కార్యక్రమాలు దేశభక్తిని పెంచాలన్నదే ఉద్దేశమైతే, ఆ భావన అందరికీ సమానంగా వర్తించాలి. పతాకం పేరుతో ప్రచారం చేసేవారికి ఒక నియమం, అదే పతాకంతో ప్రశ్నించేవారికి మరో నియమం ఉండకూడదు. జెండా ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితమైన చిహ్నం కాదు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే పౌరుల చేతిలోనూ అది గౌరవంగా నిలవగలగాలి.**

ఈ ఘటనపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా, ప్రభుత్వం ఒక్కటి గుర్తుంచుకోవాలి. అసమ్మతిని అణచివేసే ప్రతి ప్రయత్నమూ ప్రశ్నను పెద్దదిగా చేస్తుంది. నిరసనకారులను వెంటనే విడుదల చేసి, అదుపులోకి తీసుకున్న కారణాలను స్పష్టం చేయడం, ర్యాలీలకు అనుమతి ఇచ్చే విధానంలో పారదర్శకత పాటించడం ఇప్పుడు అవసరం. జెండా మన అందరిదీ. దాన్ని పట్టుకున్నందుకు ఎవరూ నిర్బంధానికి గురికాకూడదు.

# న్యాయవ్యవస్థపై నీలినీడలు న్యాయం ఎవరి కోసం?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తప్పు చేస్తే ప్రజలు ప్రశ్నించాలి. పోలీసులు హద్దులు దాటితే న్యాయస్థానాలు అడ్డుకోవాలి. కానీ న్యాయాన్ని అందించాల్సిన వ్యవస్థపైనే అవినీతి, పక్షపాతం, రాజకీయ ప్రభావం ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? కోర్టులో న్యాయమూర్తి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నట్లు కనిపించడం ఒకటి; తుది తీర్పులో ప్రభుత్వ అధికారాలను పరిమితం చేయడం మరొకటి. విచారణలో ఘాటు ప్రశ్నలు, బయటకు వచ్చే తీర్పులో ప్రభుత్వానికి ఉపశమనం---ఈ వైరుధ్యం ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. అయితే న్యాయవ్యవస్థలోని ప్రతి న్యాయమూర్తినీ అవినీతిపరుడిగానో, పక్షపాతం చూపించిన వ్యక్తిగానో చిత్రించడం సరికాదు. వ్యక్తులపై నిర్ధారిత ఆరోపణలు, సంస్థాగత లోపాలు, వివాదాస్పద తీర్పులు---ఈ మూడింటినీ విడివిడిగా పరిశీలించినప్పుడే అసలు సమస్య అర్థమవుతుంది.

న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రమాదం కేవలం ప్రభుత్వం న్యాయమూర్తులను ప్రత్యక్షంగా ఆదేశించడంలోనే ఉండదు. నియామకాలు, పదోన్నతులు, కేసుల కేటాయింపు, విచారణలో జాప్యం, పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ పదవులు వంటి అంశాలు కూడా న్యాయమూర్తుల స్వతంత్రతపై ప్రజలకు అనుమానాలు కలిగించవచ్చు. న్యాయమూర్తి నిజంగా ఒత్తిడికి లొంగకపోయినా, ఆయన నిర్ణయాలు రాజకీయ అధికారానికి అనుకూలంగా కనిపిస్తూ, పదవీ విరమణ తరువాత ప్రభుత్వంలో కీలక పదవి పొందితే, ఆ నిర్ణయాల నిష్పాక్షికతపై సందేహాలు తలెత్తడం సహజం. న్యాయం జరగడమే కాదు, న్యాయం జరిగిందనే నమ్మకం కూడా ప్రజలకు కలగాలి.

ఈ సమస్యను కేవలం రాజకీయ ప్రత్యర్థుల ఆరోపణగా కొట్టిపారేయలేం. 2018 జనవరి 12న సుప్రీంకోర్టులోని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు---జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి. లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్---అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నిర్వహణ తీరుపై బహిరంగంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసుల కేటాయింపు, సుప్రీంకోర్టు పరిపాలనలో నెలకొన్న సమస్యలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ చరిత్రలోనే అసాధారణమైన ఈ పరిణామం, సుప్రీంకోర్టు అంతర్గత వ్యవహారాలన్నీ సజావుగా సాగుతున్నాయనే అధికారిక చిత్రాన్ని ప్రశ్నించింది. జస్టిస్ చలమేశ్వర్ తదితరులు లేవనెత్తిన ప్రశ్నలు వ్యక్తిగత అసంతృప్తికి పరిమితం కాలేదు; న్యాయవ్యవస్థలో పారదర్శకత, కేసుల కేటాయింపులో నిష్పాక్షికత, సంస్థాగత జవాబుదారీతనం ఎంత అవసరమో దేశం ముందు ఉంచాయి.

ఈ ఘటనలో ముఖ్యమైన విషయం ఏమిటంటే, న్యాయవ్యవస్థకు ప్రమాదం ఉందని చెప్పింది బయట ఉన్న రాజకీయ పార్టీ కాదు; సుప్రీంకోర్టులోనే పనిచేస్తున్న నలుగురు సీనియర్ న్యాయమూర్తులు. వారు లేవనెత్తిన సమస్యలన్నీ వాటంతట అవే అవినీతి నిర్ధారణలు కావు. కానీ దేశ అత్యున్నత న్యాయస్థానంలో కేసుల నిర్వహణపై అంతటి ఆందోళన వ్యక్తమవడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక. న్యాయమూర్తుల మధ్య విభేదాలను సంస్థాగత సంస్కరణల ద్వారా పరిష్కరించకుండా, వాటిని వ్యక్తిగత వివాదాలుగా పక్కనపెడితే, ప్రజల విశ్వాసానికి మరింత నష్టం కలుగుతుంది.

న్యాయమూర్తుల అవినీతిపై చర్చలో 2025 మార్చిలో వెలుగులోకి వచ్చిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో కాలిపోయిన నగదు వ్యవహారం అత్యంత తీవ్రమైన ఉదాహరణ. ఆయన అధికారిక నివాసంలోని ఒక గదిలో అగ్నిప్రమాదం జరిగిన తరువాత భారీగా కాలిపోయిన కరెన్సీ నోట్లు కనిపించాయని నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ జరిగింది. 2026 ఆగస్టులో పార్లమెంటుకు సమర్పించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ నివేదికలో, నగదు ఉనికిని ఆయన సంతృప్తికరంగా వివరించలేకపోయారని, సంబంధిత ఆరోపణలన్నీ నిరూపితమయ్యాయని పేర్కొంది. జస్టిస్ వర్మ మాత్రం నగదు తనది కాదని, తనను ఇరికించేందుకు కుట్ర జరిగిందని వాదించారు. ఆయన 2026 ఏప్రిల్‌లో రాజీనామా చేశారు.

ఈ ఘటనను ఒక న్యాయమూర్తి వ్యక్తిగత వివాదంగా మాత్రమే చూడలేం. సాధారణ పౌరుడి ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో లెక్కచెప్పలేని నగదు కనిపిస్తే దర్యాప్తు సంస్థలు ఎలా స్పందిస్తాయి? అదే ప్రశ్న న్యాయమూర్తి విషయంలోనూ వర్తించాలి. చట్టం ముందు అందరూ సమానులైతే, న్యాయమూర్తులకు ప్రత్యేకమైన రక్షణ కవచం ఉండకూడదు. అయితే ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తికి తన వాదన వినిపించే హక్కు కూడా ఉంటుంది. అందుకే విచారణ స్వతంత్రంగా, సాక్ష్యాధారాలపై, బహిరంగంగా పరిశీలించదగిన పద్ధతిలో జరగాలి. న్యాయవ్యవస్థ తనలోని అవినీతిని తానే విచారించుకునే వ్యవస్థగా మాత్రమే మిగిలిపోతే, ప్రజల విశ్వాసం పునరుద్ధరించడం కష్టం.

అవినీతి ఆరోపణలతోపాటు న్యాయమూర్తుల పదవీ విరమణ




అనంతర నియామకాలు న్యాయవ్యవస్థ స్వతంత్రతపై మరింత తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ 2019 నవంబరులో పదవీ విరమణ చేయగా, 2020 మార్చిలో కేంద్ర ప్రభుత్వ సిఫారసుతో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇది చట్టవిరుద్ధమని నిర్ధారించకపోవచ్చు. కానీ ఆయన పదవీకాలంలో రాఫెల్ ఒప్పందం, అయోధ్య వివాదం వంటి రాజకీయంగా కీలకమైన కేసుల్లో ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో ఈ నియామకం తీవ్ర చర్చకు దారితీసింది. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్, ఈ నియామకం న్యాయవ్యవస్థ స్వతంత్రత, నిష్పాక్షికతకు సంబంధించిన ఉన్నత ప్రమాణాలను దెబ్బతీసిందని విమర్శించారు. ఇదే విషయంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి. లోకూర్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా, పదవీ విరమణ అనంతర నియామకాలు న్యాయవ్యవస్థ స్వతంత్రతపై మచ్చ వేయవచ్చని జస్టిస్ గొగోయ్ స్వయంగా గతంలో వ్యాఖ్యానించారు.

ఇక్కడ ప్రశ్న జస్టిస్ గొగోయ్ వ్యక్తిగత ఉద్దేశాలను ఊహించడం కాదు. ఒక ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో తీర్పులు ఇచ్చిన కొద్ది నెలల్లోనే అదే ప్రభుత్వ సిఫారసుతో పార్లమెంటులోకి వెళ్లడం ప్రజల్లో ఎలాంటి సందేశాన్ని పంపుతుంది? తీర్పుకు ప్రతిఫలంగా పదవి ఇచ్చారని నిరూపించే ఆధారాలు లేకపోయినా, అటువంటి అనుమానాలకు తావిచ్చే వ్యవస్థను ఎందుకు కొనసాగించాలి? న్యాయమూర్తులకు పదవీ విరమణ తరువాత ప్రభుత్వ నియామకాలపై కనీసం నిర్దిష్ట కాలం నిషేధం విధించడం, స్వతంత్ర ఎంపిక విధానం రూపొందించడం వంటి సంస్కరణలు ఈ అనుమానాలను తగ్గించవచ్చు.

ఈ సమస్యపై అకడమిక్ పరిశోధనలు కూడా ఆందోళనకరమైన ప్రశ్నలను లేవనెత్తాయి. 2021లో "జర్నల్ ఆఫ్ లా అండ్ ఎకనామిక్స్" లో ప్రచురితమైన మాధవ్ ఎస్. ఆనె, శుభాంకర్ దామ్, జియోవన్నీ ఇరువురి సంయుక్త రచన "జాబ్స్ ఫర్ జస్టిస్(ఎస్): కరప్షన్ ఇన్ ద సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా" లో 1999--2014 మధ్య కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సుప్రీంకోర్టు కేసులను పరిశీలించారు. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇచ్చే ప్రోత్సాహకాలు, పదవీ విరమణ అనంతరం లభించే ప్రతిష్ఠాత్మక పదవుల మధ్య సంబంధాన్ని వారి పరిశోధన గుర్తించింది. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు రాసిన న్యాయమూర్తులకు పదవీ విరమణ అనంతరం ప్రతిష్ఠాత్మక పదవులు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు నివేదించారు.

2023లో "ఏషియన్ జర్నల్ ఆఫ్ లా అండ్ సొసైటీ" లో ప్రచురితమైన శుభాంకర్ దామ్ పరిశోధన కూడా పదవీ విరమణ అనంతర నియామకాలను సంస్థాగత అవినీతి కోణంలో విశ్లేషించింది. ప్రభుత్వ నియామకాలపై ఆశలు న్యాయమూర్తుల స్వతంత్రతను బలహీనపరిచే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. ఇవి ప్రతి న్యాయమూర్తి లంచం తీసుకున్నారని నిరూపించే పరిశోధనలు కాకపోవచ్చు. అయితే న్యాయమూర్తుల నిర్ణయాలపై ప్రభుత్వ నియామకాల ప్రభావం ఉండే అవకాశాన్ని గణాంకపరంగా పరిశీలించిన అధ్యయనాలు కావడం వల్ల వీటిని తేలిగ్గా కొట్టిపారేయలేం.

మరోవైపు, న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వానికి పాత్ర ఉండాలా, కొలీజియం వ్యవస్థలో పారదర్శకత ఎంతవరకు ఉందనే వివాదం కూడా ఇప్పటికీ ఏదో సందర్భంలో కొనసాగుతోంది. 2015లో సుప్రీంకోర్టు జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, కొలీజియం వ్యవస్థను కొనసాగించింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడేందుకు ఈ నిర్ణయం అవసరమని సమర్థించినవారున్నారు. కానీ న్యాయమూర్తుల నియామకాల్లో కొలీజియం తీసుకునే నిర్ణయాలకు తగిన పారదర్శకత లేదని విమర్శించిన వారుకూడా ఉన్నారు. అంటే సమస్యకు పరిష్కారం న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడం కాదు; న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుతూనే నియామక ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీగా మార్చడం.

ప్రస్తుతం ఎన్నికల సంఘం నియామకాలు, ఓటర్ల జాబితాల సవరణలపై జరుగుతున్న వివాదంలోనూ ఇదే ప్రమాణం వర్తించాలి. 2023 చట్టం ద్వారా ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రికి చోటు కల్పించడం వల్ల ప్రభుత్వ ప్రభావం పెరుగుతుందనే విమర్శ ఉంది. ఓటర్ల పేర్ల తొలగింపులపై ప్రతిపక్షాలు, పౌరసంఘాలు చేస్తున్న ఆరోపణలను కూడా స్వతంత్రంగా పరిశీలించాలి. అయితే సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేయడం, సమాధానాలు కోరడం తుది తీర్పుతో సమానం కాదు. న్యాయస్థానం ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తుందా లేదా అనేది ముందుగానే నిర్ణయించకుండా, చివరి తీర్పులో ఓటు హక్కు, పారదర్శకత, సమానత్వం ఎంతవరకు రక్షించబడ్డాయో పరిశీలించాలి.

ప్రజలు గుర్తుంచుకోవాల్సిన చివరి విషయం ఇదే: న్యాయవ్యవస్థపై విమర్శించడం ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు; ఆధారాలు లేకుండా వ్యక్తులపై అవినీతి ముద్ర వేయడం కూడా సమంజసం కాదు. న్యాయమూర్తుల ఇళ్లలో నగదు లభించిన వ్యవహారాలైనా, పదవీ విరమణ అనంతర నియామకాలైనా, ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన తీర్పులైనా---ప్రతి అంశంపైనా స్వతంత్ర విచారణ, బహిరంగ సమాచారం, స్పష్టమైన జవాబుదారీతనం అవసరం. మాజీ న్యాయమూర్తులు బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం, సంస్థలోనే సంస్కరణల అవసరాన్ని గుర్తుచేస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో జరిగిన రాజకీయ పరిణామాల మాదిరిగా హింసాత్మక ఉద్యమాలే మార్పు తెస్తాయని భావించడం ప్రమాదకరం. ప్రభుత్వాలపై దాడులు కాదు, రాజ్యాంగబద్ధమైన ప్రజా ఉద్యమాలు, శాంతియుత నిరసనలు, స్వతంత్ర మీడియా, న్యాయపోరాటాలు, పార్లమెంటరీ పర్యవేక్షణే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. న్యాయమూర్తులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారనే దృశ్యంతో ప్రజలు సంతృప్తి చెందకూడదు; ప్రభుత్వ తప్పులను న్యాయస్థానం నిజంగా అడ్డుకుందా అని అడగాలి. న్యాయమూర్తులకూ చట్టం వర్తించాలి, ప్రభుత్వానికీ రాజ్యాంగం వర్తించాలి. న్యాయవ్యవస్థ ప్రజల విశ్వాసాన్ని కోరుకుంటే, తన స్వతంత్రతను మాటల్లోనే కాదు... తీర్పుల్లో, నియామకాల్లో, జవాబుదారీతనంలో నిరూపించాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.
ramkishore.1504@gmail.com

# గోదీ మీడియా ప్రచారపు ఆర్భాటం.. ప్రజా సమస్యల పాతాళం!

నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా కలిపి పాతికేళ్లు అధికారంలో కొనసాగడం ఒక రాజకీయ రికార్డు కావచ్చు. కానీ ఆ రికార్డును ప్రజల విజయంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమే. అధికారంలో ఎంతకాలం ఉన్నారన్నది కాదు, ఆ అధికారంతో ప్రజలకు ఏమి సాధించిపెట్టారన్నదే అసలు ప్రశ్న. ఎన్నికల్లో గెలవడాన్ని పాలనా విజయంగా, ప్రచారాన్ని పరిపాలనా పనితీరుగా, నాయకుడి వ్యక్తిగత ప్రతిష్ఠను దేశ ప్రతిష్ఠగా చూపించే రాజకీయ మార్కెటింగ్‌కు మోదీ పాలన ఒక ఉదాహరణగా నిలుస్తోందా అనే ప్రశ్నను దేశం తీవ్రంగా పరిశీలించాలి.

మోదీ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి గురించి గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలు ఎవరికి చేరుతున్నాయన్నది కీలకం. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అవకాశాలను గుర్తించినంత మాత్రాన నిరుద్యోగం, అసమానతలు, జీవన వ్యయాల సమస్యలు పరిష్కారమైనట్లు కాదు. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం 2025లో భారత స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 7.6 శాతంగా నమోదైంది. అయినప్పటికీ, ఆర్థిక వృద్ధి వేగానికి అనుగుణంగా నాణ్యమైన ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయా? యువత చదువులు పూర్తిచేసుకుని ఉపాధి కోసం ఎందుకు ఎదురుచూడాల్సి వస్తోంది? ప్రభుత్వమే విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) 2023--24 ప్రకారం 15--29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 10.2 శాతం. ఈ గణాంకం ఒక్కటే యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం జవాబుదారీగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తుంది.

రూపాయి విలువ పతనం కూడా ఆర్థిక విధానాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. 2026 అక్టోబర్ 16న రూపాయి డాలరుకు రూ.94.96 వద్ద ముగిసిందని రాయిటర్స్ నివేదించింది. ఈ ఏడాది రూపాయిపై ఒత్తిడి, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, చమురు దిగుమతుల వ్యయం వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా నిలిచాయి. రూపాయి బలహీనపడితే దిగుమతి చేసుకునే చమురు, ఎరువులు, ఎలక్ట్రానిక్ వస్తువుల ఖర్చులు పెరిగే ప్రమాదం ఉంటుంది. కార్మిక రంగంలో నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకొచ్చిన ప్రభుత్వం వాటి అమలు, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సమ్మె హక్కు, సామాజిక భద్రతపై ఆందోళనలకు సమగ్ర సమాధానాలు ఇవ్వాలి. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడమే అభివృద్ధి కాదు; కార్మికుడికి న్యాయమైన వేతనం, సురక్షితమైన పని పరిస్థితులు, సంఘటితమయ్యే హక్కు కూడా అభివృద్ధిలో భాగమే. కార్పొరేట్లకు విధానపరమైన వెసులుబాట్లు కల్పిస్తూ కార్మికుల హక్కులను బలహీనపరిస్తే, వృద్ధి లాభాలు కొద్దిమందికే పరిమితమయ్యే ప్రమాదం ఉంటుంది.

మహిళల భద్రత విషయంలోనూ నినాదాలకు, వాస్తవాలకు మధ్య అంతరం కనిపిస్తోంది. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2023 నివేదిక ప్రకారం దేశంలో మహిళలపై నేరాలకు సంబంధించి 4,48,211 కేసులు నమోదయ్యాయి. వాటిలో అత్యాచార కేసులే 29,670. ఈ గణాంకాలు ఒక్కటే మోదీ పాలన వల్ల నేరాలు పెరిగాయని నిరూపించవు; పోలీసు వ్యవస్థ ప్రధానంగా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది. పత్రికా స్వేచ్ఛ విషయంలో అంతర్జాతీయ గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ రూపొందించిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ 180 దేశాల్లో 157వ స్థానంలో ఉంది; 2025లో 151వ స్థానంలో ఉండేది. ఈ ర్యాంకు ఒక్కటే ప్రభుత్వ జోక్యాన్ని నిరూపించదు. అయినప్పటికీ, మీడియా యాజమాన్య కేంద్రీకరణ, జర్నలిస్టుల భద్రత, రాజకీయ ఒత్తిళ్లపై అంతర్జాతీయ సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను నిర్లక్ష్యం చేయలేం. ప్రధానమంత్రి స్వతంత్ర విలేకరుల ప్రశ్నలకు నిరంతరం ఎదురుగా నిలిచి, కఠినమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పే పారదర్శక సంప్రదాయాన్ని ఎందుకు బలోపేతం చేయడం లేదు? ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు; ప్రజాస్వామ్యానికి అది ప్రాణవాయువు.

కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఆదాయపు పన్ను శాఖ, ఎన్నికల సంఘం, గవర్నర్లు రాజ్యాంగబద్ధ స్వతంత్రతతో పనిచేస్తున్నారనే నమ్మకాన్ని నిలబెట్టడం ప్రభుత్వ బాధ్యత.

మోదీ పాతికేళ్ల పాలనపై తుది తీర్పు వ్యక్తిగత ఆరాధనతోనో, ప్రత్యర్థుల విమర్శలతోనో నిర్ణయించకూడదు. కానీ నిరుద్యోగం, రైతుల సమస్యలు, మహిళల భద్రత, మీడియా స్వేచ్ఛ, సంస్థల స్వతంత్రత, విదేశాంగ సవాళ్లు వంటి అంశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రజల హక్కు. బలమైన నాయకుడు ప్రశ్నలను అణచివేయడు; సమాధానాలు చెబుతాడు. పాతికేళ్లు అధికారంలో ఉండటం గొప్పతనం కాదు. పాతికేళ్ల తర్వాత కూడా ప్రజలు అదే సమస్యలతో పోరాడుతుంటే, అదే అధికారానికి ఎదురుగా తమ హక్కుల కోసం వీధుల్లోకి రావాల్సి వస్తే, సంబరాలు చేసుకోవాల్సింది నాయకుడి దీర్ఘాయుష్షును కాదు... ఆ పాలనపై ప్రజాస్వామ్యం అడుగుతున్న ప్రశ్నలను.

- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
ramkishore.1504@gmail.com

# కంచంలో విషం అమ్ముతున్న - హోటళ్లు, రెస్టారెంట్లు!

**ఆహార భద్రతకు పెనుముప్పు -- మారుతున్న ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న అనారోగ్య ప్రమాదాలు!!**

మనిషికి ఆహారం జీవనాధారం. ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన శక్తిని, పోషకాలను అందించేది ఆహారమే. అయితే అదే ఆహారం కలుషితమైతే, నాణ్యతలేని పదార్థాలతో తయారైతే, నిల్వలో నిర్లక్ష్యం జరిగితే, విషతుల్యమైన రసాయనాలు కలిస్తే మనిషి ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ఒకప్పుడు ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యం ఇచ్చిన కుటుంబాలు నేడు హోటళ్లు, రెస్టారెంట్లు, రహదారుల పక్కన ఉన్న అల్పాహార కేంద్రాలు, ఆహార బండ్లు, ఆన్‌లైన్ ద్వారా ఆహారాన్ని సరఫరా చేసే సంస్థలపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. మారుతున్న జీవనశైలి, పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, విద్యార్థుల వసతి అవసరాలు, ఐటీ రంగం విస్తరణ ఈ మార్పుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అయితే ఆహారాన్ని అమ్మడం వ్యాపారంగా మారిన ఈ పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందుతున్నదా? అనే ప్రశ్న అత్యంత కీలకంగా మారింది. కొన్నిచోట్ల కుళ్లిపోయిన కూరగాయలు, పాడైన మాంసం, గడువు ముగిసిన పదార్థాలు, అపరిశుభ్రమైన వంటగదులు బయటపడుతున్న నేపథ్యంలో ప్రజల కంచంలో వడ్డిస్తున్న ఆహారమే వారి ఆరోగ్యానికి ముప్పుగా మారుతోందనే ఆందోళన పెరుగుతోంది.



భారతదేశంలో హోటళ్ల సంస్కృతి కొత్తదేమీ కాదు. హైదరాబాద్ వంటి నగరాల్లో నిజాం పాలన కాలం నుంచే భోజనశాలలు, టీ దుకాణాలు, అల్పాహార కేంద్రాలు ఉన్నాయి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి పట్టణాల్లోనూ ప్రయాణికులకు భోజనం అందించే హోటళ్లు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. అయితే గతంలో హోటళ్ల సంఖ్య పరిమితంగా ఉండేది. చాలామంది కుటుంబాలు ఇంట్లోనే వంట చేసుకునేవారు. పట్టణాల్లోని ఉద్యోగులు, ప్రయాణికులు, విద్యార్థులు అవసరమైనప్పుడు మాత్రమే హోటళ్లలో భోజనం చేసేవారు. నేటి పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు బయటే తినే కుటుంబాలు, ఉద్యోగులు, విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు రోజువారీ జీవనశైలిలో కనిపిస్తున్నది. అయితే ఈ మార్పు ఎంత శాతం ప్రజల్లో చోటుచేసుకున్నదో నిర్ధారించడానికి తెలంగాణ రాష్ట్రస్థాయి ప్రాతినిధ్య సర్వే అవసరం.

## ఐటీ రంగం విస్తరణతో మారిన ఆహార సంస్కృతి

హైదరాబాద్‌లో ఆహార వ్యాపారం వేగంగా విస్తరించడానికి 1990వ దశకం చివరి సంవత్సరాలు, 2000వ దశకం ప్రారంభం కీలకమైన కాలంగా చెప్పవచ్చు. ముఖ్యంగా 1998 నుంచి 2000 మధ్య ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందడం, సైబరాబాద్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ సంస్థలు విస్తరించడం, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగులు హైదరాబాద్‌కు రావడం పట్టణ ఆర్థిక వ్యవస్థను మార్చాయి. 1999--2000 నాటికి హైదరాబాద్ ఐటీ రంగంలో ఉద్యోగుల సంఖ్య, సాఫ్ట్‌వేర్ ఎగుమతులు గణనీయంగా పెరిగినట్లు ఆర్థిక చరిత్రపై అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ మార్పులతో పాటు కార్యాలయాల సమీపంలో భోజనశాలలు, టీ కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, కుటుంబ రెస్టారెంట్లు, రాత్రి వేళల్లో పనిచేసే ఆహార కేంద్రాలకు డిమాండ్ పెరిగింది.

2000--2010 మధ్యకాలంలో హైదరాబాద్ నగరం మరింత విస్తరించడం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు అభివృద్ధి చెందడం, జాతీయ రహదారులపై రవాణా పెరగడం ఆహార వ్యాపార విస్తరణకు అనుకూల పరిస్థితులను సృష్టించాయి. 2010--2020 మధ్యకాలంలో ఆన్‌లైన్ ఆహార సరఫరా, స్మార్ట్‌ఫోన్ వినియోగం, డిజిటల్ చెల్లింపులు విస్తరించడంతో ఇంటి వద్దకే భోజనం తెప్పించుకునే అలవాటు మరింత సాధారణమైంది. 2020లో కొవిడ్ మహమ్మారి కారణంగా ఆన్‌లైన్ ఆహార సరఫరాకు ప్రాధాన్యం పెరిగినప్పటికీ, ఆ సేవలు అంతకుముందే ప్రారంభమయ్యాయి.

అయితే తెలంగాణలో తినుబండారాల కేంద్రాలు ఒక నిర్దిష్ట సంవత్సరంలోనే పుట్టుకొచ్చాయని చెప్పడానికి ఆధారాలు లేవు. 1990వ దశకం చివరి నుంచి పట్టణీకరణ, ఐటీ రంగం, రవాణా, ఉద్యోగాల విస్తరణతో ఈ ధోరణి వేగం పుంజుకుంది. 2010వ దశకం, ముఖ్యంగా దాని ద్వితీయార్థంలో ఆన్‌లైన్ ఆహార సరఫరా, యువత జీవనశైలి ఈ వ్యాపారానికి మరింత ఊతమిచ్చాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాలు, అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లోనూ ఆహార వ్యాపార విస్తరణ స్పష్టంగా కనిపించింది. ఈ విస్తరణకు సంబంధించిన ఖచ్చితమైన ప్రారంభ సంవత్సరాన్ని నిర్ణయించాలంటే జిల్లా వారీగా వ్యాపార నమోదు గణాంకాలను పరిశీలించాలి.

## పుట్టగొడుగుల్లా పెరుగుతున్న తినుబండారాల కేంద్రాలు

నేడు తెలంగాణలోని ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాలు, విద్యాసంస్థల ప్రాంతాలు, బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కార్యాలయాల సమీపంలో చిన్నా పెద్దా ఆహార కేంద్రాలు కనిపిస్తున్నాయి. ఒకే వీధిలో పదుల సంఖ్యలో అల్పాహార దుకాణాలు, టీ బండ్లు, బిర్యానీ కేంద్రాలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, బేకరీలు ఉండటం సాధారణ దృశ్యంగా మారింది. తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించగలగడం, నిరంతర డిమాండ్, నగదు లావాదేవీలు, యువతలో బయట ఆహారంపై ఆసక్తి ఈ వ్యాపార విస్తరణకు కారణాలుగా ఉన్నాయి. 2025 జూలైలో వెలువడిన ఒక నివేదిక ప్రకారం తెలంగాణలో ఆహార వ్యాపార లైసెన్సులు 2023--24లో 12,096 ఉండగా, 2024--25లో 32,167కు పెరిగాయి. అదే సమయంలో చిన్న ఆహార వ్యాపారాల నమోదు సంఖ్య 43,473 నుంచి 85,941కు చేరినట్లు ఆహార భద్రతా శాఖ గణాంకాల ఆధారంగా నివేదించారు. ఈ సంఖ్యలు రాష్ట్రంలో ఆహార వ్యాపారాల నమోదు వేగంగా పెరుగుతున్నదనే విషయాన్ని సూచిస్తున్నాయి. అయితే లైసెన్సులు, నమోదుల సంఖ్య పెరగడం మాత్రమే నాణ్యత తగ్గిందని నిరూపించదు. పెరుగుతున్న వ్యాపారాలకు అనుగుణంగా తనిఖీలు, ప్రయోగశాల పరీక్షలు, పరిశుభ్రత ప్రమాణాల అమలు కూడా బలపడుతున్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న.

## విద్యార్థులు, ఉద్యోగులు బయట భోజనంపై ఎందుకు ఆధారపడుతున్నారు?

ప్రస్తుతం కేజీ నుంచి పీజీ వరకు వివిధ స్థాయిల్లో చదువుకునే విద్యార్థులు తమ స్వస్థలాలకు దూరంగా హాస్టళ్లలో, అద్దె గదుల్లో ఉంటున్నారు. ఇంజినీరింగ్, వైద్య, జాతీయస్థాయి విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, వృత్తి విద్యా కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు భోజనం ఒక ముఖ్యమైన రోజువారీ సమస్యగా మారింది. ఐటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, రాత్రి పూట విధులు నిర్వహించే సిబ్బంది, ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు, నర్సులు, రవాణా రంగ ఉద్యోగులు, రోజువారీ కూలీలు కూడా తమ పని వేళలకు అనుగుణంగా బయట ఆహారాన్ని తీసుకుంటున్నారు. కుటుంబాల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే పరిస్థితుల్లో వంటకు సమయం లేకపోవడం కూడా హోటళ్లపై ఆధారపడటానికి ఒక కారణం.

ఆహార భద్రతా వ్యవస్థలు సమర్థంగా పనిచేసినప్పుడు, వ్యాపారులు నైతిక విలువలకు కట్టుబడినప్పుడు, వినియోగదారులు అప్రమత్తంగా ఉన్నప్పుడు మాత్రమే ఈ సమస్యను నియంత్రించగలం. హోటళ్లు, రెస్టారెంట్లు ప్రజలకు ఆహారం అందించే కేంద్రాలుగా మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహార సంస్కృతికి ప్రతీకలుగా మారాలి. లాభం కంటే ప్రాణం విలువైనదనే సత్యాన్ని ప్రతి ఆహార వ్యాపారి గుర్తించాలి. ప్రజల ప్రాణాలను కాపాడే పరిశుభ్రమైన ఆహార వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. అప్పుడే "కంచంలో విషం" అనే ఆందోళనకు ముగింపు పలికి, ప్రతి ఒక్కరికీ సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# రాజ్యాంగ పరిరక్షణకు వృత్తి నిపుణులు ఏకతాటిపైకి రావాలి

- ప్రభుత్వ విధానాల పర్యవేక్షణకు 'షాడో మినిస్ట్రీ' అవసరం
- ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్

**హయత్‌నగర్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** భారత రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు, పౌర స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం వృత్తి నిపుణులంతా ఏకతాటిపైకి రావాలని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ పరిరక్షణ ఎంతో కీలకమని, దేశ నిర్మాణంలో వృత్తి నిపుణుల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏఐపీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా గాంధీభవన్‌కు వచ్చిన మధుయాష్కి గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగం దేశ ప్రజలందరికీ మార్గదర్శకమని, దాని ద్వారా కల్పించిన హక్కులు, స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, బీజేపీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను హరిస్తోందని ఆయన విమర్శించారు.




### రాజ్యాంగ పరిరక్షణలో ఏఐపీసీ కీలక పాత్ర

వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, రాజ్యాంగ పరిరక్షణతో పాటు దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచాలనే ఉద్దేశంతో 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారని మధుయాష్కి వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దాదాభాయ్ నౌరోజీ, మోతీలాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకులు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. న్యాయవాదులు, వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, జర్నలిస్టులు సహా వివిధ వృత్తుల్లో నిష్ణాతులైన వారు ఏఐపీసీలో భాగస్వాములు కావాలని కోరారు. కాంగ్రెస్ సభ్యత్వం లేని వారు, ఇతర పార్టీల్లో ఉన్న వృత్తి నిపుణులు సైతం రాజ్యాంగ పరిరక్షణ కోసం తమతో కలిసి పనిచేయవచ్చని తెలిపారు. తనకు అప్పగించిన ఏఐపీసీ చైర్మన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థను దేశవ్యాప్తంగా విస్తరిస్తానని చెప్పారు.

### 100 పట్టణ జిల్లాల్లో కమిటీల ఏర్పాటు

తొలి దశలో దేశంలోని 100 పట్టణ జిల్లాల్లో వివిధ వృత్తులకు చెందిన నిపుణులతో ఏఐపీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మధుయాష్కి వెల్లడించారు.
మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా శిక్షణ వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన నిపుణులను తయారు చేయడంలో భాగంగా మన్మోహన్ సింగ్ ఫెలోషిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మధుయాష్కి తెలిపారు. తొలి విడతలో 50 మందికి ఏడాది పాటు శిక్షణ ఇచ్చామని, రెండో విడత కోసం 800 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రెండో విడతలో 100 మందికి శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు https://manmohansinghfellows.comవెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగినవారు ప్రజా విధానాల రూపకల్పనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### పారదర్శక పాలనకు 'షాడో మినిస్ట్రీ' అవసరం

ప్రభుత్వ విధానాలను స్వతంత్రంగా పరిశీలించి, వాటిపై నివేదికలు రూపొందించే 'షాడో మినిస్ట్రీ' తరహా వ్యవస్థ అవసరమని మధుయాష్కి అన్నారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు తీసుకునే నిర్ణయాలను నిపుణులు విశ్లేషించి, లోపాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తే పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.

## తార్నాకలో ఘనంగా 'సేవా సంకల్ప్' ముగింపు వేడుకలు



**సికింద్రాబాద్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవా సంకల్ప్' ముగింపు కార్యక్రమం తార్నాకలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పేద మహిళలకు, పారిశుద్ధ్య కార్మికులకు ఆయన చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. అనంతరం మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ఇంటలెక్చువల్ కన్వీనర్ శ్రీరాం వెంకట్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నిరుపేద వర్గాలకు సేవ చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. మోదీ స్ఫూర్తితో నిరంతరం ప్రజాసేవలో ముందుంటామని తెలిపారు. 'తార్నాక సేవా 25'లో భాగంగా డివిజన్ పరిధిలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేకల సారంగపాణి, తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, నాయకులు అలేటి అనూష, కృష్ణగౌడ్, ఆసరోజ్ ప్రకాష్‌గౌడ్, కుల శ్రీనివాస్, దేవా, శ్రీనివాస్, శివగౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# వరుణ యాగం నిర్వహించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, రైతుల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం నిర్వహించారు. ప్రకృతి అనుకూలించి సకాలంలో వర్షాలు కురవాలని, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరుణ దేవుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవాలని, పంటలకు అవసరమైన నీరు సమృద్ధిగా అందాలని ప్రార్థించారు. రైతులు సాగు చేసిన పంటలు ఏపుగా పెరిగి, మంచి దిగుబడులు సాధించి, వారి కష్టానికి తగిన ఫలితం దక్కాలని ఆకాంక్షించారు. రైతుల కుటుంబాల్లో సిరిసంపదలు వెల్లివిరిసి, గ్రామీణ ప్రాంతాలు పాడిపంటలతో కళకళలాడాలని స్వామివారిని వేడుకున్నారు.

### రైతులకు సాగునీరు.. ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందాలి

వర్షాలు వ్యవసాయ రంగానికి జీవనాధారమని, సకాలంలో వర్షాలు కురిస్తేనే రైతులు ఆశించిన స్థాయిలో పంటలు పండించేందుకు అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. చెరువులు, కుంటలు నీటితో నిండి జలకళను సంతరించుకోవాలని, జలవనరులు సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు. భూగర్భ జలమట్టాలు పెరిగి వ్యవసాయానికి, ప్రజల తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని కోరుకున్నారు. చిలుకానగర్ శివాలయంలో నిర్వహించిన ఈ వరుణ యాగంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర సంక్షేమం, రైతుల అభివృద్ధి, సమృద్ధిగా వర్షాలు కురవడం వంటి అంశాలపై ప్రార్థనలు చేశారు. భక్తులు కూడా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ ఉక్కుపాదం

- ఆదిబట్ల సర్కిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- అనుమతి రెండంతస్తులు
- నిర్మాణం నాలుగైదు అంతస్తులు
- జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ ఎస్ఐ నంద కిషోర్ ఆధ్వర్యంలో పై అంతస్తుల తొలగింపు

**రంగారెడ్డి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ జోన్ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్ – 15లో భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. రెండు భవనాల స్లాబులను ధ్వంసం చేశారు. ముందుకు సంబంధించిన వివరాలు.. ఆదిబట్ల గ్రామ పరిధిలోని ఓ భవనానికి నిబంధనల ప్రకారం స్టిల్ట్ ప్లస్ 2 పై అంతస్తులకు మాత్రమే జీహెచ్ఎంసీ అనుమతి ఉంది. అయితే, భవన యజమానులు అనుమతులను పూర్తిగా ఉల్లంఘించి క్షేత్రస్థాయిలో స్టిల్ట్ ప్లస్ 4పై అంతస్తుల వరకు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన 3, 4వ అంతస్తుల అక్రమ నిర్మాణ భాగాలను శనివారం అధికారులు కూల్చివేశారు.



### ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ విజిలెన్స్ ఎస్ఐ నంద కిషోర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భవన యజమానులు అందరూ తప్పనిసరిగా తమకు మంజూరైన నిర్మాణ అనుమతులు, అనుమతించిన అంతస్తుల సంఖ్య, నిర్ణీత సెట్‌బ్యాక్‌లకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నగరంలో అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు ప్రజలు సంబంధిత అధికారుల నుంచి తగిన అనుమతులు పొంది, మంజూరైన ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# అక్టోబర్ 25లోగా ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కారం పూర్తి చేయాలి

- ఫారం-6, 7, 8 దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల పరిష్కారంతో పాటు ఫారం–6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ పురోగతి, ఫారం–6, 7, 8 దరఖాస్తుల పెండింగ్, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, డీఆర్వో రామ్ రెడ్డితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఎస్ఐఆర్ నోటీసులను పరిష్కరించడంతో పాటు ఫారం–6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను త్వరితగతిన పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాల ధ్రువీకరణను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అనామలీస్‌కు సంబంధించి జారీ చేసిన నోటీసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నోటీసుల పరిష్కార సమయంలో ఆధార్ కార్డుతో పాటు మరో గుర్తింపు పత్రాన్ని స్వీకరించి, సంబంధిత వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని అధికారులకు సూచించారు. అక్టోబర్ 25వ తేదీలోగా ఎస్ఐఆర్ నోటీసుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



# పాలపిట్టను బంధిస్తే క్రిమినల్ కేసులు

- అటవీ శాఖ అధికారుల హెచ్చరిక
- సంరక్షణపై ప్రజలకు అవగాహన

**చేవెళ్ల, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** విజయదశమి పండుగ సందర్భంగా పాలపిట్టను పట్టుకోవడం, బంధించడం, విక్రయించడం, కొనడం లేదా ప్రదర్శించడం వంటి చర్యలకు పాల్పడితే నేర కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఉప అటవీ క్షేత్ర అధికారి రవికుమార్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర పక్షి అయిన పాలపిట్టను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. విజయదశమి రోజున పాలపిట్టను చూడటం శుభప్రదమనే నమ్మకంతో కొందరు వాటిని పట్టుకుని బోనుల్లో బంధించి ప్రజలకు ప్రదర్శిస్తుంటారని తెలిపారు. అయితే, ఇలాంటి చర్యలు వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. పాలపిట్టలను బంధించకుండా ప్రకృతిలో స్వేచ్ఛగా ఎగురుతున్న సమయంలోనే వీక్షించాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా పాలపిట్టలను పట్టుకున్నా, బంధించినా లేదా విక్రయించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. పాలపిట్ట సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో పాలపిట్ట సంరక్షణపై అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌తో పాటు దుర్గామాత ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలపిట్టను కాపాడుకుందాం, క్రూరత్వం లేని దసరా జరుపుకుందాం అనే సందేశంతో పోస్టర్లు ప్రదర్శించారు. పాలపిట్టలను పట్టుకోవడం, బంధించడం, అమ్మడం, కొనడం, ప్రదర్శించడం చట్టరీత్యా నేరమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు కనిపిస్తే 18004255364, 9803338666 నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# నిమ్స్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ఖైరతాబాద్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి వేడుకలు సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు ఉద్యోగుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నిమ్స్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. మహిళా ఉద్యోగుల సంప్రదాయ వస్త్రధారణ, ఉత్సాహభరితమైన పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పరంజ్యోతి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి, నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డాక్టర్ మార్తా రమేష్ సత్యగౌడ్, ఎం.రాజ్ కుమార్, రాజ్ కుమార్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, రాధిక, కనకతార, ఆశాలత, సౌజన్య, గోవర్ధన్, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వైద్య, నర్సింగ్ సిబ్బంది, ఎంహెచ్‌ఎం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓటరు జాబితా పునః తయారీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు
- అధికారులను ఆదేశించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితా పునఃతయారీ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, అడిషనల్ కమిషనర్ బాదావత్ సంతోష్‌లు అధికారులను ఆదేశించారు. శనివారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల(ఏఈఆర్వో)తో నిర్వహించిన సమావేశంలో ఫారం–18 దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలపై పలు సూచనలు చేశారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రతి ఎన్నికకు ముందు కొత్తగా రూపొందించాల్సి ఉన్నందున, గతంలో ఓటరుగా నమోదైనవారు సైతం తిరిగి ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఫారం–18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయిం చారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నారు.



# తెలంగాణలో గవర్నర్ కోటాలో వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

- జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్

**మొయినాబాద్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నా వడ్డెరుల జీవితాలలో ఏ మార్పు రాలేదని వడ్డెరులు అన్ని రంగాలలో వెనుకబడి పోయారని మాకు రావలసిన కనీస హక్కులు విద్యా, వైద్యం, ఆర్థికభద్రత, సామాజిక భద్రత, రాజకీయం అనే ఏ అంశాలు మా దరిదాపున కూడా రావటం లేదని పిట్ల శ్రీధర్ గారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని అన్ని రంగాలలో మా వాట మాకు దక్కాలని ప్రతి ప్రభుత్వ స్కీమ్ లో జనాభా దమాషా ప్రకారం మా వాటా మాకు రావాలని అన్నారు. 80 సంవత్సరాల కాలంలో మా వడ్డెర సమాజానికి చట్టసభలో ఏ ప్రాతినిధ్యం లేదని, అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మా మద్దతు కోరుతాయి కానీ ఎలక్షన్ అయిపోయిన తర్వాత మమ్మల్ని పట్టించుకునే పాపాన పోవటం లేదని అన్నారు. మా సామాజిక వర్గం నుండి కూడా చట్ట సభల్లో మాట్లాడే గొంతుక కావాలని పిట్ల శ్రీధర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాకు కార్పొరేషన్ చైర్మన్లు అలాగే రెండు మీజ లు అక్కడి ప్రభుత్వాలు కేటాయించాయని, అలాగే ఇక్కడి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సారిగా మా కులానికి కార్పొరేషన్ చైర్మన్లు ఇచ్చిమాకు విలువ ఇచ్చిందని దానికి ఇక్కడి ప్రభుత్వానికి అలాగే ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రభుత్వాలకి మా వడ్డెరుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు అని పిట్ల శ్రీధర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నివేదికల ప్రకారం కూడా మేము పెద్ద ఎత్తున సుమారుగా 5% ఉన్నామని, మా జనాభాను పరిగణలోకి తీసుకొని మా వడ్డెర కులానికి తెలంగాణా లో గవర్నర్ కోటాలో ఒక మీజ ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వనికి మేము విజ్ఞప్తి చేస్తున్నం అని పేరుకొన్నారు. మాకోసం ఏ రాజకీయపార్టీ అవకాశాలు కల్పిస్తుందో ఆ రాజకీయ పార్టీ ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని పిట్ల శ్రీధర్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు శివ కుమార్, జాతీయ గౌరవ అధ్యక్షుడు రూపాని లోకనాథం, గ్రేటర్ అధ్యక్షుడు బోధసు రవి, జాతీయ ఉపాధ్యక్షులు పిట్ల గోపాల్, తిరుపతి శ్రీనివాస్ రావు, మల్లె కృష్ణ, కార్మిక విభాగం అధ్యక్షులు పల్లపు సత్య నారాయణ, గుంజ రమేష్ బాబు, చెల్లా సాంబయ్య తదితరులు మాట్లాడటం జరిగింది. అదేవిధంగా జాతీయ నాయకులు జేరిపాటి రాజు, పల్లపు రమేష్, కొడగంటి కృష్ణ, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు మక్కల ధనలక్ష్మి, దండుగుల శేఖర్, వల్లెపు గణేష్,ఉప్పుటేళ్ల దయాకర్, తన్నీరు చలపతి, పాంచన్ సీను, గుంజ ఆంజనేయులు, గోగుల రమేష్, సల్లంగుల శ్రీశైలం, వల్లెపు గిరీష్, మల్లె లక్ష్మి నారాయణ, వేముల నాగరాజు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

● జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బోయ శ్రీనివాసులు



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నా రు. నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావే శంలో ఆయన మాట్లాడు తూ డిసెంబర్ 12న నిర్వహించనున్న నాలుగోవ జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల జిల్లా అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచిం చారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న నిర్వహిం చిన జాతీయ లోక్ఆదా లత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,552 కేసులను పరిష్కరించి,నారాయణ పేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 23వ ర్యాంకు సాధించింద ని తెలిపారు. ఈ విజయా నికి కృషి చేసిన న్యాయ మూర్తులు, పోలీసు అధికారులు, సంబంధిత సిబ్బందిని అభినందిం చారు. డిసెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియ బుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్-బెయి లబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్టీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించా రు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపా రు. ఈ సమావేశంలో కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ప్రియాంక, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ . వినీత్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కం సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను చట్టపరిధిలో పరిష్కరించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నిరసన శిబిరంలో ఆందోళన చేస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, హక్కుల సాధనకు తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు క్యాబినెట్ ఆమోదంతో జీవో తీసుకొచ్చే ప్రయత్నం జరిగిందని తెలిపారు. అయితే, కాంగ్రెస్ నాయకులు కోర్టును ఆశ్రయించి ఆ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించిందని పేర్కొన్నారు.

### కేసీఆర్ హయాంలో సమాన పనికి సమాన వేతనం

కేసీఆర్ ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల గౌరవ వేతనాలను పెంచి వారి ఆత్మగౌరవాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించిందని నిరంజన్‌రెడ్డి అన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించే దిశగా గతంలో తాను న్యాయవాదిగా కాంట్రాక్ట్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడినట్లు గుర్తుచేశారు. ఉద్యోగుల డిమాండ్లలోని న్యాయబద్ధతను అధ్యయనం చేసి, సంబంధిత అంశాలను ప్రభుత్వానికి వివరించాలని సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అంశంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి, చట్టపరిధిలో సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల డిమాండ్లపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించి, ఉద్యోగుల హక్కుల సాధనకు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.

### మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ఎన్హెచ్ఎం ఉద్యోగులు నిరసన కొనసాగిస్తున్న శిబిరం వద్ద అపరిశుభ్రత నెలకొనడం, మహిళా ఉద్యోగులకు కనీస సౌకర్యాలు లేకపోవడాన్ని నిరంజన్‌రెడ్డి గమనించారు. వెంటనే



మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి నిరసన శిబిరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మహిళా ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిరసన తెలుపుతున్న ఉద్యోగులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, చంద్రశేఖర్ నాయక్, గంధం పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సునీల్ వాల్మీకి, మంద రాము, సయ్యద్ జమీల్, కుమార్, ముద్దసార్, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఏర్పాటు



**వనపర్తి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా వనపర్తి జిల్లా పూర్తిస్థాయి నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రాకాసి అరవింద్ రెడ్డి ప్రకటించారు. వనపర్తిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, రాష్ట్ర సీనియర్ నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మున్నూరు రవీందర్, సబి రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి తదితర నాయకుల సమక్షంలో కమిటీని వెల్లడించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్వర్, రాకేష్ రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, జంబులయ్యలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా ఓం ప్రకాష్ చారి, విటల్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కార్యదర్శులుగా ఈదమ్మ, అశోక్ రెడ్డి, యాదగిరి, నరసింహనాయుడులను నియమించారు. జిల్లా అధికార ప్రతినిధిగా ఏర్పుల తిరుపతయ్యతో పాటు నాగేశ్వరరావు, వెంకటాచలం, వెంకటేష్, రాజు, లక్ష్మీనారాయణ, లొడుగు శివ తదితరులను ముఖ్య నాయకులుగా నియమించారు.

### మండల అధ్యక్షుల నియామకం

శ్రీరంగాపురం మండల అధ్యక్షుడిగా శివయ్య, పెద్దమందడి మండల అధ్యక్షుడిగా రవీందర్, రేవల్లి మండల అధ్యక్షుడిగా జగదీశ్వర్ రెడ్డి, ఏదుల మండల అధ్యక్షుడిగా లింగం, వనపర్తి మండల అధ్యక్షుడిగా రాములు, ఖిల్లా ఘనపూర్ మండల అధ్యక్షుడిగా మాసయ్యలను ప్రకటించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రభుత్వ దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షురాలు అనుజ్ఞా రెడ్డి, రాష్ట్ర వాణిజ్య సెల్ కన్వీనర్ బాశెట్టి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, కల్పన, సీనియర్ నాయకుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మనివర్ధన్ సాగర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్, దళిత మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ కుమార్, గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన జిల్లా నాయకులు, కోర్ కమిటీ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మక్తల్ - నారాయణపేట నాలుగు లైన్ల రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి

● మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్
● కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర
● శంకుస్థాపనలకే పరిమితమైన రూ.237 కోట్ల అభివృద్ధి పనులు
● గుంతలమయంగా మారిన రోడ్డుతో ప్రజల తీవ్ర అవస్థలు




**మక్తల్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** మక్తల్ - నారాయణపేట మధ్య నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి పలుమార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రూ.237 కోట్లతో చేపట్టాల్సిన ఈ రహదారి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి, ప్రజల ప్రయాణ కష్టాలను తీర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ?ఈ మేరకు శనివారం మక్తల్ పట్టణంలోని నారాయణపేట చౌరస్తా నుండి నారాయణపేట జిల్లా కలెక్టరేట్ వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర ముగిసినంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

### ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం

మక్తల్ నుండి నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఈ రహదారే ప్రధాన మార్గంగా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యంగా ప్రమాద బాధితులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు కూడా ఇదే రోడ్డుపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే, ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రయాణించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా ప్రయాణ సమయం విపరీతంగా పెరగడమే కాకుండా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహగౌడ్, టౌన్ అధ్యక్షుడు చిన్న హనుమంతు, జుబేర్ పాషా, సర్పంచులు గాల్రెడ్డి, రవితేజ, శ్రావణ్, మాగనూరు మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, అన్వర్, హుస్సేన్, పారేవుల అసిరెడ్డి, వెంకటేష్, రుద్రసముద్రం రామలింగం, శివారెడ్డి, ఈశ్వర్ యాదవ్, జుట్ల సాగర్, నరసింహారెడ్డి, బండారి ఆనంద్, బసంత్ రెడ్డి, అశోక్ గౌడ్, నరసింహులు, జుట్ల శంకర్, మొగులప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● అల్లాదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుచరిత



**పెద్దశంకరంపేట్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అల్లాదుర్గం సివిల్ జడ్జి సుచరిత అన్నారు.. శనివారం పెద్ద శంకరంపేట లోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు వ్యవసాయానికి సంబంధించిన పలు చట్టాల పైన అవగాహన కల్పించారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన వివరాలపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి సంబంధిత రికార్డులను పరిశీలించు కోవాలని పేర్కొన్నారు. వృద్ధుల పట్ల తమ పిల్లలు బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. వారికి కావలసిన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి.. సిబ్బంది.. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● పేటలో బిజెవైఎం రాస్తారోకో



**నారాయణపేట, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బి కే వై ఎం నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో భరత్ కుమార్ అధ్యక్షతన యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలను హామలు చెయ్యడం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ నారాయణ పేట జిల్లా కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సాక్షిగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాస్తా రోకో చేసి నిరుద్యోగుల తరుపున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ పాల్గొని నిరుద్యోగుల తరు పున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు ఈ రాష్ట్ర నిరుద్యుగులందరికీ ఇచ్చిన హామీలలో భాగంగా నిరుద్యోగ భృతి,రాజీవ్ యువ వికాసం పథకం కానీ ఇతర హామీలను వెంబడే అమలు చేయాలని లేని డిమాండ్ చేశారు. లేకపోతే యువత పక్షాన రాబోవు రోజులలో బి జె వై ఎం ఏ ఉద్యమం చేసిన బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తుంది అని అన్నారు. వెంబడే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమం మరింత ఉధృతం దాల్చక ముందే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు ఎం. భరత్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన బి జె వై ఎం చేస్తున్న ప్రధాన డిమాండ్లను రాష్ట్ర ప్రభు త్వం ముందు ఉంచారు. 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వా లని, నిరుద్యోగులకు ఇస్తామన్న 4వేల రూ ల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథ కాన్ని అమలు చేయాలని ఈ హామీలను వెంబడే అమలు చేయాలని లేని యెడల జిల్లా వ్యాప్తంగా యువ మోర్చ కార్యకర్తలు ఉద్యమాన్ని మరింత ఉధృ తం చేస్తూ ముందుకు తీసు కెళతారని ప్రభుత్వాన్నీ హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో బి జె వై ఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రకాష్, మంజునాథ్ ,యువ మోర్చ జిల్లా పదాదికారులు వివిధ మండలాలకు చెందిన యువ మోర్చ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

● చదరంగ పోటీల నిర్వాహకుడు ధర్మచందర్



**రేగోడు, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలంగాణ నాన్ గెజిటెడ్ యూనియన్ (టీఎన్జీఓ) అల్లాదుర్గ్ యూనిట్ అధ్యక్షుడు ధర్మచందర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ధర్మచందర్ ఆధ్వర్యంలో రేగోడు రైతు వేదికలో చదరంగ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, మానసిక వికాసానికి దోహదపడే చదరంగ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం రేవుడ్ గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాసటి సుభాష్ ధర్మచంద్రుని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## ఆలయంలోకి వెళ్లిన దళిత కుటుంబాన్ని అవమానించడం దారుణం

● కుల వివక్ష రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం..
● ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించి
● బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
● బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు



**వనపర్తి రూరల్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో పురాతన ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్లిన దళిత యువకుడు సుధీర్, ఆయన భార్య, కుమార్తెను అవమానించడాన్ని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆలయంలోకి ఎందుకు వచ్చారంటూ సుధీర్ కుటుంబాన్ని ప్రశ్నించి అవమానించినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతోందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వనపర్తి పట్టణ మైనార్టీ అధ్యక్షుడు జోయెబ్ హుస్సేన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్ ఖాన్, ఎన్నికల విశ్లేషకుడు జమీలుల్లా ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ అక్రమ్ తదితర మైనార్టీ నాయకులు ఒక ప్రకటనలో స్పందించారు. మంగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు సుధీర్ కుటుంబాన్ని ఆలయంలోకి ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించి అవమానించినట్లు ఆరోపణలు ఉన్నాయని వారు తెలిపారు. ఒక దళిత కుటుంబం ఆలయాన్ని దర్శించుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. దేవాలయాలు అన్ని వర్గాల ప్రజల విశ్వాసానికి ప్రతీకలని, అక్కడ కులం పేరుతో వివక్ష చూపడం అన్యాయమని పేర్కొన్నారు.

### ఒకే గ్రామంలో కుల వివక్ష ఎందుకు..?

గ్రామాల్లో అన్ని కులాల ప్రజలు కలిసి జీవిస్తున్నారని, ఒకే గాలి పీలుస్తూ, ఒకే నీరు తాగుతూ, ఒకే ఆహారం తీసుకుంటున్నామని నాయకులు పేర్కొన్నారు. అలాంటప్పుడు దళితుల పట్ల వివక్ష చూపడం ఎందుకని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కులం ఆధారంగా అవమానించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు రావడం ఆందోళనకరమని, ఇక మారుమూల గ్రామాల్లో దళితుల పరిస్థితి ఎలా ఉంటుందోనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలాంటి ఘటనలను తీవ్రంగా పరిగణించి కుల వివక్షకు తావులేకుండా చూడాలని కోరారు.

### జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకోవాలి

ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రకటనపై మాజీ కౌన్సిలర్లు రహీం, సమద్, మాజీ జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, మైనార్టీ నాయకులు అస్లాం, జావిద్, ఆరిఫ్, అలీం, ఖాదర్‌షా, ఏకే పాషా, ఫజల్, చిన్నుమయ్య, మహబూబ్, ముద్దసార్, ఇంతియాజ్, ఖయ్యాం, ఖలీల్ (ఆప్టికల్), ఖాజా నసీంఖాన్, ఖలీల్ (పాతకోట), ఎండీ వహీద్, ఖాదర్ తదితరులు సంతకాలు చేసినట్లు తెలిపారు.

## హమాలీ కార్మికుల హక్కుల సాధనకు బీఎంఎస్ కృషి

● లేబర్ కార్డులు, సంక్షేమ పథకాలపై కార్మికులకు అవగాహన



**వనపర్తి, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు, వారికి న్యాయంగా అందాల్సిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కల్పించేందుకు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కృషి చేస్తుందని సంఘం నాయకులు తెలిపారు. వనపర్తి జిల్లాలో బీఎంఎస్ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలపై చర్చించారు. హమాలీ కార్మికులందరూ లేబర్ కార్డులు నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాద బీమా, ఆరోగ్య భద్రతతో పాటు కార్మికులకు ప్రభుత్వం అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటూ తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. బీఎంఎస్ వర్ధిల్లాలి.. హమాలీ కార్మికుల హక్కులు సాధించాలి" అంటూ నినాదాలు చేశారు.

## సరస్వతీ మాతగా శ్రీ భద్రకాళి అమ్మవారు



- అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 17 (జనం సాక్షి)** : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఏడవ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించడానికి అంగీకార ప్రార్ధన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారిని సరస్వతీమాత గా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించడానికి ఉదయం నుండి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. శనివారం అమ్మవారికి రథసేవ జరిపారు. అమ్మవారిని తెలంగాణా రాష్ట్ర ఐ.టి శాఖామాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు సందర్శించారు. మంత్రివెంట వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు మరియు డి.సి.సి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసి ప్రముఖులకు ఆలయ ఈఓ రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవరాత్ర విశేష పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మహాదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు వారి బంధుమిత్రులు దేవాలయములో నూతనముగా కోటిరూపాయల వ్యయముతో తయారు చేయించినటువంటి 27 ఫీట్ల ఎత్తుగల లిరధమునులి మంత్రి ఆధ్వర్యంలో దేవాలయమునకు స్వాధీనపరచుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డా॥ శివసుబ్రహ్మణ్యం. ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి. చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావులు మాజీ ధర్మకర్తలు శ్రీ జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, గాండ్ల స్రవంతి. పాలడుగుల అంజనేయులు తదితరులున్నారు. అట్లాగే అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో మాజీ ఎం.ఎల్.సి జోగినపల్లి సంతోష్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎం.ఎల్.ఏ దాస్యం వినయభాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె. వాసుదేవ రెడ్డి తదితరులున్నారు.

## పంటల ధ్వంసాన్ని ఆపాలి

- పరిహారం చెల్లించాకే భూములు స్వాధీనం చేసుకోవాలి: రైతు సంఘాల డిమాండ్
- గంగాదేవిపల్లి శివారులో పంట పొలాల పరిశీలన



**గీసుకొండ, అక్టోబర్ 17, (జనం సాక్షి)** : నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల పంట పొలాలను ధ్వంసం చేయడం అన్యాయమని ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అన్నారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న గంగాదేవిపల్లి శివారులో పంట నష్టపోతున్న రైతుల పొలాలను వారు సందర్శించారు. రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పంటలను ధ్వంసం చేసేందుకు జాతీయ రహదారి, రెవెన్యూ అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా వేర్వేరు పరిహారాలు నిర్ణయించడం రైతులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు డిమాండ్ ఉండటంతో ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు పంట నష్టపరిహారం ఇస్తామని అధికారులు చెబుతున్నారని, పంట దిగుబడి ద్వారా ఎకరాకు సుమారు రూ.1.30 లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఖరీఫ్ పంటలు పూర్తయ్యే వరకు భూములను స్వాధీనం చేసుకోవద్దని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సోమిడి సాంబయ్య, సిర్ల రవీందర్, బాధిత రైతులు పెండ్లి చిన్న మల్లారెడ్డి, పెండ్లి సరోజన, రమేష్, ఎరుకల రమేష్, ప్రవీణ్, విమల పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా
- రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పని తీరు, రిసెప్షన్, వివిధ విభాగాలు, సీసీటీఎన్ఎస్ (సీసీటీన్స్), ఆన్‌లైన్ సాంకేతిక వ్యవస్థల నిర్వహణను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి, వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. రెబ్బెన మండల శాంతిభద్రతల పరిస్థితులు, స్థానిక సమస్యలు, నమోదైన కేసుల వివరాలను ఎస్ఐ అడిగి తెలుసుకున్నారు. గ్రామ పోలీస్ అధికారులు (విపీఓ)తో మాట్లాడి, తమ పరిధిలోని గ్రామాల పరిస్థితులను సమీక్షించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, ఫిర్యాదులపై తక్షణమే స్పందించి మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పురోగతిని సమీక్షించారు. రెబ్బెన పరిధిలో జాతీయ రహదారి ఉన్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలని, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్ఐ ఏ. వెంకటకృష్ణకు సూచించారు.

# భూపాలపల్లి అభివృద్ధికి రూ.93 కోట్లు!

- రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలి..
- రూ.70 కోట్లతో రోడ్ల విస్తరణ..
- అంబేద్కర్ కూడలి ఆధునీకీకరణ..
- గద్దర్ జంక్షన్ ఏర్పాటుపై ప్రతిపాదన..
- చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు..
- పది రోజుల్లో పనులు ప్రారంభించాలి..
- అధికారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాలు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పెరుగుతున్న జనాభా.. భారీ వాహనాల రద్దీ.. తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు.. ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారులు.. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భూపాలపల్లి పట్టణంలో రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. పట్టణ అభివృద్ధికి రూ.70 కోట్లతో రోడ్ల విస్తరణ, అమృత్ పథకం కింద రూ.23 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరైన నేపథ్యంలో పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి శనివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి అభివృద్ధి నమూనాను పరిశీలించిన ఎమ్మెల్యే.. పలు ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంబేద్కర్ కూడలి నుంచి బస్టాండ్ వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి సింగరేణి గ్రౌండ్ మీదుగా కృష్ణ కాలనీ వరకు, ఓసీ-2 మార్గంలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. పట్టణంలో బొగ్గు, బూడిద, ఇసుక లారీలతో పాటు ఇతర భారీ వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయని, దీంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో పరిమిత జనాభాతో ఉన్న పట్టణం ప్రస్తుతం వేగంగా విస్తరిస్తోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులు, మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రోడ్ల విస్తరణ అత్యవసరమని స్పష్టం చేశారు. రోడ్ల విస్తరణకు మంజూరైన రూ.70 కోట్లను సమర్థవంతంగా వినియోగిస్తూ పనులను వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అమృత్ పథకం కింద మంజూరైన రూ.23 కోట్లతో పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని తెలిపారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి సింగరేణి గ్రౌండ్, కృష్ణ కాలనీ వరకు, ఓసీ-2 వైపు రహదారుల విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి వారం సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు.

సింగరేణి ప్రాంతంలో 1988లోనే 200 అడుగుల రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. ఓసీ-1, ఫైన్ క్లేన్ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారులను విస్తరించాలని సూచించారు. కన్నం రాజయ్య ఇంటికి సంబంధించిన భూసేకరణ అంశం మినహా మిగతా ప్రాంతాల్లో ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. సదరు ఇంటి విషయంలో హైకోర్టు తీర్పు మేరకు అవసరమైన మొత్తాన్ని డిపాజిట్ చేసి, పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### అంబేద్కర్ కూడలికి కొత్త రూపు.. గద్దర్ జంక్షన్ ప్రతిపాదన..

భూపాలపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో భాగంగా అంబేద్కర్ కూడలిని ఆధునిక ఆర్కిటెక్చర్, ఆకర్షణీయమైన ఫౌంటెన్‌తో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమీపంలోని జంక్షన్‌లో ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ ప్రాంతానికి గద్దర్ జంక్షన్‌గా నామకరణం చేసే ప్రతిపాదనను పరిశీలించారు. హనుమాన్ జంక్షన్, రాజీవ్ జంక్షన్, జయశంకర్ జంక్షన్, ఫైన్ క్లేన్ జంక్షన్, మంజూరునగర్ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. రోడ్ల విస్తరణలో భాగంగా చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభావితమయ్యే వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా రోడ్డు సరిహద్దుల్లో తగిన స్థలాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిర్మాణ పనులను రాబోయే పది రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల కారణంగా జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

### శాఖల మధ్య సమన్వయంతో పనులు: కలెక్టర్

రోడ్ల విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్ల మార్పునకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సింగరేణి, విద్యుత్ శాఖ, జెన్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ శాఖల అధికారులు తక్షణమే అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. రోడ్ల అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి షార్ట్ టెండర్ల ద్వారా పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, సింగరేణి, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

- 3 ఏండ్లలో తెలంగాణకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నా... ఇన్‌చార్జ్ పెత్తనం
- గ్రాడ్యుయేట్ ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పని చేయాలి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 17 (జనం సాక్షి)** :ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అధ్యక్షతన బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమ ముఖ్య అతిథి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి వారి చుట్టుపక్కల ఉన్న పట్టభద్రులను గుర్తించాలని, వారి ఓటు నమోదు అయ్యేలా చూడాలని సూచించారు. పట్టభద్రులతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వారిని ఓటర్లుగా నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీకి గుండెకాయ లాంటిదని పేర్కొంటూ, ఇక్కడి నుంచి ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఇక రాజకీయాల విషయానికి వస్తే... 3 ఏండ్లలో తెలంగాణకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని అన్నారు. ఇక్కడ పొంగులేటి కాంట్రాక్టులు వచ్చే వాటి గురించి రివ్యూ పెడతారు తప్ప, ప్రజా సమస్యల పరిష్కారానికి రివ్యూ ఉండదని విమర్శించారు. ఓరుగల్లుకు చెందిన మంత్రులు ఉన్నా... ఇన్‌చార్జ్ మంత్రి పెత్తనం నడుస్తోందని తప్పుబట్టారు. స్వయంగా ఎంపీ ఎన్నికల సమయంలో హనుమకొండ చౌరస్తాకు వచ్చి రెండు హామీలు ఇస్తే వాటిపై సమాధానం ఇవ్వాలని మండలిలో అడిగితే మంత్రులే తమకు తెలియదని చెప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... ప్రజలకు ఏ కష్టం వచ్చిన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని స్పష్టం చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం ఇప్పటికే పార్టీ తరపున డివిజన్ల వారీగా హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్స్ ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ సైతం రూపొందించామని, ఆ దిశగా పని చేస్తామని అన్నారు. కాగా పార్టీ ఆదేశాల మేరకు ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఓటరు నమోదును పెద్ద ఎత్తున చేపట్టామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.

## అందని నీరు...ఎండిన పైరు...

- వార బంద్ నీరు...విద్యుత్ కొరత జోరు...
- పంటలు ఎండి ఆందోళన చెందుతున్న రైతన్నలు...



**కడెం, అక్టోబర్ 17 (జనం సాక్షి)** : రైతు లేనిదే రాజ్యం లేదు రైతే దేశానికి వెన్నుముక. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరకు వస్తే మాత్రం శూన్యం.మరి అదే రైతు ఆరుగాలం కష్టపడి పంట పండించి దేశానికి అన్నం పెట్టాలి. కానీ అలాంటి రైతుకు వ్యవసాయం చేద్దామంటే బ్యాంకు రుణాలు, సరైన నీరు, సమయానికి విద్యుత్తు, ఎరువులు అందక ఎంతోమంది రైతులు అప్పుల్లో కూడుకుపోయి ఆత్మ హత్య బలిదానాలు చేసుకున్న రోజులు ఎన్నో ఉన్నాయి. అలాగే సదర్ మాట్ ఆయకట్టను నమ్ముకొని ఆయకట్టు కింద ఉన్న రైతులు దాదాపు 17 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. రైతులకు అది సకాలంలో నీరు అంది పంట పండి గిట్టుబాటు ధరతో ఓవరంగ మారిన వేళలు ఎన్నో ఉన్నాయి. కానీ ప్రస్తుతం అధికారులు వార బందు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు చివరివరకు నీరందక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఇది ఇలా ఉండగా మరోవైపు నాణ్యమైన విద్యుత్ అందక, విద్యుత్ కొరత ఏర్పడడంతో నీరందించే బావి మోటార్లు, ట్రాన్స్ఫర్ లు కూడా దెబ్బతిని కాలిపోవడం జరుగుతుందని రైతులు అన్నారు. వార బందు నీరు.. విద్యుత్ కొరత జోరు.. అంటూ ఇదంతా కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతుందని అధికారుల నాయకుల తీరుపై పలువు రైతులు మండి పడుతున్నారు. ఈ సందర్భంగా మీడియాతో సదర్ మార్ట్ కాలువ సాధన సమితి అధ్యక్షులు అపావత్ రాజేందర్ మాట్లాడుతూ... సదర్ మార్ట్ ఆయకట్టు నుండి వార బందు నీరు విడుదల చేయడంతో చివరి ఆయకట్టు వరకు పంట పొలాలకు నిరంతక వరి పైరు ఎండిపోతుందని రైతులు అనేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయకట్టు నుండి నీరు విడుదలైన మూడు రోజుల వరకు చివరి వరకు నీరు అందడం లేదని, మరో మూడు రోజులు నీరు పైనున్న రైతులకి సరిపోకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందక వరి పైరు పంట పొలాలు పగులు చూపి ఎండిపోతుందని అన్నారు. ఈ విషయంపై ఉన్నత అధికారులు ప్రజా ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ అధికారులు స్పందించి, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు, సకాలంలో విద్యుత్ కొరతలు లేకుండా సరైన నాణ్యమైన విద్యుత్తు అందించి రైతులకు ఆరుగాలం కష్టపడి పండిస్తున్న పంటకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆయకట్టు రైతాంగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులందరం కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఖైదీలకు న్యాయ సహాయం అందేలా చూడాలి

**ఖిలా వరంగల్ అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మామునూరు ఓపెన్ ఎయిర్ జైలు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మామునూరు ఓపెన్ ఎయిర్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించిన ఆమె, ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి కేసుల స్థితిగతులు, న్యాయపరమైన సమస్యలు, అవసర మైన న్యాయ సహాయం గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జైలర్ జలేందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



## 11 కేవీ విద్యుత్ వైరు తగిలి మేస్త్రి మృతి



**దేవరుప్పుల, అక్టోబర్ 17 (జనం సాక్షి)** దేవరుప్పుల మండలం సీతా రాంపురం గ్రామానికి చెందిన మాను పాటి కిష్టయ్య (47) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పెండెం భాస్కర్ ఇంటి వద్ద మేస్త్రి పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి కుమారుడు మానుపాటి నితిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని నితిన్ దరఖాస్తులో పేర్కొన్నాడు.

## ఆరుగురికి కారుణ్య నియామక పత్రాలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17(జనంసాక్షి) :** కారుణ్య నియామకం క్రింద జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో ఆరుగురికి నియామక పత్రాలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ లతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులుగా పనిచేసి వివిధ కారణాల వలన మరణించిన వారి స్థానములో వారి కుటుంబ సభ్యులలో ఒకరిని కారుణ్య నియామకం క్రింద నియమించామని తెలిపారు. ముగ్గురిని వివిధ శాఖలలో జూనియర్ అసిస్టెంట్లుగా, మరో ముగ్గురిని వివిధ శాఖలలో కార్యాలయ సబార్డినేట్ లుగా నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉప పాలనధికారి జాస్టిన్ జోయల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, కారుణ్య నియామక అభ్యర్థులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు అంతా సిద్ధం

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** మండలంలోని పల్లె,పల్లెనా పండగ కళ సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది. నేడు సద్దుల బతుకమ్మ సందర్భంగా పల్లెల్లో మరింత సందడి కనిపిస్తోంది. మేజర్ గ్రామపంచాయతీలలో బతుకమ్మకు అవసరమైన పూలు అమ్మకానికి ఉండగా కొనుగోలు చేయడానికి మహిళలు, గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా ఖరీదు చేస్తున్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు విస్తృత చర్యలు

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం, విక్రయాలను అరికట్టడానికి పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్, వైద్య-ఆరోగ్య, విద్య శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ (ఓజూ=ఐ) కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా జిల్లాలోని పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో చదువులో వెనుకబడి, భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. మత్తు కోసం డబ్బుకోసం నేరాలకు, దొంగతనాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, కుటుంబాల్లో గొడవలు, మానసిక ఒత్తిడి, బంధాలు దెబ్బతింటాయని అన్నారు. మంచి సమాజం కొరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 55 గంజాయి/డ్రగ్స్ కేసులు నమోదు చేయగా, 137 మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు మార్గాలు, జిల్లాలోని అంతర్రాష్ట్ర రవాణా మార్గాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కేసులలో మూలాలు, సరఫరాదారులు, కొనుగోలుదారులను



పూర్తి స్థాయిలో గుర్తించి, ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల వద్ద ప్రత్యేక పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. స్కూల్స్ వద్ద చాక్లెట్ల అమ్మకాలపై నిఘా పెట్టాలని, తరచు దాడులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇప్పటివరకు 57 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ-డ్రగ్ క్లబ్‌ల ఏర్పాటు, నిర్వహణను నిర్బంధం చేయాలన్నారు. కళాశాలల నుండి హై స్కూల్ ల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరావాసం కల్పించేందుకు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక డీ-అడిక్షన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్డ్ మత్తు బిళ్ళలు, ప్రిస్క్రిప్షన్ మందులు విక్రయించే మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు, తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కి సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం. ఫిరంగి, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు దేవేందర్ రెడ్డి, అనిల్, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి. వీరన్న, పోలీస్ ఇన్స్పెక్టర్ వి. విజయ రాంకుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- **బీఆర్ఎస్ గద్వాల ఇన్‌చార్జ్ బాసు హనుమంతు డిమాండ్**



**గద్వాల, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గద్వాల పట్టణంలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన హాజరై, పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల వేతనాలు తగ్గించడం, విధుల్లోంచి తొలగించడం వంటి చర్యలు సరికాదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గారు ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షించి పీఆర్సీ అమలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులను రోడ్డున పడేసేలా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని, ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు.

## పోలీస్ ఉత్తమ సేవా పతకం అందుకున్న ఏఎస్పీ రవీందర్ రెడ్డి

- **డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా పతకం అందజేత**
- **అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పీ కె.నరసింహ**

**సూర్యాపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు 2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి పోలీసు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ డీజీపీ కార్యాలయంలో రవీందర్ రెడ్డికి పతకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డిని అభినందించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు విలువైన సేవలు అందించారని, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కృషి అభినందనీయమని కొనియాడారు.

### సుదీర్ఘ పోలీసు సేవలకు గుర్తింపు

అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి 1992 సంవత్సరంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో నియామకమై, పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో తొలి పోస్టింగ్‌లో విధులు నిర్వహించారు. అనంతరం 2007లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఎస్ఐ, సీఐ హోదాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం సీఐడీ విభాగంలో



విధులు నిర్వహించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది వికారాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ డీసీపీగా, నిజామాబాద్‌లో, సికింద్రాబాద్ రైల్వే విభాగంలోనూ వివిధ హోదాల్లో సేవలందించారు. పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనకు పోలీసు ఉత్తమ సేవా పతకం లభించడం పట్ల సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ హర్షం వ్యక్తం చేసింది. పోలీసు శాఖకు గౌరవం తీసుకొచ్చిన అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి జిల్లా ఎస్పీ కె. నరసింహ, పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ ఆడపడుచులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, సోదరభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం మన సంస్కృతిలోని గొప్పతనాన్ని చాటిచెబుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో బతుకమ్మ పండుగ విశేషమైన గుర్తింపును పొందిందని తెలిపారు. బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీక అని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై



ఉందని ఆయన అన్నారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించడంతో పాటు కుటుంబాల మధ్య అనుబంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని, తెలంగాణ మహిళలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## వ్యవసాయ విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

- **పోలీస్ అదుపులో ఏడుగురు నిందితులు**
- **నలుగురు రిమాండ్**
- **రూ.2,80,000 విలువచేసే మోటార్లు,కేబుల్ వైర్లు స్వాధీనం**



**పెనుబల్లి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** వ్యవసాయ విద్యుత్ మోటార్లను, సర్వీస్ వైర్లను దొంగిలిస్తూ రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు వి ఎం బంజర్ ఎస్ ఐ షాకీర్ శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తెలిపారు. పెనుబల్లి మండలంలో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, కేబుల్ వైర్ల దొంగతనాలకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఈ క్రమంలో మొత్తం ఐదు కేసులు నమోదు చేసి, దర్యాప్తు ద్వారా ఏడుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు వివరించారు. గణేష్ పాడు గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్, కళ్ళం జగన్, రావూరి నాగేశ్వరావు. తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నాగరాజు,పాత కారాయిగూడెం గ్రామానికి చెందిన ఎస్.కె రఫీ, ముత్తగూడెం గ్రామానికి చెందిన రావూరు సల్మాన్, పెనుబల్లి గ్రామానికి చెందిన రావూరి లక్ష్మణరావు లను అరెస్టు చేసి నలుగురిని రిమాండింగ్ తరలించినట్టు తెలిపారు. వీరి వద్ద నుండి రూ. 2,80,000లు విలువ చేసే 7విద్యుత్ మోటార్లు, 200 మీటర్ల కేబుల్ వైర్లు, 1 మోటార్ బాక్స్ ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు,ఇతర సామాగ్రిని దొంగిలించిన వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షాకీర్ హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఏసీపి వసుంధర యాదవ్, సిఐ సర్వయ్య, ఎస్ ఐ షాకీర్ లను సిపి అభినందించారు.

## స్వీయ గణనపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- **రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి**



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** జనాభా గణనలో స్వీయ గణన విధానం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి, సమయాన్ని ఆదా చేయడంతోపాటు కచ్చితమైన వివరాలను సేకరించాలని రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళీ కేరి సూచించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జనాభా గణన రెండో దశపై ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జనాభా గణన మొదటి దశలో గృహాల జాబితా, గృహాల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్యకు సంబంధించిన సమాచారాన్ని సేకరించినట్లు తెలిపారు. రెండో దశలో ప్రతి వ్యక్తికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా జనాభాను దృష్టిలో ఉంచుకొని, నిర్ణీత గడువులో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

### క్షేత్రస్థాయి పరిశీలనతో కచ్చితమైన వివరాలు

గతంలో నిర్వహించిన గృహాల జాబితా తయారీ కార్యక్రమంలో సేకరించిన వివరాలను ఆధారంగా తీసుకొని, ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని భారతి హోళీ కేరి సూచించారు. జనాభా పెరుగుదల, కొత్త నిర్మాణాలు, వలసలు, గుర్తింపునకు నోచుకోని నివాసాలు, సంస్థాగత గృహాలు, ఖాళీ ఇళ్లు తదితర అంశాలను పరిశీలించి, నిర్దేశిత నమూనాలో వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఇళ్లు లేని వ్యక్తులతో సహా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జనాభా గణనలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళికాధికారి గీత, ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు, మాస్టర్ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురం అభివృద్ధే ధ్యేయం

- **ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి**



**మాడుగులపల్లి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పంపిణీని ఘనంగా ప్రారంభించారు. ముందుగా గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సంభవన సంఘం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు అనంతరం రూ. 20 లక్షల వ్యయంతో పూర్తి చేసిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సర్వాంగీణ వికాసానికి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు అదేవిధంగా పలువురు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లె శిరీష లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండేటి మల్లయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వద్దే సైదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి, సర్పంచులు బెల్లి జానయ్య, కొత్త దశరథ, గంనిపెల్లి మోహన్, అనిల్ రెడ్డి, మారపల్లి లక్ష్మి,తహాశీల్దార్ సరోజ పావని, ఎంపీడీవో వంశీధర్, డిప్యూటీ తహాశీల్దార్ కత్తుల సైదులు, ఏపీఎం మధుసూదన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్, పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, జిపివో సతీష్, సీసీలు సైదులు, సత్యనారాయణ, ఇతర అధికారులు, గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివిధ అభివృద్ధి పనులను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. శనివారం ఖమ్మం కాల్వొడ్డు వద్ద మున్నేరు నదిపై నిర్మాణంలో వున్న తీగల వంతెన పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో కలిసి ఆయా నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనుల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. కళాశాల ప్రహరీ గోడ, హాస్టల్ భవనాలు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులను సమాంతరంగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన పనుల విషయంలో అధికారులు



సమన్వయంతో వ్యవహరించి, ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చి ప్రభుత్వ వైద్య కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భవన నిర్మాణాలతో పాటు విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు తదితర మౌళిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌కు సంబంధించిన విద్యుత్ పనులను పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌తో పాటు మిగిలిన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. నవంబర్ చివరి నాటికి వైద్య కళాశాలకు సంబంధించిన అన్ని భవనాలను అవసరమైన వసతులతో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల హాస్టల్ నిర్మాణ తుది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. హాస్టల్‌లో అవసరమైన మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. తుది దశలో ఉన్న పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మున్నేరు నదిపై నిర్మిస్తున్న తీగల వంతెన పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వంతెనకు సంబంధించిన తుది దశ పనులన్నింటినీ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, వైద్య శాఖ అధికారులు, అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి కథనానికి తక్షణ స్పందన..

- **తొలగిన ప్రమాదం**
- **ఇసుకబావిగూడెంలో కరెంటు స్తంభాలను అల్లుకున్న చెట్లను తొలగించిన విద్యుత్ అధికారులు**
- **కథనం ప్రచురితమైన కొన్ని గంటల్లోనే రంగంలోకి దిగిన సిబ్బంది**
- **జనం సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



**మాడుగులపల్లి, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం, మాడుగులపల్లి మండలం ఇసుకబావిగూడెం గ్రామంలో కరెంటు స్తంభాలను చెట్లు అల్లుకుని ప్రమాదకరంగా మారిన పరిస్థితిపై జనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు. గ్రామంలో విద్యుత్ తీగలు, స్తంభాలకు చుట్టుముట్టిన చెట్ల కొమ్మల వల్ల ఎదురవుతున్న ప్రమాదాలను ఎత్తిచూపుతూ జనం సాక్షిలో వార్త రాగా, దానికి ఉన్నతాధికారులు వేగంగా స్పందించారు వార్త ప్రచురితమైన కొన్ని గంటల్లోనే విద్యుత్ శాఖ సిబ్బంది ఇసుకబావిగూడెం గ్రామానికి చేరుకుని, స్తంభాల చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలను, పొదలను నీటుగా తొలగించారు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా, గ్రామస్తులకు ప్రమాదం తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఏళ్లనుంచి ఉన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన జనం సాక్షి దినపత్రికకు, వార్తకు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజా పక్షాన నిలుస్తున్న జనం సాక్షి కథనాలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# అమ్మవారి సేవలో ప్రభుత్వ విప్ ‘ఆది’

### శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు..

### వేద పండితులకు సత్కారం

**గంభీరావుపేట, అక్టోబర్ 17 జనంసాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో శ్రీ మహాశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శృంగేరి పీఠానికి చెందిన వేద పండితులు రాధాకృష్ణ శర్మ స్వగృహంలో శ్రీ భారతి తీర్థానంద స్వామి, శారదా దేవి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా వేద పండితులను శాలువాలతో సత్కరించారు.లో కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ మహాశక్తి సేవా సమితి సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం**

లింగన్నపేట హరిహర దేవాలయంలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ జోగు సురేష్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి ఉత్సవాల కరపత్రాన్ని అందజేశారు. ఈ నెల 27న నిర్వహించనున్న రథోత్సవానికి హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కనవేని చక్రధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేశాల వెంకటి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండూరి గాంధీ, రాజనర్సింహారెడ్డి, హమీద్, రాజ్‌వీర్, తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

# తాగునీటి సమస్య తలెత్తొద్దు

- ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా వరిసాగు వద్దు
- దళారులను నమ్మి మోసపోవద్దు
- నీటి వనరులు వృధా కాకుండా గట్టి నిఘా కొనసాగించాలి
- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):**
ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా, పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా, రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు పద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎక్కడ కూడా నీటి వృధా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు.
ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరెన్సీ నోట్లతో కాళరాత్రిదేవి

- 7వ రోజు మహాశక్తి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ
- అమ్మవారిని దర్శించుకున్న కరీంనగర్ సెషన్స్ జడ్జి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు
- భక్తుల రాకతో కిటకిటలాడిన మహాశక్తి ఆలయం



**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 17 (జనంసాక్షి):**
దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శనివారం శ్రీ మహాశక్తి ఆలయంలో శ్రీ మహాలక్ష్మీ దేవి (కాళరాత్రి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీతో నిజ పాద దర్శన రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ మహాలక్ష్మీ దేవిని చూసిన భక్తులు పరవశించి పోయారు. వేలాది మంది భక్తుల రాకతో మహాశక్తి ఆలయం కిటకిట లాడుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉదయం నుండి సాయంత్రం వరకు పూజలు నిర్వహించ దంతోపాలు అమ్మవారి సేవలో తరించారు. ఆలయానికి వచ్చిన భక్తులను కలుసుకుంటూ వారితో ముచ్చటించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మీ సాహస్ర పారాయణం విన్పించారు. అనంతరం బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ పండితులు“శ్రీ భాగవత వైభవం” వివరిస్తూ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.శివకుమార్ ఉదయం శ్రీ మహాశక్తి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు మహాశక్తి ఆలయంలో దాండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. కాళరాత్రి దేవి ఆరాధన కేవలం ఆచారాలకు పరిమితం కాదు. మనలోని భయం, అహంకారం, చెడు ఆలోచనలను జయించి సత్యం, ధర్మం, న్యాయం వైపు నడవాలని ఈ అవతారం గుర్తుచేస్తుంది. కష్టాలను చూసి వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగాలనే స్ఫూర్తిని అందిస్తుంది. చీకటిని తొలగించి వెలుగును నింపే శక్తిగా, భయాన్ని తొలగించి అభయమిచ్చే తల్లిగా కాళరాత్రి దేవి భక్తుల పూజలందుకోవడం విశేషం.

### విద్యార్థినిపై దాడి ఘటన

# స్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు

**కరీంనగర్ ,క్రైమ్ అక్టోబర్ 17 (జనంసాక్షి) :**
కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైనార్టీ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రిన్సిపాల్ కొట్టినట్లు అందిన ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయడం జరిగింది.ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది. విచారణలో వెల్లడయ్యే వాస్తవాలు, సాక్ష్యాధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# మ్యాజిక్ అలాదిన్‌కు సన్మానం

### ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంద్రజాలికులను అభినందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**జ్యోతినగర్ కాలనీ,అక్టోబర్ 17 (జనంసాక్షి):**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్న ఇంద్రజాల కళాకారులను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులకు పూలమాలలు, శాలువాలు అందించి అభినందించారు.ఈ సందర్భంగా ఆర్జీ–2 ఏరియాలో భద్రతా విభాగంలో విధులు నిర్వహిస్తూనే మూడు దశాబ్దాలుగా ఇంద్రజాల రంగానికి విశేష సేవలందిస్తున్న మ్యాజిక్ ప్రిన్స్, ఇంద్రజాల ప్రజ్ఞా అవార్డు గ్రహీత, గోల్డ్ మెడలిస్ట్ మ్యాజిక్ అలాదిన్ (మహబూబ్ అలీ) ప్రత్యేకంగా సన్మానం అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే ఏడాది మూడు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతులు సాధించి హ్యాట్రిక్ నమోదు చేసిన ఆయన, ఇటీవల ఖమ్మం జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ఏపీఎంఏ 42వ మ్యాజిక్ కన్వెన్షన్ ‘మాయాబజార్–2’లో ప్రతిష్ఠాత్మక ‘జాదూ రత్న’ అవార్డుతో పాటు సన్మాన పత్రాన్ని అందుకున్నారు.

**పోటీల్లో కరీంనగర్ జిల్లా కళాకారుల ప్రతిభ**

‘మాయాబజార్–2’ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇంద్రజాల కళాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సూపర్ సీనియర్స్ విభాగంలో కరీంనగర్‌కు చెందిన జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రథమ బహుమతితో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. గోదావరిఖనికి చెందిన మ్యాజిక్ హరి సిల్వర్ మెడల్ అందుకున్నారు.సీనియర్స్ విభాగంలో జగిత్యాలకు చెందిన కె.ఎన్. చారి ప్రథమ స్థానం సాధించగా, ఆయన కుమారుడు అద్వైత్ జూనియర్స్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందారు. అలాగే గోదావరిఖనికి చెందిన మ్యాజిక్ రాజా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జాతీయ అవార్డును అందుకుని జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారు.

**మూఢనమ్మకాల నిర్మూలనలో ఇంద్రజాలికుల పాత్ర కీలకం**

ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను తొలగించడంలో ఇంద్రజాల కళాకారులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఇంద్రజాలం కేవలం వినోదానికే పరిమితం కాకుండా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విశిష్ట కళ అని అన్నారు. మూడు దశాబ్దాలుగా ఇంద్రజాల రంగానికి సేవలందిస్తూ ‘జాదూ రత్న’ అవార్డు సాధించిన మ్యాజిక్ అలాదిన్‌తో పాటు, వివిధ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాకారులు బహుమతులు సాధించడం గర్వకారణమని అభినందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్వాస నవీన్‌తో పాటు జితేందర్, రవీందర్, కాంతారావు, నగునూరు సర్పంచ్ మహేందర్, జిల్లా ఇంద్రజాల కళాకారులు పాల్గొని సన్మాన గ్రహీతలను అభినందించారు.



# మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారిగా మహమ్మద్ జలాలోద్దిన్ అక్బర్

**కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 17 ( జనంసాక్షి)**
:కరీంనగర్ జిల్లా రెవిన్యూ అధికారి నిర్వహిస్తున్న జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి నుండి ప్రభుత్వం నియమించిన శాశ్వత అధికారిగా మహమ్మద్ జలాలుద్దీన్ అక్టోబర్ 16న పూర్తి బాధ్యతలు స్వీకరించినారు. పూర్తి బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్, అదనపు కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగినదిఈ సందర్భముగా వారు మాట్లాడుతూ మైనారిటీస్ సంక్షేమ పథకాలను మైనారిటీస్ లకు చేరే విధంగా తెలంగాణ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలను సరైన లబ్దిదారులకు అందే విధంగా శాయ శక్తుల కృషి చేస్తానని తెలియపరిచారు



# మురికిగా ఉండే టాయిలెట్ ఫొటో పెడితే.. రూ.1000 రివార్డ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):జాతీయ రహదారుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో టాయిలెట్ల పరిశుభ్రతపైనా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. టోల్‌ప్లాజాల్లో అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్లను గుర్తించి, వాటి ఫొటోలను పంపేవారికి రూ.1000 బహుమతి పొందే అవకాశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ కల్పిస్తోంది. అక్టోబర్ 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఇటీవల ప్రకటించింది.జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాల్లో మురికిగా ఉండే టాయిలెట్లను గుర్తించేందుకు “క్లీన్ టాయిలెట్ పిక్చర్ ఛాలెంజ్” పేరుతో ఓ కార్యక్రమాన్ని ఎన్‌హెచ్‌ఏఐ ఇటీవల ప్రారంభించింది. అపరిశుభ్రంగా ఉండే మూత్రశాలలు కనిపిస్తే ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వాహనదారుడి పేరుతో పాటు లొకేషన్, వాహన రిజిస్ట్రేషన్ నంబర్, మొబైల్ నంబర్‌లను ఇవ్వాలి. ఇలాంటి సంఘటనను నివేదించే వారికి వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా ఫాస్టాగ్ రీఛార్జ్ రూపంలో రూ.1000 రివార్డుగా లభిస్తుంది. అయితే, ఇది కేవలం హైవే టోల్‌ప్లాజాల నిర్వహణలో ఉండే టాయిలెట్లకు మాత్రమే వర్తిస్తుందని, పెట్రోల్ బంకులు, దాబాలు, ఇతర ప్రదేశాలకు వర్తించదని ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది.



# ఆటో డ్రైవర్ నిజాయితీ

### పోగొట్టుకున్న బంగారం, నగదు బాధితులకు అప్పగించిన ఆవుదుర్తి బాబు

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 17 (జనంసాక్షి):**
నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు వావిలాలపల్లె ఆటో స్టాండ్ సభ్యుడు, ఆటో డ్రైవర్ ఆవుదుర్తి బాబు. ఆటోలో ప్రయాణికురాలు మరిచిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను భద్రంగా ఉంచి, అందులోని 8 గ్రాముల బంగారం, రూ.12,000 నగదును తిరిగి బాధితులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు.ఈ నెల 15వ తేదీ నా ఒక మహిళ చెన్నై షాపింగ్ మాల్ వద్ద ఆటో ఎక్కి విద్యానగర్‌లో దిగారు. దిగే సమయంలో ఆమె తన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయారు. ఆ బ్యాగులో 8 గ్రాముల బంగారం, రూ.12,000 నగదు ఉన్నాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ వివిధ గ్రూపుల్లో సందేశం ప్రచారం చేయగా, దానిని గమనించిన వావిలాలపల్లె ఆటో స్టాండ్ సభ్యుడు ఆవుదుర్తి బాబు స్పందించారు.ఆ బ్యాగు తన ఆటోలోనే మరిచిపోయారని గుర్తించిన ఆయన, ఈ విషయాన్ని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి కి తెలియజేశారు. అనంతరం ఆయన సూచన మేరకు ఆటో డ్రైవర్ ఆవుదుర్తి బాబు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సృజన్ రెడ్డి సమక్షంలో ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ బషీర్, కానిస్టేబుల్ హరీష్ రెడ్డి, కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోగొట్టుకున్న హ్యాండ్ బ్యాగ్‌ను బాధితులకు తిరిగి అందజేశారు.ఈ సందర్భంగా నిజాయితీతో వ్యవహరించి, బాధ్యతాయుతంగా బ్యాగును తిరిగి అప్పగించిన ఆటో డ్రైవర్ ఆవుదుర్తి బాబును టూ టౌన్ సీఐ సృజన్ రెడ్డి అభినందించి సన్మానించారు. ఆటో డ్రైవర్లు తమ వృత్తిపట్ల నిబద్ధతతో పాటు మానవతా విలువలను కూడా కాపాడుకోవాలని ఈ సంఘటన చాటిచెప్పింది.ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ, ఇరవేణి కుమార్, సహాయ కార్యదర్శి వాల్క రమేష్, కార్యవర్గ సభ్యుడు కూర్మాచలం వేణుమాధవ్, వావిలాలపల్లె ఆటో స్టాండ్ అధ్యక్షుడు నేదునూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్ట్ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు

కరీంనగర్ లీగల్, అక్టోబర్ 17 (జనంసాక్షి):కరీంనగర్ జిల్లా కోర్ట్ ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బతుకమ్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అని అన్నారు.జిల్లా జడ్జి శివకుమార్, న్యాయమూర్తులు నీరజ, కవిత, వెంకట సత్యారాజ్ కిరణ్, దామెర ప్రీతి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాధవి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బండ శివకుమార్, బొడ్ల గీతారాణి, కార్యదర్శి సుంకె దేవకిషన్, కోశాధికారి బొజ్జ స్వామి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ముప్పిడి మదన్ బాబు, సంధ్యారాణి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, న్యాయవాదులు గీతా రెడ్డి, అంబల్ల మాధవి, గంట సతీష్, తిప్పర్తి శ్రీనివాస్, ఆశాడపు శ్రీనివాస్, సిరికొండ శ్రీధర్ రావు, ముద్దసాని సంపత్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



### ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుతో

# మరింత మెరుగైన సేవలు

### ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనంసాక్షి):**
ఆధార్ సేవా కేంద్రం ద్వారా ప్రజలకు స్థానికంగానే మరింత మెరుగైన సేవలు లభిస్తాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లి మున్నూరుకాపు సంఘం భవనంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన ఆధార్ సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఆధార్ సేవా కేంద్రాల విస్తరించడం జరుగుతోందని తెలిపారు. ఇదివరకు ఆధార్ సేవల కోసం హైదరాబాద్ కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నిజామాబాద్ సహా తెలంగాణలో 10 ప్రాంతాలలో ఆధార్ సేవా కేంద్రాలను కొత్తగా అందుబాటులోకి తెచ్చారని అన్నారు. దీనివల్ల ప్రజలు ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే సేవలు పొందేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు.ఆధార్ సేవా కేంద్రం ద్వారా కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు, పుట్టిన తేదీ వంటి వివరాల్లో అర్హత మేరకు మార్పులు చేసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చే ప్రజలు తమ వెంట అవసరమైన గుర్తింపు, చిరునామా, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత సేవకు అనుగుణంగా తీసుకురావాలని తెలిపారు. వివిధ సేవలకు సంబంధించి యూఐడీఏఐ నిర్దేశించిన నిర్ణీత రుసుము మాత్రమే చెల్లించాలని సూచించారు.నిజామాబాద్ లో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారికి కూడా ఆధార్ సంబంధిత సేవలు పొందడంలో సౌలభ్యం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్, వివిధ సేవల కోసం ఆధార్ వివరాలు అవసరం అవుతున్న దృష్ట్యా, ప్రజలు తమ ఆధార్ సమాచారాన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు.అవసరమైన సేవల కోసం నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆధార్ ప్రాధికార సంస్థ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి శ్రవణ్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్, ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మిస్టరీ వీడేనా..?

- గాంధారి ఏటీఎం చోరీ కేసును సవాల్‌గా తీసుకుంటున్న పోలీసులు
- పక్కా ప్లాన్‌తోనే చోరీ జరిగిందా? పెట్రోలింగ్ లేకపోవడంపై అనుమానాలు
- ఇప్పటికే పలువురిపై సస్పెన్షన్ వేటు
- ఎస్పీ ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు

గాంధారి(జనంసాక్షి):గాంధారి ఏటీఎం చోరీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ చోరీ వెనుక పక్కా ప్రణాళిక ఉందా? ముందస్తు సమాచారంతోనే దుండగులు ఈ దొంగతనానికి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, ఘటన జరిగిన రోజు పెట్రోలింగ్ జరగకపోవడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. పోలీసుల నిఘా, భద్రతా ఏర్పాట్లపై చర్చ మొదలైంది.

**పెట్రోలింగ్ లేకపోవడంపై అనుమానాలు**

ఏటీఎం చోరీ జరిగిన రోజు పోలీసుల పెట్రోలింగ్ ఎందుకు జరగలేదన్న అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా రాత్రి వేళల్లో నిర్వహించాల్సిన గస్తీ ఎందుకు నిలిచిపోయింది? విధుల్లో నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పెట్రోలింగ్ నిలిచిపోవడానికి గల అసలు కారణాలు, చోరీతో ఏమైనా సంబంధం ఉందా అనే అంశాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**విధుల నిర్లక్ష్యంపై సస్పెన్షన్ వేటు**

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు భావించిన నేపథ్యంలో సంబంధిత పోలీసు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలుస్తోంది. పోలీసు శాఖలో బాధ్యతారాహిత్యాన్ని సహించబోమనే సంకేతంగా ఈ చర్యను భావిస్తున్నారు.






అయితే, సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.వరుస చోరీలు పోలీసుల నిఘా వ్యవస్థకు సవాల్‌గా మారుతున్నాయి. ఈ ఘటనల వెనుక ఒకే ముఠా ప్రమేయం ఉందా? దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులు ఒకే తరహా పద్ధతిని అనుసరిస్తున్నారా? అనే కోణాల్లో విచారణ జరగాల్సి ఉంది.ఎస్పీ రాజేష్ చంద్ర నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు కోసం వివిధ బృందాలుగా వినూత్న రీతిలో సంయుక్తంగా గాలిస్తున్నారు.గాంధారి ఏటీఎం చోరీ కేసును ఛేదించేందుకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఇతర పోలీసు విభాగాల సమన్వయంతో నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, గతంలో జరిగిన చోరీల వివరాలను విశ్లేషించడం ద్వారా నిందితులను గుర్తించే ప్రయత్నాలు సాగుతున్నాయి.

**నిందితులు ఎవరూ? మిస్టరీ వీడేదెప్పుడు?**

గాంధారి ఏటీఎం చోరీ వెనుక అసలు సూత్రధారులు ఎవరు? ఈ ఘటన ముందస్తు ప్రణాళికలో భాగమా? పెట్రోలింగ్ లోపం దుండగులకు అనుకూలంగా మారిందా? అన్న ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తుతోనే సమాధానం లభించనుంది. ప్రత్యేక బృందాల గాలింపు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కేసులో పోలీసులు ఎలాంటి పురోగతి సాధిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.
గాంధారి ఏటీఎం చోరీ మిస్టరీని ఛేదించి నిందితులను పట్టుకోవడం పోలీసులకు కీలకంగా మారింది. దర్యాప్తు పూర్తయి అధికారిక వివరాలు వెల్లడయ్యే వరకు ఈ ఘటనకు సంబంధించిన పలు అంశాలు ప్రశ్నార్థకంగానే మిగిలాయి.

## అక్షర పోరాటం చేసిన ధైర్యశాలి షోయబ్ ఉల్లా ఖాన్

**బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం డి. ముజీబ్**

కరీంనగర్ బ్యూరో అక్టోబర్ 17 ( జనం సాక్షి) : కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో శనివారం రోజున బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ షోయబ్ ఉల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు.
నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్నే ఆయుధంగా చేసుకుని అక్షర పోరాటం చేసిన ధైర్యశాలి, మహనీయుడు షోయబ్ ఉల్లా ఖాన్ అని కొనియాడారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆయన పోరాట పటిమ నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వీరుడు , నిర్భయ జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, మైనార్టీ మోర్చా ప్రతినిధులు,సమీయుల్లా అహ్మద్, మొహమ్మద్ సైద్, అబూబకర్, ఫయాజ్ చిస్తి, సర్దార్, మహమ్మద్ ఆతీఫ్, అమీర్, రౌఫ్ తదితరులు కార్యకర్తలు పాల్గొని అమరవీరుడు షోయబ్ ఉల్లా ఖాన్ సేవలను గుర్తుచేసుకున్నారు.



## పర్యాటక కేంద్రంగా నిజాంసాగర్‌కు కొత్తరూపు

**నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజం అభివృద్ధి పనుల పరిశీలన**

**రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 14 ఎకరాల్లో పర్యాటక కాటేజీల నిర్మాణం**

**అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్**





**జనం సాక్షి - నిజాంసాగర్**

నిజాంసాగర్: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఎకో టూరిజం పనులపై దృష్టి సారించారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామపంచాయతీ పరిధిలోని గోల్ బంగ్లా పరిసరాల్లో కొనసాగుతున్న ఎకో టూరిజం కాటేజీల అభివృద్ధి పనులను జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పరిశీలించారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 14 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే నిజాంసాగర్ ప్రాంతానికి పర్యాటక పరంగా మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.

**రూ.10 కోట్లతో పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక**

నిజాంసాగర్ ప్రాజెక్టు జలవనరులు, పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఈ సహజ వనరులను పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో గోల్ బంగ్లా పరిసరాల్లో ఎకో టూరిజం కాటేజీల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. సుమారు 14 ఎకరాల స్థలంలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే పర్యాటకులకు అవసరమైన వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. జుక్కల్ నియోజకవర్గ పరిధిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ క్రమంలో గోల్ బంగ్లా పరిసరాల్లో చేపట్టిన పనుల పురోగతిని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**నిజాంసాగర్‌కు పర్యాటక రంగంలో కొత్త గుర్తింపు వచ్చేనా?**

సహజ అందాలు, జలాశయ పరిసరాలు, చారిత్రక ప్రాధాన్యం కలిగిన గోల్ బంగ్లా ప్రాంతాన్ని సమన్వయం చేస్తూ పర్యాటక సౌకర్యాలను అభివృద్ధి చేయడం ద్వారా నిజాంసాగర్‌కు కొత్త గుర్తింపు తీసుకురావచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఎకో టూరిజం పనులు పూర్తయి, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తే స్థానికంగా పర్యాటక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ , మండల అధ్యక్షుడు ప్రజా పండరి,పాల్గొని అభివృద్ధి పనులను పరిశీలించారు.

## ప్రమాద నివారణ... ప్రథమ చికిత్సే ప్రాణరక్షణ

**ట్రామా సమయంలో అన్ని విభాగాలున్న ఆసుపత్రే కీలకం**

**వరల్డ్ ట్రామా డే సందర్భంగా మెడికవర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 17 ( జనం సాక్షి) : రోడ్డు ప్రమాదాలు, ఇతర ఆకస్మిక ఘటనల్లో గాయపడిన వారిని సకాలంలో సీటీ, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి సౌకర్యాలు, అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్తే గోల్డెన్ అవర్‌లోనే చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఇబ్బంది పడడం మానేసి ప్రమాదం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవడమే మేలని సూచించారు. వరల్డ్ ట్రామా డే సందర్భంగా శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ... ప్రమాదాలు, ఆకస్మిక ఘటనల కారణంగా శరీరానికి కలిగే తీవ్రమైన గాయాలను ట్రామాగా పరిగణిస్తారని తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, ఛాతీ, పొత్తికడుపు, ఎముకలకు గాయాలైనప్పుడు బాధితుడి పరిస్థితి వేగంగా విషమించే ప్రమాదం ఉంటుందన్నారు. కొన్ని సందర్భాల్లో బయటకు పెద్దగా గాయాలు కనిపించకపోయినా అంతర్గత రక్తస్రావం లేదా అవయవాలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితుడిని సురక్షితంగా, వేగంగా ఆసుపత్రికి చేర్చగలిగితే వెంటనే శ్వాస, రక్తప్రసరణ, స్పృహ వంటి కీలక అంశాలను పరిశీలించి, అవసరాన్ని బట్టి న్యూరోసర్జన్లు, వాస్క్యులర్ సర్జన్, సర్జికల్ గ్యాస్ట్రో, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, రేడియోలజీ, క్రిటికల్‌కేర్, అనెస్థీషియా వైద్యులు సమన్వయంతో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. మెడికవర్‌లో అన్ని సూపర్‌స్పెషాలిటీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రవికుమార్, సర్జికల్ గ్యాస్ట్రో వైద్యుడు డాక్టర్ దిలీప్‌రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, క్రిటికల్‌కేర్ వైద్యుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, ఈశ్వర్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.300 కోట్లతో రూ.30 వేల కోట్ల సంపద!

- **కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల వద్ద కాఫర్ డ్యాంలు నిర్మించాలి**
- **అక్టోబర్ 31 వరకు సాగునీరు విడుదల చేయాలి: జీవన్ రెడ్డి**



రాయికల్, అక్టోబర్ (జనంసాక్షి): ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చించి కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల వద్ద కాఫర్ డ్యాంలు నిర్మిస్తే 15 నుంచి 20 లక్షల ఎకరాలకు రబీ సాగునీరు అందడంతోపాటు రూ.30 వేల కోట్ల సంపద సమకూరుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్‌లో దావ వసంత సురేష్, మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్, బర్కం మల్లేశం, ఎలిగేటి అనిల్, తురగ శ్రీధర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డకు మరమ్మతులు అవసరమైనా అన్నారం, సుందిళ్లను తక్షణమే వినియోగించుకోవచ్చని కేంద్ర జలవనరుల శాఖ నివేదిక ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్‌కు పేరొస్తుందనే ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వ అసమర్థతను అధికారులపై నెట్టడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించగా కాంగ్రెస్ పాలనలో సరఫరా అస్తవ్యస్తమైందన్నారు. ఎర్రవల్లిలో కేసీఆర్ భూకబ్జా చేశారన్న సీఎం రేవంత్ రెడ్డి సెంటు భూమినైనా వెలికితీశారా అని ప్రశ్నించారు. అక్టోబర్ 31 వరకు సాగునీరు విడుదల చేయాలని, రోళ్లవాగులో 0.25 టీఎంసీల నీటిని నింపాలని, రైతులకు 12 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గోపి రాజిరెడ్డి, బత్తిని నాగరాజు, ఏనుగంటి రవి, మహేష్ గౌడ్, మంద రమేష్, ఆనంద్ రావు, సంతోష్, సాగర్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీళ్లున్నా సాగుకు నీరు దిక్కులేదు

**వేములవాడ చెక్కపల్లి రోడ్డు రహదారిలో గల సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఆగ్రహం**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (జనంసాక్షి): కాళేశ్వరం జలాలు వృధాగా పోతున్న సాగునీరు ఇవ్వకపోగా అరుగలం కష్టపడి రైతులు వేసుకున్న పంటకు కనీసం నాణ్యమైన కరెంటు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యపు ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీనరసింహారావు మండిపడ్డారు. శనివారము వేములవాడలోని చెక్కపల్లి రహదారిలో గల సబ్ స్టేషన్ వద్ద బిఆర్ఎస్ నాయకుల నిరసన కార్యక్రమంలో హాజరైన చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో సాగునీరు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, చివరి దశలో విద్యుత్ సమస్యలను పట్టించుకోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, కోనరావుపేట మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రస్తావిస్తూ, పొలాల్లో నీరు ఉన్నా మోటార్లు నడపడానికి సరిపడా కరెంటు అందకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని, ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతుల శ్రమ వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రంగి ప్రాంతంలో పొలాలకు నీరు అందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కోనరావుపేట మండలంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాత్రి కరెంటును ప్రభుత్వం ఎప్పుడో ఎత్తివేగా కనీసం ఉదయం ఇచ్చే నాలుగైదు గంటల కరెంటు కూడా కోతలు లేకుండా రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, రైతులకు ఉపయోగపడేలా నీటి నిర్వహణపై ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

**సొంత ఊరిలోనే పంటలు ఎండిపోతున్నా ఆది శ్రీనివాస్‌కు పట్టదా..?**

వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, కోనరావుపేటతో పాటు పలు మండలాల్లో విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగునీరు అందించలేక ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎందుకు స్పందించడం లేదని చల్మెడ ప్రశ్నించారు. ఎమ్మెల్యే సొంత గ్రామమైన రుద్రంగిలోనే రైతులు కరెంటు కోతలతో పంటలను కాపాడుకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని, అయినా రైతుల సమస్యలపై ఆయన గళమెత్తకపోవడం బాధాకరమని విమర్శించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఉందని, ఇప్పటికైనా ఆది శ్రీనివాస్ మౌనం వీడి రైతుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రామతీర్థపు రాజు, నిమశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి రామచంద్రం, మేకల రవి, హరిచరణ్రావు,చందుర్తి,కోనరావుపేట మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ డీ - 83 సాగునీరు విడుదల

**మంత్రి శ్రీధర్ బాబు కృషితో రైతులకు మేలు**



మంథని అక్టోబర్ 17, (జనంసాక్షి ) : మంథని నియోజకవర్గంలోని రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి, ఎస్సారెస్పీ నుంచి గుండారం రిజర్వాయర్‌లోకి డీ–83 కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేశారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ శనివారం కమాన్‌పూర్, రామగిరి, పెద్దపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఎస్సారెస్పీ అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాగునీటి విడుదలతో మంథని నియోజకవర్గ పరిధిలోని రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతోనే రైతులకు ఈ మేలు జరిగిందని తెలిపారు. మాటను నిలబెట్టుకుంటూ మంథని, పెద్దపల్లి రైతాంగాన్ని ఆదుకున్న మంత్రికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్. అన్వర్, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, రామగిరి మండల మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, గుండారం సర్పంచ్ జంగిలి పోశాలు, నాగేపల్లి మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, గుండారం గ్రామ శాఖ అధ్యక్షులు పిడుగు శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అక్రమ పేలుడు పదార్థాలు పట్టివేత

**475 జిలెటిన్ కడ్డీలు స్వాధీనం.. ఒకరి అరెస్ట్**

**సైదాపూర్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో ప్రత్యేక పోలీసు బలగాలు శనివారం మెరుపు దాడి నిర్వహించాయి. సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వకాల కోసం అక్రమంగా పేలుడు పదార్థాలు వినియోగిస్తున్న స్థావరంపై దాడి చేసి భారీగా పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.
ఏసీపీ సతీష్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో అనుమతులు లేకుండా బావి తవ్వకాలు జరుపుతున్న రామడుగు మండలం శ్రీరాములపల్లెకు చెందిన వేముల భూమయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
నిందితుడి వద్ద నుంచి అనుమతులు లేని లిలి475 జిలెటిన్ కడ్డీలు, సుమారు 3 వేల మీటర్ల పేలుడు తీగ (మూడు చుట్టలు)లిలితో పాటు బావి తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు గాలి ఒత్తిడి యంత్రాలతో కూడిన ట్రాక్టర్లను (టూ 02 ఖజ 2690, టూ 02 ు 0082) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
స్వాధీనం చేసుకున్న సామగ్రితో పాటు నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సైదాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎస్ఐలు సురేందర్, శ్రీకాంత్, ప్రధాన కానిస్టేబుల్ సురేంద్ర, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజయ్య, సాయిదీప్, విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ సతీష్ హెచ్చరించారు.



## తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత
## యాసంగిలో వరి సాగు చేయవద్దు

- **సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి**
- **ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ బెనహుర్ మహేష్ దత్ ఎక్కా**




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి): సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, విద్యుత్, సాగునీటి అవసరాలపై ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బెనహుర్ మహేష్ దత్ ఎక్కా అధికారులను ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ యాసంగిలో వరి సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు.
కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి, కృష్ణా నదుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, భూగర్భ జలాలు వేగంగా తగ్గుతున్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోరు రీఛార్జి పనులతో భూగర్భ జలాలను పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 7 శాతం తక్కువగా 681.7 మి.మీ. వర్షపాతం నమోదైందని, దిగువ మానేరు జలాశయంలో 15.452 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాలు లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు వివరించారు.
జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 9 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, కొన్ని మండలాల్లో పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 5 శాతం తక్కువ వర్షపాతం నమోదైనా ప్రస్తుతం కరువు పరిస్థితులు లేవన్నారు. రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 5 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, మధ్య మానేరు, దిగువ మానేరు సహా జలాశయాల్లో నీటి నిల్వల వివరాలను వెల్లడించారు. సమీక్షలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ, నాలుగు జిల్లాల వ్యవసాయ, సాగునీటి, విద్యుత్, మిషన్ భగీరథ, భూగర్భ జలాలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలు రక్తసిక్తం

**వినాయక్‌నగర్‌లో కత్తితో భార్య, మామపై అల్లుడి దాడి**

**నిజామాబాదు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 జనం సాక్షి :** కుటుంబంలో చెలరేగిన చిన్నపాటి మనస్పర్థలు చివరకు రక్తపాతానికి దారితీశాయి. వినాయక్‌నగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కుటుంబ కలహాల నేపథ్యంగా క్షణికావేశంలో తెగబడిన ఓ వ్యక్తి, కత్తితో భీభత్సం సృష్టించి భార్యతో పాటు కన్న మామపై కూడా పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. వినాయక్‌నగర్‌కు చెందిన వైద్యనాథ్ అనే వ్యక్తికి, అతని భార్య పూజకు మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి.
ఈ గొడవల కారణంగా పూజ గత రెండు నెలలుగా భర్తకు దూరంగా ఉంటోంది. అయితే, శనివారం అర్ధరాత్రి సమయంలో అనూహ్యంగా ఇంటికి వచ్చిన వైద్యనాథ్ విచక్షణ కోల్పోయి ప్రవర్తించాడు. భార్యపై కక్షగట్టిన అతను తెగించి, అడ్డువచ్చిన వారిపై కత్తితో విరుచుకుపడ్డాడు. ఈ దాడిలో వైద్యనాథ్ తన భార్య పూజతో పాటు, మామ అయిన 70 ఏళ్ల మోహన్‌పై కత్తితో తీవ్రంగా దాడి చేశాడు.

## శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క**

హైదరాబాద్, : హైదరాబాద్‌లోని మధురానగర్‌లో ఉన్న మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు, శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా



నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, బతుకమ్మ ఆడారు. మంత్రి సీతక్క కూడా వారితో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహాన్ని నింపారు. అధికారులు, సిబ్బందితో ఆత్మీయంగా మమేకమై పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.
బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతుంది. కార్యాలయాల్లో ఇలాంటి పండుగలను నిర్వహించడం ద్వారా ఉద్యోగులు తమ



స్టేట్ హోమ్ లో అవిభక్త కవలలు వీణ వానిలను ప్రత్యేకంగా కలిసి అభినందించిన మంత్రి సీతక్క

సంప్రదాయాలను సంతోషంగా జరుపుకునే అవకాశం కలుగుతుంది.
మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం పనిచేసే శాఖలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల గౌరవం, సాధికారత, బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.

# శ్రామికుల ఇంట 'దసరా' వెలుగులు

- 450 మంది కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ
- మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ ఉదారత



అమీన్పూర్, అక్టోబర్ 17 (జనం సాక్షి) కార్మికుల కుటుంబాల్లో దసరా పండుగ వెలుగులు నింపాలని ఆనందోత్సవాలతో పండుగ జరుపుకోవాలని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ పేర్కొన్నారు. అమీన్‌పూర్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్ (వాటర్ బోర్డు) కార్మికులు సుమారు 450 మందికి తన నివాసంలో వస్త్రాలను అందజేసి ఆత్మీయంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నందారం నరసింహా గౌడ్ మాట్లాడుతూ.. ఎండనక, వాననక నిత్యం రహదారులను శుభ్రపరుస్తూ, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా శ్రమిస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. తెలంగాణలో పెద్ద పండుగైన దసరాని కుటుంబాలతో కలిసి ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలనీ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల మోములో చిరునవ్వు చూడటమే తమ కుటుంబానికి నిజమైన పండుగ సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల సేవలో ఉండే తమ శ్రమను గుర్తించి, పండుగ వేళ పెద్ద దిక్కుగా నిలిచి గౌరవించినందుకు నందారం నరసింహా గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తున్న నరసింహ గౌడ్ కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత పదవులు అధిష్టించి ప్రజాసేవలో ముందంజలో ఉండాలనీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎన్ జి యువసేన సభ్యులు ఇంద్రేశం ప్రకాష్, ముదిరాజ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నందారం శ్రీనివాస్ గౌడ్, దాసు యాదవ్, శేఖర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మల్లేష్, భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రముఖులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే..

# వచ్చే ఎన్నికలకు నాంది

- బీజేపీ, బీఆర్ఎస్‌ల రాజకీయ కుట్రలను ప్రజల్లో ఎండగట్టాలి
- కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కష్టపడాలి.. ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయాలి : మంత్రి వాకిటి



మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి): పాలమూరు--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... ఈ ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి ఒక దిక్సూచి లాంటిదని, భవిష్యత్తు రాజకీయాలకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని.. గెలుపు సులభంగా వస్తుందని భావించడం భ్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని, మండల స్థాయి నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు, ప్రతి ఓటరును నేరుగా కలిసి పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించిన సామ రామ్మోహన్ రెడ్డి యువకుడని, కష్టపడి పనిచేసే నాయకుడని మంత్రి కొనియాడారు. పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉ ందన్నారు. ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో కార్యకర్తలు సమన్వయంతో ప్రచారం నిర్వహించి విజయానికి బాటలు వేయాలని సూచించారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను కలిసికట్టుగా రాజకీయంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే విషయంలో బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. పాలమూరు ప్రాంత అభివృద్ధి, రైతుల ప్రయోజనాల విషయంలో ఈ రెండు పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్సీలుగా గెలిచిన వారు పాలమూరు ప్రాంతానికి ఆశించిన స్థాయిలో సేవలు అందించలేకపోయారని విమర్శించారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువతకు అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చే నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ద్వారా రాబోయే ఎన్నికల్లోనూ పార్టీ మరింత బలోపేతం అవుతుందని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టమే పార్టీకి అసలైన బలమని, ప్రతి ఓటును కీలకంగా భావించి క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషి, పటిష్టమైన ఎన్నికల వ్యూహం, ప్రజలతో నిరంతర సంబంధాలే విజయానికి మార్గాలని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.



# బంతిపూల ధరలు నేలచూపులు నష్టాల్లో రైతులు

యాచారం, అక్టోబర్ 17(జనం సాక్షి): యాచారం మండలంలో బంతి పూల సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. మండలంలోని నడికుడి కృష్ణ అనే రైతు తన రెండు ఎకరాల భూమిలో బంతి పూల తోటను సాగు చేశారు. ఎంతో కష్టపడి పంటను చేతికి తెచ్చినా, ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పూర్తిగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి పెట్టి సాగు చేస్తే, కనీసం కూలీల ఖర్చులు మరియు రవాణా ఛార్జీలు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి బంతి పూల సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, లేదా నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

# బీరు' బ్యూటీ హంగామా!

- ఉదయం 8 గంటలకే రోడ్డెక్కి..
- కారు సన్‌టాప్‌పై కూర్చుని మద్యం సేవిస్తూ..
- తుర్కయంజాల్ రోడ్డుపై హల్చల్



రంగారెడ్డి, అక్టోబర్ 17 (జనంసాక్షి): సమాజం తలదించుకునేలా, తోటి ప్రయాణికులను విస్మయానికి గురిచేసేలా ఓ యువతి చేసిన వికృత చేష్టలు తుర్కయంజాల్ ప్రాంతంలో సంచలనం సృష్టించాయి. తెల్లవారితే చాలు ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండే ఉదయం పూట.. అదీ సరిగ్గా 8.26 గంటల సమయాన రద్దీ రోడ్డుపై ఈ హల్‌చల్ చోటుచేసుకుంది.

### ఉదయం 8.26 గంటలకే..

శనివారం ఉదయం 8.26 గంటల సమయంలో తుర్కయంజాల్ ప్రధాన రహదారిపై ఒక లగ్జరీ కారు స్లోగా వెళ్తోంది. రోడ్డుపై విపరీతమైన రద్దీ ఉన్న సమయంలో ఆ కారు సన్‌రూఫ్ (సన్ టాప్) అకస్మాత్తుగా తెరుచుకుంది. అందరూ ఆశ్చర్యపోయేలా అందులో నుంచి ఓ యువతి బయటకు వచ్చి ఏమాత్రం భయం లేకుండా కారు టాప్‌పైకి ఎక్కి కూర్చుంది. చేతిలో బీరు సీసా పట్టుకుని, దాన్ని తాగుతూ అటుగా వెళ్తున్న వాహనదారులకు విచిత్ర హావభావాలు ప్రదర్శించింది.

### ప్రాణాల మీదకు తెచ్చుకున్న వైనం..

కారు కదులుతున్న సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా సన్‌టాప్‌పై కూర్చోవడం ప్రాణాంతకం కాగలదన్న స్పృహ కూడా ఆ మహిళకు లేకుండాపోయింది. కొద్దిపాటి అజాగ్రత్త జరిగినా పెను ప్రమాదం ముంచుకొచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కారు నడుపుతున్న వ్యక్తి కూడా ఆమెను వారించకపోవడం గమనార్హం. డ్రైవర్ బాధ్యతారాహిత్యం, యువతి చేసిన ఈ విపరీత చేష్టలు అక్కడి స్థానికులను తీవ్ర విస్మయానికి గురిచేశాయి.

### సోషల్ మీడియాలో వీడియో వైరల్..

ఈ షాకింగ్ దృశ్యాన్ని వెనుక వస్తున్న కొందరు వాహనదారులు డాస్ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో క్షణాల్లో వైరల్‌గా మారింది. పగటిపూట, అదీ పబ్లిక్ రోడ్డుపై యువతి చేసిన ఈ నిర్వాకంపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు.

# భారత ఆర్చరీకి ఎన్‌టీపీసీ అండ

## ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అర్జున్ ముందా

**ఖైరతాబాద్, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** భారత ఆర్చరీ అభివృద్ధికి ఎన్‌టీపీసీ 2018 నుంచి మద్ద తు అందిస్తోందని ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అర్జున్ ముందా శనివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ధనుర్విద్య ప్రాజెక్టు ద్వారా శిక్షణ, పరిక రాలు, స్కాలర్‌షిప్‌లు అందిస్తోందని తెలిపారు. తెలంగాణకు చెందిన తానిపర్తి చికిత 2025 ప్రపం చ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించగా, ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు గెలుచుకుందని తెలిపారు. వెన్నం జ్యోతి సురేఖ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిందని పేర్కొన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎన్ఎస్ డీఎఫ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఐ) భాగస్వామ్యంతో ఎన్‌టీపీసీ రూ.152.88 కోట్ల మద్దతు అందించిందని తెలిపారు. మిజోరాంలోని లెంగ్‌పుయ్‌లో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ఎన్‌టీపీసీ బొంగాయ్‌గావ్, మిజోరాం రాష్ట్ర క్రీడా మండలి ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. దీనికి మూడేళ్లలో రూ.13.28 కోట్లు ఖర్చు చేయనున్న ట్లు తెలిపారు. భారత ఆర్చరీ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం, సాయ్, ఎన్‌టీపీసీ సహకారం కీలకమని పేర్కొన్నారు.



# మహిళా సంఘాల వేరుశనగల పంపిణీలో అక్రమాలు?

- అనర్హులకు వేరుశనగలు పంపిణీ చేశారంటూ మహిళా సంఘాల ధర్నా
- విచారణ జరిపి న్యాయం చేస్తామన్న డీఆర్‌డీఓ అధికారి





వనపర్తి రూరల్, అక్టోబర్ 17, జనం సాక్షి : మహిళా సంఘాలకు పంపిణీ చేయాల్సిన వేరుశనగలను తమకు తెలియకుండా అనర్హులకు పంపిణీ చేశారని ఆరోపిస్తూ వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. శనివారం వనపర్తి నుంచి గణపురం వైపు వెళ్లే రహదారిపై ధర్నా నిర్వహించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా సంఘాలకు పంపిణీ చేయాల్సిన వేరుశనగలను అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై పక్కదారి పట్టించారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. ఎమ్మెల్యే వర్గానికి చెందిన వ్యక్తి పేరు సీసీకి చెప్పి వేరుశనగలను తరలించారని, అనంతరం చిమనగుంటపల్లిలోని ఓ కోళ్ల ఫారంలో నిల్వ ఉంచి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి వర్గానికి చెందిన వారికి మాత్రమే పంపిణీ చేశారని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వర్గానికి చెందిన వారికి పంపిణీ చేయకపోవడంతో ఈ వ్యవహారం వివాదానికి దారితీసిందని ఆరోపించారు.

### మహిళా సంఘాల వ్యవహారాల్లో రాజకీయ జోక్యమెందుకు?

మహిళా సంఘాలకు చెందాల్సిన వేరుశనగలను సంఘాల సభ్యులకు తెలియకుండానే అనర్హులకు పంపిణీ చేయడం ఏమిటని మహిళలు ప్రశ్నించారు. మహిళా సంఘాల వ్యవహారాల్లో కాంగ్రెస్ నాయకులు అధికారాన్ని చెలాయిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండానే వేరుశనగలను తరలించి పంపిణీ చేయడంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వేరుశనగల పంపిణీలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటే, భవిష్యత్తులో మహిళా సంఘాలకు సంబంధించిన విలువైన చెక్కుల విషయంలోనూ ఇలాగే జరిగితే తమ పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారానికి తమను బాధ్యులను చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘం అధ్యక్షురాలు పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించినట్లు తెలిసింది.

### విచారణ జరిపి న్యాయం చేస్తాం: డీఆర్‌డీఓ

మహిళా సంఘాల ఆందోళన నేపథ్యంలో స్పందించిన డీఆర్‌డీఓ అధికారి ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు ధర్నాను విరమించారు.

మహిళా సంఘాలకు చెందాల్సిన వేరుశనగల పంపిణీలో నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

# చారిత్రాత్మక బురుజుకు పునరుజ్జీవం!

## పంచాయతీ పాలకవర్గం, యువత సమష్టి కృషి

**నంగునూరు, అక్టోబరు 17 (జనం సాక్షి) :** గ్రామ చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన చారిత్రాత్మక కట్టడానికి మళ్లీ కొత్త కళ వచ్చింది. కాలక్రమంలో చెట్లు, పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిన సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ లోని బురుజుకు గ్రామ పాలకవర్గం, యువత, గ్రామ పెద్దలు కలిసి పునరుజ్జీవం పోశారు. గ్రామానికి తలమానికంగా నిలిచిన ఈ చారిత్రక నిర్మాణాన్ని శనివారం శుభ్రం చేసి సుందరంగా తీర్చిదిద్దారు. బురుజుపై భారీ విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేశారు. దీంతో బురుజు మరోసారి గ్రామస్తుల దృష్టిని ఆకర్షిస్తోంది. మగ్దుంపూర్ గ్రామానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్న బురుజు స్థానికంగా ప్రాధాన్యం కలిగిన నిర్మాణం. కాలక్రమంలో బురుజుపై చెట్లు, పొదలు, గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో కట్టడం అందవిహీనంగా మారింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన నిర్మాణాన్ని సంరక్షించాలనే ఆలోచనతో గ్రామ పాలకవర్గం, యువత, గ్రామ పెద్దలు ముందుకొచ్చారు. బురుజుపై పేరుకు పోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను శుభ్రం చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గ్రామ వారసత్వాన్ని కాపాడుకోవడంలో భాగంగా చేపట్టిన ఈ చర్య స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.



బురుజుపై భారీ విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేయడంతో రాత్రివేళల్లోనూ ఈ నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గ్రామానికి వచ్చే వారికి బురుజు కనిపించేలా దీపం ఏర్పాటు చేయడం ద్వారా పరిసరాలకు కొత్త శోభ చేకూరింది.

మగ్దుంపూర్ లో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను బురుజు వద్ద ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలతో బురుజుకు గ్రామ ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. గ్రామంలోని చారిత్రక కట్టడాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రభుత్వ యంత్రాంగం, గ్రామ పంచాయతీ పాలక వర్గంతోపాటు యువత, గ్రామపెద్దలు ముందుకొస్తే వారసత్వ సంపదను పరిరక్షించడం సాధ్యమవుతుందని మగ్దుంపూర్‌లో చేపట్టిన కార్యక్రమం చాటి చెబుతోంది. ఇలాంటి ప్రయత్నాలు గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతోపాటు భావితరాలకు స్థానిక చరిత్రపై అవగాహన కల్పిస్తాయి. గ్రామ చారిత్రక సంపదను కాపాడేందుకు ప్రజల భాగస్వామ్యం కొనసాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. గ్రామ సర్పంచ్ పాకాల శ్రీనివాస్, వాసర యాదమల్లు, వాసరి శ్యామ్, జాప హరికృష్ణ, స్వామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మధురానగర్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు

- కూల్చివేతలపై బీఆర్ఎస్ నేతల అభ్యంతరం
- తమను టార్గెట్ చేస్తున్నారని ఆరోపణ





**శంషాబాద్, అక్టోబర్17 (జనంసాక్షి):** శంషా బాద్‌లోని మధురానగర్‌లో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది జేసీబీ, ఇతర యంత్రాలతో అక్కడికి చేరుకుని కూల్చివేతకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులకు, స్థానికులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. జీ ప్లస్ టూ అనుమతులు తీసుకుని జీ ప్లస్ 5, 6 అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టిన భవనాలకు అధికారులు నోటీసులు జారీ చేస్తూ చర్యలు తీసుకుంటున్నారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రెండేళ్ల క్రితం శంషాబాద్ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో అన్ని పార్టీల ఆమోదంతో పాటు ఎమ్మెల్యే ఆమోదంతో పట్టణ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. ప్రస్తుతం అక్రమ నిర్మాణాల పేరుతో బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని అధికారులు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. కూల్చివేతల సందర్భంగా అధికారులకు, స్థానికులకు మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో స్థానికులు అధికారుల చర్యలను ప్రశ్నించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై అధికారులు చేపట్టిన చర్యలు, వాటిపై బీఆర్ఎస్ నాయకులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

### ఎన్ని నిర్మాణాలు కూల్చి వేశారు?

మధురానగర్‌లో చేపట్టిన కూల్చివేతలపై అధికారులను సంప్రదించి ఎన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు, ఎన్ని భవనాలను కూల్చివేశారని వివరణ కోరేందుకు ప్రయత్నించగా, సంబంధిత అధికారులు ఫోన్ కాల్స్‌కు స్పందించలేదు. దీంతో కూల్చివేతల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** తెలంగాణ ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శు భాకాంక్షలు తెలియజేస్తున్నానని రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. బతుకమ్మ పండుగ అంటేనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని, ఇది మన ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రకృతి పండుగ అని అన్నారు. మన పెద్దలు మనకు అందించిన ఈ గొప్ప సంప్రదాయాన్ని, సంస్కృతిని, జీవన విధానాన్ని మనమందరం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు.

ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, మన ఆడబిడ్డలు, రైతన్నలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం ఎటువంటి ప్రకృతి విపత్తులనైనా ఎదుర్కొనే శక్తిని అమ్మవారు ప్రజా ప్రభుత్వానికి ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గం ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

# మక్తల్--నారాయణపేట నాలుగు వరుసల రోడ్డు ఎప్పుడయ్యేను?

## మంత్రి ఇంటి ముందు బైఠాయిస్తా: మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**నారాయణపేట అక్టోబర్ 17 (జనం సాక్షి):** మక్తల్--నారాయణపేట నాలుగు వరుసల రహదారి పనులు మూడేళ్లు గడిచినా ముందుకు సాగకపోవడంపై మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మక్తల్ నుంచి సింగారం చౌరస్తా వరకు 25 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి, అక్కడ జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రూ.237 కోట్లు మంజూరైనా రహదారి పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని ప్రశ్నించారు. ప్రజలు మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయకపోతే మంత్రి ఇంటి ముందు బైఠాయిస్తానని హెచ్చరించారు.

పాదయాత్ర సింగారం చౌరస్తాకు చేరుకోగా నారాయణపేట మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, సంపత్, కౌన్సిలర్ భరత్, సుదర్శన్ రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.



# తల్లిదండ్రులను హింసించిన కుమారుడు అరెస్ట్



**సిర్గాపూర్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం బొక్కస్గా గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి తల్లిదం డ్రులను హింసించి, ఇంటి నుంచి వెళ్లగొట్టిన ఘటనలో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వీరారెడ్డికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు దామోదర్‌రెడ్డికి, చిన్న కుమారుడికి చెరో నాలుగు ఎకరాల భూమిని పంచి ఇచ్చాడు. అయితే దామోదర్‌రెడ్డి తనకు కేటాయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేసి విక్రయించినప్పటికీ, మరింత భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని తల్లిదండ్రులను వేధించాడు. లేదంటే ఏదైనా చేస్తానని బెదిరిస్తూ దాడి చేసి, భూమి నుంచి, ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు, వీరారెడ్డి అత్త పిట్లంలో అద్దె గది తీసుకొని జీవిస్తున్నారు. ఇంటిని, భూమిని దామోదర్‌రెడ్డి తన ఆధీనంలో ఉంచుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దామోదర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ తెలిపారు. తల్లిదండ్రులను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

- తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి
- అత్యవసర పంపులు సిద్ధం చేయాలి
- పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలి
- నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో సమీక్షలు..
- 23న సింగూరు రిజర్వాయర్‌పై ప్రత్యేక సమావేశం
- మంత్రి సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచినీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎర్రమంజిల్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో శని వారం మంత్రి సీతక్క ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల వారీగా నీటి నిల్వలు, ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితులు, రానున్న వేసవిలో ఎదురయ్యే అవసరాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, జుచీజ కృపాకర్ రెడ్డి, వివిధ స్థాయిలకు చెందిన చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

### తాగునీటికే మొదటి ప్రాధాన్యత

నవంబర్ 1వ తేదీలోపు సాగునీటి అవసరాలు తీరిన అనంతరం రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా అత్యవసర పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పంపులను సమీకరించి కనీసం 100 పంపులను అందుబాటులో ఉంచాలని, పనిచేయని పంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.

### గ్రామస్థాయి నుంచే వేసవి కార్యాచరణ

రానున్న యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిచ్చేలా రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి వేసవి కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. రెండో వారంలో మండల స్థాయిలో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకొని హ్యాబిటేషన్‌ల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వినియోగానికి సిద్ధం చేయాలని చెప్పారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాల పనులను పూర్తి చేయాలని, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

### పైప్‌లైన్ లీకేజీలపై నిర్లక్ష్యం వద్దు

అందుబాటులో ఉన్న నీటిని ప్రతి చుక్కా విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఇతర శాఖలు రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టే సమయంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల కారణంగా పైప్‌లైన్లు దెబ్బతింటే సంబంధిత శాఖలే బాధ్యత వహించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్లు దెబ్బతిన్న సందర్భాల్లో వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్ మరమ్మతులకు అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఇందుకోసం నిబంధనల మేరకు వీబీజీ రాం జీ నిధులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

### అత్యవసర నిధులతో తక్షణ చర్యలు

తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ఆలస్యం లేకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉన్న అత్యవసర నిధులతో పాటు రాణఖీ నిధులను కూడా నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించేలా కంటింజెన్సీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

### సింగూరు ప్రభావిత జిల్లాలపై ప్రత్యేక సమీక్ష

సింగూరు రిజర్వాయర్ మినహా ఇతర రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన నీటి నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌పై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళికలు, నీటి వనరుల సమర్థ వినియోగం, నిరంతర పర్యవేక్షణతో రానున్న వేసవిలోనూ ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



# మధ్యవర్తులను సంప్రదించి మోసపోవద్దు

- సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.మోహన్ రావు

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 17(జనం సాక్షి) :** హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్లాట్లు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు లో మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె మోహన్ రావు అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్ లో శనివారం లబ్ధిదారుల సమావేశంలో మోహన్ రావు మాట్లాడుతూ 2013లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్లాట్లు పొంది, తదనంతరం వాటిని కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లబ్ధిదారులకు హైకోర్టు తీర్పు ప్రకారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ,హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేస్తూ, ప్లాట్లు కోల్పోయిన బాధితులకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు బాధితులు తెలిపారు. అలాగే, ఈ విషయమము నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి గారిని కలిసి హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను, వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందనీ,ఎంపీ దీనిపై సానుకూలంగా స్పందిస్తూ, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.త్వరలోనే గద్వాల శాసనసభ్యుల సహకారంతో, ప్రజాప్రతినిధుల మద్దతుతో ప్లాట్లు కోల్పోయిన అర్హులైన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తవుతుందని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె. మోహన్ రావు అన్నారు.ఈ సమావేశంలో ప్లాట్లు కోల్పోయిన లబ్ధిదారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అమర పోలీసుల స్ఫూర్తితో..

# 157 మంది రక్తదానం

- గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం






**హైదరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి) :** పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శని వారం నిర్వహించిన ఈ రక్త దాన శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రజాసేవతో పాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. గ్రేహౌండ్స్‌లో మూడు వారాల పాటు 'జంగిల్ ఆపరేషన్స్ అండ్ సర్వైవల్ టాక్టిక్స్'లో శిక్షణ పొందుతున్న 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సైతం రక్తదానం చేశారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్‌కుమార్ (ఐపీఎస్) కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎం.డి. అష్ఫాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి. శంకరయ్య, జి. రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి. హెచ్. రఘునందన్‌రావు, గ్రేహౌండ్స్ వైద్యాధికారులు డాక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి. మంజురెడ్డి, ఆక్టోపస్ వైద్యాధికారి డాక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు.

# పుస్తక జెండా రాజేశ్వరరావు

- ఇక ఏటా రాజేశ్వరరావు పేర సాహిత్య అవార్డులు
- 'విరాజితుడు' పుస్తకావిష్కరణలో ప్రకటన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పుస్తకానికే జీవితాన్ని అంకితం చేసిన రాజేశ్వరరావు పుస్తక ప్రదర్శనల జెండాగా నిలిచిపోయారని పలువురు కవులు, సీనియర్ సంపాదకులు తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపక సభ్యులుగా, అధ్యక్షులుగా, కార్యదర్శిగా పలు కీలక బాధ్యతలను 38 పుస్తక ప్రదర్శనలను నిర్వహించటంలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పుస్తక ప్రియుల మనస్సుల్లో రాజేశ్వరరావు చిరస్థాయిగా నిలిచి ఉంటారని వివరించారు. రాజేశ్వరరావు మరణం పుస్తకానికి పెద్దదిక్కు కోల్పోయి నట్లైయిందని తెలిపారు. నగరం లోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో శనివారం సాయంత్రం 'విరాజితుడు" పి.రాజేశ్వరరావు స్మరణిక పుస్తకాన్ని ప్రఖ్యాత కవి డా॥ఎన్.గోపి ఆవిష్కరించారు. తొలి ప్రతిని రాజేశ్వర్ రావు సతీమణి ఐదుకల్లు జ్యోతిర్మయికి అందించారు. ఈ సందర్భంగా డా॥ ఎన్.గోపి మాట్లాడుతూ "రాజేశ్వరరావు ఇక లేడంటే / ప్రచురణలు దిక్కులేనివైనాయి / నా రచనా జీవితంలో / ఆయన ఓ మైలురాయి / ఆయన జ్ఞాపకాలు / ఎప్పటికీ పాతబడని పుస్తకాలు" అని ఆయన కవితాత్మకంగా వ్యక్తీకరించారు. కొత్త పుస్తకం వచ్చిందంటే విశాలాంధ్ర రాజేశ్వరరావుకు ఎవరైనా ఫోన్ చేయాల్సిందేనన్నారు. పుస్తక ప్రియుల మనస్సుల్లో ఆయన స్థానం ఎప్పటికీ చెరిగిపోనిదని తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ఆయన పుస్తక ప్రదర్శనల జెండాగా ఎప్పటికీ రెపరెపలాడుతూ ఉంటారని చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ జాతీయ పుస్తక ప్రదర్శనగా ఎదగడంలో ఆయన కృషి మరువలేనిదని చెప్పారు. మహానగరాల నుంచి పుస్తకాలను మారుమూల పల్లెలకు తీసుకపోవడంలో రాజేశ్వరరావు ఆలోచనలు మరువలేనివని చెప్పారు. ప్రతి ఏటా సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లోని ఉత్తమ రచనలకు రాజేశ్వరరావు పేరున అవార్డులు ఇవ్వాలని సాహితీ మిత్రులు నిర్ణయించారని ప్రకటించారు. ప్రముఖ కవి, సీనియర్ సంపాదకులు సతీష్ చందర్ మాట్లాడుతూ రాజేశ్వరరావు తెలుగు సమాజంలో పుస్తకాల యంగా నిలిచిపోయారని అభివర్ణించారు. తెలుగునాట రచయితలు, సామాజిక కార్యక ర్తలు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాల ప్రజల నుంచి ముఖ్యమంత్రులదాకా రాజేశ్వరరావుతో పుస్తకాల పరిచయం ఉండేదని గుర్తుచేశారు. పుస్తకాన్ని హైదరాబాద్ నగరంలో ఒక వినాయకుని ఉత్సవంలా, రంజాన్ పండుగలా, క్రీస్తు పుట్టినరోజు పండుగలా డిసెంబర్‌లో పుస్తకాల పండుగను అతి ఘనంగా జరపడంలో రాజేశ్వరరావు కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం మాట్లాడుతూ తెలుగులో ప్రచురణరంగానికి గౌరవ ప్రతిష్టలు తెచ్చిన వ్యక్తి రాజేశ్వరరావు అని అన్నారు. తెలుగులో పుస్తకమంటే మొదటగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ గుర్తుకు వచ్చేలా చేశారని తెలిపారు. ప్రచురణ సంస్థలు సమృద్ధిగా, పుష్టిగా వుంటే ఆర్థికంగా నిలదొక్కుకుంటే మరిన్ని పుస్తకాలు వస్తాయని రాజేశ్వరరావు దార్శనికంగా ఆలోచించారని పేర్కొన్నారు. పెట్టుబడిలాంటి పుస్తకాలు తెలుగులోకి రావటానికి దారివేసిన వ్యక్తి అని, ప్రచురణను కళగా ఆరాధించిన వ్యక్తి కొనియాడారు. ఈ సభకు తెలంగాణ పబ్లికేషన్స్ అధినేత కోయ చంద్రమోహన్ అధ్యక్షతన వహించగా, రామానందతీర్థ గ్రామీణ విద్యాసంస్థ ఛైర్మన్ నారా కిషోర్‌రెడ్డి, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి ప్రొఫెసర్ వై.వెంకటేశ్వర్లు, సిపిఐ మాజీ నాయకులు పి.శ్రీనివాసులు నాయుడు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ పూర్వ కార్యదర్శి శ్రుతికాంత్ భారతి, ఏఐటియుసి నాయకురాలు ప్రేమ్ పావని, నవచేతన మేనేజర్ పి.నారాయణ రెడ్డి, సురవరం విజయ లక్ష్మి, పి.శైలజారావు, పి. గౌతమి తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.



# ఎస్ఐ శ్రీకాంత్ సస్పెన్షన్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 17 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ, జోన్-3 రాజన్న ఇన్‌చార్జి డీఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ శనివారం రోజున ఉత్తర్వులు జారీ చేశారు.విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, థర్డ్ డిగ్రీ చేసారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని ఆదేశించారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



- క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి: మంత్రి వాకిటి శ్రీహరి
- వనపర్తి ఛాంపియన్షిప్ కప్ - 2026 తరహా పోటీలను వచ్చే ఏడాది దసరాకు అన్ని జిల్లాల్లో నిర్వహిస్తాం

**వనపర్తి (జనంసాక్షి) :** క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్-2026 ముగింపు కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా కలెక్టర్‌కు ట్రోఫీ నిర్వహించాలని వచ్చిన వినూత్న ఆలోచన అభినందనీయమన్నారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనే ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకే కుంగిపోకుండా, క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. యువతకు మానసిక స్థైర్యాన్ని అందించేలా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. వచ్చే దసరాకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ తరహా ట్రోఫీ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. మన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తా కలిగి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. వనపర్తి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ వంటి క్రీడాకారులు తమ ప్రతిభతో దేశానికి గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. డిసెంబర్ లో ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా 22 క్రీడాంశాల్లో, 29 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీలు మన రాష్ట్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ఆట ఎవరి సొత్తు కాదని, నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం ఉన్నవారే విజయాలు సాధిస్తారని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం కృషి చేస్తే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

- కార్మిక సంక్షేమం, సంస్థ విస్తరణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- సింగరేణీయులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షల లేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సుస్థిర భవిష్యత్తు కోసం కొత్త గనుల సాధన, థర్మల్, సోలార్ రంగంలో బహుముఖ విస్తరణకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క తెలిపారు. మారుతున్న బొగ్గు మార్కెట్‌లో పోటీని ఎదుర్కొంటూ సంస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూగర్భ, ఉపరితల గనుల్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కార్మికులు వెలికితీసే బొగ్గు తెలంగాణ విద్యుత్ అవసరాలకు, రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తి అని అన్నారు. ఎల్ నినో ప్రభావం వంటి వాతావరణ సవాళ్ల వేళ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరంగా జరిగేలా మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మారుతున్న బొగ్గు మార్కెట్‌లో ఇతర సంస్థలతో పోటీపడాలంటే నాణ్యమైన బొగ్గును సరసమైన ధరకు అందించడం, ఉత్పాదకత పెంచడం, అనవసర ఖర్చులను తగ్గించడం అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని, యంత్రాలను పూర్తి పని గంటలు సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భద్రతకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని, ప్రతి కార్మికుడు క్షేమంగా ఇంటికి చేరడమే తొలి విజయమని స్పష్టం చేశారు. 137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని భావితరాలకు మరింత బలంగా అందించేందుకు కొత్త గనుల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామని, తాడిచెర్ల-2 బ్లాక్‌కు మైనింగ్ లీజు పొందామని చెప్పారు. మణుగూరు ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్-2 డీప్ సైడ్ బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకున్నామని, సత్తుపల్లి-3, కోయగూడెం-3 బ్లాక్‌లను తిరిగి సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వివరించారు. బొగ్గుతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, బంగారం, రాగి, ఇతర కీలక ఖనిజాల రంగాల్లోనూ సంస్థను విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

### కార్మికుల సంక్షేమానికి చర్యలు

కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఇటీవల నిర్వహించిన సమీక్షలో పలు ఆదేశాలు ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియలను వేగవంతం చేయాలని, మారు పేర్లకు సంబంధించిన సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు. సింగరేణి భూముల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు నెహ్రూ హౌసింగ్ కాలనీల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల స్థానంలో కొత్త నివాసాల నిర్మాణం, కార్మిక కాలనీల అభివృద్ధి, ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు, క్యాథ్ ల్యాబ్ సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఆరు నెలలకొకసారి సేఫ్టీ కిట్లు పంపిణీ చేయాలని, పెర్క్స్, అలవెన్సులపై ఆదాయపు పన్నుకు సంబంధించిన కార్మికుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించినట్లు పేర్కొన్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం, అంటే సుమారు రూ.596 కోట్లను కార్మికులకు లాభాల వాటా బోనస్‌గా పంపిణీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన ప్రతి రెగ్యులర్ ఉద్యోగికి సగటున రూ.1,53,912 అందిందని, కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లించినట్లు చెప్పారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా అందించడం వారి కృషికి ఇచ్చే గుర్తింపని అన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370